మూడవ సంపుటము. ] [మూడవ భాగము.

# గ్రంథాలయ సర్వస్వము.

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ పక్షమున సంవత్సరమునకు ఆరు
భాగములు చొప్పున ప్రకటింపబడు గ్రంథము.

పరబ్రహ్మాత్మికాందేవీం ♦ భుక్తిముక్తిఫలప్రదాం
ప్రణమ్యస్తామితామేవ ♦ జ్ఞానశక్తింసరస్వతీం.

కార్యస్థానము:

బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు
బి. కే. స్వామిచే ముద్రింపబడియె.

౧౯౧౮

వార్షికమూల్యము. రు 3-0-0] [విడిభాగము వెల రు ౦-౮-౦.

ఐదవ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ — మొదటిదినము:— ౮౩

ప్రారంభము. ,,

స్వాగతము. ,,

— సెట్టి లక్ష్మీనరసింహ్వంగారు.

ఉద్బోధన. ౮౪

— కోన వేంకటరాయ శర్మగారు.

ఆహ్వాన సంఘాధ్యక్షుల ఉపన్యాసము

— శ్రీ విక్రమదేవవర్మగారు. ౮౫

ప్రాచీన గ్రంథాలయములు ౮౬

వర్తమాన గ్రంథాలయములు ౮౮

గ్రంథాలయముల [illegible]ణము ౯౦

గ్రంథాలయోద్యమము ౯౨

ఆధునికాంధ్ర సారస్వతము ౯౩

గ్రంథాలయ విధులు ౯౪

ఉపసంహారము ౯౫

అగ్రాసనాధిపతియొక్క ఎన్నిక ,,

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము, ౧౯౧౭—౧౯౧౮ సంవత్సర వృత్తాంతము

—అయ్యంకి వేంకటరమణయ్యగారు. ౯౬

కడచిన సభ ,,

గంజాము జిల్లా గ్రంథాలయ సంఘము ,,

"వాణిశ్రీ"వారి దానము ,,

నూతనశక ప్రారంభము ౯౭

మండల గ్రంథాలయములు ,,

గ్రంథములను గూర్చిన ఇతర సహాయము ,,

సంచార గ్రంథాలయములు ౯౮

వానికి గ్రంథ సహాయము ౯౯

మాజీకుక్క లాంతరు ,,

నూతన భవనములు ,,

యుద్ధభటులకు గ్రంథసహాయము ౧౦౦

భారతవర్ష గ్రంథాలయ సభ ,,

దేవాలయములు-గ్రంథాలయములు ,,

పురపాలక సంఘముల సహాయము ౧౦౧

జిల్లాబోర్డువారి సహాయము ,,

ప్రభుత్వమువారి సహాయము ,,

హిందూపత్రికయందలి వ్యాసములు ,,

మార్గదర్శకము ౧౦౨

గ్రంథాలయముల చరిత్ర ,,

ఉద్యమవ్యాపన ,,

జిల్లా తాలూకా సంఘములు ,,

సంచార కార్యదర్శి ౧౦౩

గ్రంథాలయ శాస్త్రగ్రంథములు ,,

రామ ప్రసాదము ౧౦౩

నవ ఉద్యమ ప్రాశస్త్యము ౧౦౪

గ్రంథాలయ సర్వస్వము ౧౦౫

భవిష్యత్తు ,,

కేంద్ర గ్రంథాలయము ౧౦౬

ఆదాయ వ్యయములు ,,

సభ నలంకరించిన పెద్దలు ౧౦౭

ఉత్తరములు ,,

రెండవ దినము ౧౦౮

తీర్మానములు ,,

మూడవ దినము ౧౦౯

ఉపన్యాసములు ,,

తీర్మానములు ,,

ఆశీర్వచనము ౧౧౦

—దివాకర్ల తిరుపతి శాస్త్రిగారు

గ్రంథాలయములు (పద్యములు) ౧౧౧

—చెళ్ళపిళ్ళ చిదంబర శాస్త్రిగారు

ద్వితీయ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రదర్శనము ప్రథమభారత పత్రికాప్రదర్శనము

ఆహ్వాన సంఘాధ్యక్షుల ఉపన్యాసము.

పత్రికలు ౧౧౨

సంచారగ్రంథాలయ పేటికలు ,,

గ్రంథవిభజన పేటిక ,,

గ్రంథాలయ భవనములు ౧౧౪

గ్రంథాలయ శాస్త్రగ్రంథములు ,,

అముద్రిత గ్రంథములు ,,

గ్రంథాలయముల పటములు ,,

ఇతర పటములు ౧౧౫

బాలశాఖ ,,

ధనుర్వేద విశారదులును, కలియుగార్జునులును నగు శ్రీ గుండవరపు అప్పారావుగారి కల్పింపబడిన స్వాగత పద్యములు ౧౧౬

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము నిబంధనలు ౧౧౭

ఉద్దేశములు ,,

కార్యనిర్వాహణము ,,

సామాన్య సంఘము ,,

కార్యనిర్వాహకసంఘము ౧౨౦

సేవకసంఘము ౧౨౧

సేవకులు ౧౨౨

విజ్ఞప్తి ౧౨౪

బాలసాధకకరణము, పద్యములు,

మంగిపూడి వేంకటశర్మగారు ,,

## చిత్రపటములు

ప్రథమ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ—ప్రతినిధులు ౮3

ద్వితీయ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రదర్శనము—ప్రథమ భారత పత్రికా ప్రదర్శనము. (రెండుపటములు) ౮3

## రాజపోషకులు

శ్రీ శ్రీరాజా రావు వేంకట కుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు

శ్రీ శ్రీరాజా నాయని వేంకట రంగారావు బహద్దరుగారు

శ్రీ శ్రీబెల్లంకొండ రాఘవరావుగారు, అగ్రహారందారు

## పోషకులు

శ్రీ శ్రీరాజా మోతే గంగరాజుగారు

శ్రీ శ్రీరాజా గోవిందకృష్ణయాచేంద్రబహద్దరుగారు

శ్రీ శ్రీరాజా కోటగిరి వేంకటకృష్ణారావు బహద్దరుగారు

శ్రీమద్దుల రామయ్యగారికుమారుడు వేంకటచిన్నరాజు శ్రేష్ఠిగారు

చిగురుపాటి వేంకటసుబ్బారావుగారు

బండి వేంకటకృష్ణయ్యగారు

శ్రీ లక్ష్మీకాంత పుస్తకభాండాగారము, కొవ్వూరపాడు

నాళం కృష్ణారావుగారు

కుప్పా శ్రీరామశర్మగారు

పోణకా పట్టాభిరామారెడ్డిగారు

## అభిమానులు

శ్రీ శ్రీరాజా చెలికాని లక్ష్మారావుగారు

అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారు, ప్రొప్రైటరు

పెద్దిభొట్ల వీరయ్యగారు, బి.ఏ., బి.యల్.,

అయ్యదేవర కాళేశ్వరరావుగారు, బి.ఏ., బి.యల్.,

సూరి వేంకటనరసింహశాస్త్రిగారు, బి.ఏ.

గూడూరి లక్ష్మణరావుగారు, బి.ఏ.


అద్దంకి సత్యనారాయణ శర్మగారు

బొడ్డపాటి హనుమంతరావుగారు

చట్టి నరసింహారావుగారు

## సహాయులు


తూట వేంకటరత్నం నాయుడుగారు



ప్రతినిధులు.

RSVM01 A 109

# ప్రథమభారతపత్రికా ప్రదర్శనము.



ఈపటమునందు వివిధభాషలయందలి పత్రికలను ఒక వైపునను, సంచార గ్రంథాలయ పేటికలను వేరొక వైపునను, గ్రంథవిభజనపేటికను మరియొక వైపునను, చూడగలరు. "పెదపాలెం" గ్రంథాలయ భవనముయొక్క ఆకారము గూడ ఇందు కనబడుచున్నది.



ఈపటమునందు ఏలూరు హిందూయువజన సంఘము వారిచే ప్రదర్శింపబడిన "మాజిక్కు" లాంతరును, బాలుర కొరకై ప్రత్యేక మేర్పరుపబడిన పాత్రములను, అంగలూరు బాలసరస్వతీ గ్రంథాలయమువారిచే ప్రదర్శింపబడిన శారీర శాస్త్రవిషయిక పటములును గలవు.



పరబ్రహ్మాత్మికాం దేవీం ♦ భుక్తిముక్తిఫలప్రదాం
ప్రణమ్య స్తౌమితామేవ ♦ జ్ఞానశక్తిం సరస్వతీం.

మూడవ సంపుటము.

# గ్రంథాలయ సర్వస్వము.

మూడవ భాగము.

## ఐదవ ఆంధ్ర దేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ

విశాఖపట్టణమున నున్న పురమందిరమున ౧౯౧౮ సంవత్సరము జూను నెల ౨౨వ తేదీ సాయంకాలము ౪ గంటలకు ఐదవ ఆంధ్రదేశగ్రంథాలయ ప్రతినిధుల మహాసభ ప్రారంభమాయెను. ప్రథమమున చింతవెంట వేంకటరమణయ్యగారు ప్రార్థనను జేసిరి.

అనంతరము సెట్టి లక్ష్మీనరసింహంగారు ఈక్రింది స్వాగతపద్యములను జదివిరి:—

స్వాగతము మీకు మాకు విశాఖపురికి
ఆంధ్ర భాషాభిమానులారా, నిరంత
రాంధ్రదేశాభిమానులారా, కయికొనుఁ
డాంధ్రసోదరులారా, మాస్వాగతమ్ము.
ధృఢముగాఁగ భాషాసేవ దేశసేవ-
గాఁ దలఁచి, కవులయి గ్రంథకర్తలయి తె
లుంగు బాసకు పెంపు నొసంగుచున్న
ఆర్యులార, మీకెల్లను స్వాగతమ్ము.
భాషకభివృద్ధి గల్గింప పత్రికాధి
పతులగుచు తగు వ్యాసముల్ ప్రచురణమ్ము
చేసి, దేశమ్ము నావరించిన తమమ్ముఁ
బాపు మిత్రులారా, మీకు స్వాగతమ్ము.
వ్రాఁత చేఁత గాకున్న, భాషాతరుణికి
సేవ యితరవిధమ్ములఁ జేయఁ దలఁచి,
గ్రంథమాలల నెలకొల్పి, గ్రంథములను
సేకరించి, విద్యావ్యాప్తి చేయుచున్న
యట్టి యయ్యలారా, మీకు స్వాగతమ్ము.
శమదమాదులకోర్చి, గ్రామముల నగర
ములను గ్రంథభాండాగారములను నిలిపి,
జ్ఞానధనమును సామాన్యజనులకు వెద
చల్లెడి ఉదారమతులారఁ స్వాగతమ్ము.
ఏకడను లోకమున భారతీకటాక్ష-
మున్నొ లక్ష్మీకటాక్ష మందుండ దనుచు
కవుల నాదరించి, సమస్తగతుల నాంధ్ర
భాష బోషించు ప్రభులార, స్వాగతమ్ము.
అచల భాషాభిమాన దేశాభిమాన
సహితులగుచు వ్యయప్రయాసముల కోర్చి,
ఉక్కయనక, మహామారి కోడక, యిట
కరుదెంచిన మీకెల్ల స్వాగతమ్ము.
ఐకమత్యంబుచేతనే చేకుఱఁదగు

పని యిదంచు మీ మీ యభిప్రాయ భేద
ములను మఱచి, యేకీభావమున నిచటికి
వచ్చినట్టి మీకెల్లను స్వాగతమ్ము.
ఆంధ్రభాషా విషయములయందు మాది
తెనుఁగు జిల్లాల గ్రొడ్డుపోయినదియనక,
వచ్చినారు గదా మీర? లెచ్చటెచట
నుండి యన?—మనమాడు తెనుంగు బాస
కాదిపీఠమైనట్టి నన్నయకవి నగ
రసుగు రాజమహేంద్రవరంబునుండి,
తెలుఁగు బాసకు దిక్కగు తిక్కనకవి
కునికిపట్టయినట్టి గుంటూరునుండి,
ఆంధ్రకవితకు పాదులైనట్టి యితర
పట్టణమ్ములనుండియు అట్టి మీరు
నందఱకు నెల్లగతులను స్వాగతమ్ము.
తగిన రీతిని మీకు సత్కారము నొన॰
రింపఁగా మాదు జిల్లా కదృష్టమున్న
యెడల, జీవించియే యుండు నిపు డభినవ
కృష్ణరాయలటన్న సత్కీర్తిగన్న
శ్రీమదానందగజపతి క్షితిపమౌళి ;
ఆ మహారాజె యున్న మీకకట! యిప్పు
డే గతి నొసంగి యుండునో స్వాగతమ్ము.
తగిన వాక్కులతో స్వాగతమ్ము మీకొ
సఁగఁ దగిన వారలిపుడు మా నగరమున నె
వరు?—మహామహోపాధ్యాయబిరుదధుర్యు
లు, పరవస్తు రంగాచార్యులును గతించి
రా మహాపండితుఁడె యున్న యిట్టి యెడల,
అమరగంగాతరంగఘుంఘుమరవాను
కారి వాగ్గుంభనముల నేగతిని మీకొ
సంగి యుండునో యిప్పుడు స్వాగతమ్ము?
స్వాగతపుఁ బద్యములను మత్సదృశుఁడేల
వ్రాసి యుండును? శ్రీమండపాక పార్వ
తీశ్వర కవీశ్వరుఁడె యున్న యెడ, నవార
విందమకరందరసబిందుబృందమాధు
రీకలిత పద్యమాలికానీకముల నొ
సంగి యుండెడే మీకిపు స్వాగతమ్ము?

అట్టిగౌరవమ్మేమి చేయంగ లేమి
కస్మదసమర్థతయె హేతువని గ్రహించి,
జరుగనట్టి గౌరవములు జరిగినట్లె
తలఁచి, లోపములెల్ల లోపలనె మఱచి,
అందుకొనుఁడందఱును మాదు స్వాగతమ్ము.

పిమ్మట కోన వేంకటరాయశర్మగారీపద్యములను
జదివిరి:—

సీ. ఘనవిక్రమస్ఫూర్తిఁ గాంచిన ఖడ్గ తి
        క్కనముఖ్యు లొసగిన గౌరవంబు
    తిక్కనాదికకవి ధీరులొసంగిన
        లలితకవిత్వ విలాస మహిమ
    కృష్ణరాయాది క్షితినాథులిచ్చిన
        నవకళాసర్వ సౌందర్యగరిమ
    కాలానుసారంబుగా నెందనెందటో
        దీపించియుడినట్టి దివ్యధనము
    లెల్లఁగోల్పోయి దీనత నేపుఁదక్కి
    నట్టిమీయాంధ్రమాత! దయార్ద్రదృష్టిఁ
    బఱపి, సన్మాతృభక్తిని నెఱపుఁడయ్య
    వినయధనులార! బహుళాంధ్రతనయులార!

ఉ. సారవిశాల విశ్వజన
        సంఘసముద్ధరణక్రియాపర
    త్వారమణీయవైభవము
        నందగ జేసిన దేశమాత! స
    ద్ధీరత, కార్యశూరత, సు
        ధీమహిమంబును, త్యాగబుద్ధియుఁ
    గూరుచుఁగాత, మీరల క
        కుంఠిత సర్వకలాభివిజ్ఞతన్.

చ. మత, ధన, నీతి, సత్కళల
        మానితమై, నవఖండ మేదినీ
    క్షితి తిలకాయమానమై,
        చెన్నువహించిన భారతావనీ
    సతి, భవదీయమాత! తన
        సంతతి క్రమ్మఱవృద్ధినొంద నం

చిరముగఁ గోరుచున్నయది,
చిత్తమునం గలకింపుఁ డాంధ్రిజుల్.

చ. ఘనలను గూర్మిగాంచి, యభి
మానముతో ననుపంగజాలి జే
వనమునొసంగి, యద్భుత కృ
పామతిఁ జూచి, సలక్షణంబుగా
దన యసమాన చాతురి యు
ధాపధిఁ గన్నులఁ గట్టినట్టులుం
డిన ఘనయాంధ్రమాతను ద్ర
ణీకరణం బొనరింపకుండ సే
వను తగుపద్ధతి న్సలిపి,
స్వార్థపరత్వము వీడి యల్లిఁగ
ఋణమును దీర్ప దీక్షను వ
హింపగ సోదరులెల్లఁ బ్రార్థితుల్.

ఉ. వీణయుఁ జేతఁబూని, పృథి
వీజనసన్నుతమైన సత్కళా
జ్ఞానము, గాలము న్వెలయఁ
గమ్మని నాదము, దేవనాదముఁ
బూనికఁ గూర్చి సద్భవన
మోహనగానము సేయు శారదా
మానిని, దివ్యవిగ్రహము
మానసకలోన భజింపుఁ డాంధ్రజుల్.

అప్పుడు ఆహ్వానసంఘాధ్యక్షులగు శ్రీవిక్రమదేవవర్మ గారు ప్రతినిధులకు స్వాగతమొసంగుచు నిట్లుపన్యసించిరి.

### ఆహ్వానసంఘాధ్యక్షుల ఉపన్యాసము

"ఆర్యులారా! ఆంధ్రగ్రంథాలయముల యీ యైదవ మహాసభకుఁ దయ కందఱకు నాహ్వానసంఘపక్షమున హృదయపూర్వకమగు స్వాగతము నొసంగుచున్నాఁడను. కృపామతులును, దేశసేవానిరతులును, భాషాభిమానరతులు నగువారందఱును పెక్కు నిక్కట్టుల కోర్చి, యీ గ్రీష్మకాలమున నూష్మబాధను సరకుసేయక పను లడ్డగించిన వాని వారించుకొని మించు తాల్మితో దూరాధ్వముఁ గడచి యీ మహాసభకు విచ్చేసితిరి. మాచేయు సత్కార మల్పమైన, నాదరభావమును సోదరస్నేహమునను గొంతలేకుండుటం దప్పులను సైఁచి యొప్పులుగ గ్రహించి మాయూహలు క్రియారూపమును జెందకున్న నది శక్తిలోపము గాని భక్తిలోపము గాదని విశ్వసింపఁ వేఁడుకొనువాఁడను.

మా విశాఖపురీభాగ్యవశమున మహనీయులరగు తారందఱు నిమ్మహాసభను సమావేశమైతిరి. బుధగురు కవిసంసేవితమై, మిత్రద్విజరాజ విభ్రాజితమై, మంగళధ్వజశోభితమై, దివ్యప్రభానంతవిభూతి వెలుంగు జ్యోతిర్మండలము భాతి విరాజిల్లు నీపేరోలగమునఁ దెలుంగుఁ బలుకుఁ జెలి నిండుఁగొలువుండుటఁ గనులారఁ జూడఁ గంటిమి. మా విశాఖపురి పురాతనపుటభేదనములలో నొకటియై కుళోత్తుంగచోడదేవుని కాలమునుండియుఁ బ్రశస్తిగాంచినట్లు చరిత్రాత్మక నిదర్శనములు గలవు. నాఁటంగోలెఁ బెక్కుమార్పులను జెందినను మానగరము సమశీతోష్ణమై ప్రకృతిశోభారామణీయకమై మలయానిలవిహారోద్యానమై తోయనిధితోయములు శ్రీవిశాఖస్వామి పాదకుశేశయములకుఁ బాద్యము లొసంగుచుండ తద్దివ్యనామమును బడసి విరాజిల్లును. తురకలిసాక్ మదీనాపీరు పేరున నిది పరఁగినదని పేర్కొందురు. అది చింతనీయము. మతవైమనస్యజ్వాల లిటఁ జల్లారిన వనుటకుఁ దార్కాణముగ రామకొండ నాశ్రయించు త్రిమతముల దేవళములే సాక్షీభూతములు. ఫరాసు సిబ్బందుల గెల్చి యాంగ్లహస్తవిన్యస్తముగ నీరేవు నర్పించిన దేశహితుండు విజయనగరపాలకుండయిన యానందగజపతీంద్రుఁడు. మా విశాఖపట్టణమండలము బ్రిటిషుప్రభుత్వమునకుఁ బూర్వము స్వతంత్రాధికారములతో రాజ్యముచేసిన ప్రసిద్ధవంశజులయిన రాజాధిరాజుల నివాసస్థలమైయుండెను. ఇప్పటికిని దొమ్మిదిపాళ్ళు జమీందారియు నొకపాలు దొరతనమువారి నేలయునై యున్నది. మన ప్రభువులు విద్వత్పక్షపాతముగలవారలై కొలువుకూటములు పండితసభలుగా నిరంతరమును విద్వద్గోష్ఠితోఁ గాలముఁ బుచ్చుచుండిరి. అగ్రహారములు, మాన్యములు మొదలయిన పెక్కు బహుమతులతోఁ గవులు, పండితులు, గాయకులు, వైద్యులు, శిల్పకారు

లు మున్నగువార లెన్నియో విధముల నాదరింపఁబడి యథార్హరీతిని బోషింపఁబడుచుండిరి. ప్రభువుల యాస్థానములు విద్యానిలయములై యొప్పుచుండెను. మా మండలమున జననమొంది నివాసముగాంచి వాసిఁజెందిన కవీంద్రులసంఖ్య లెక్కించినచో నితరమండలముల కవుల సంఖ్యకుఁ దక్కువ గానేరదు. ఆంధ్రవాఙ్మయ ప్రపంచమున వినుతిగాంచిన యాదికవీంద్రుల కాటపట్టుగాకున్నను నడిమింటి సర్వమంగళేశ్వరశాస్త్రి శ్రీమన్మహామహోపాధ్యాయ శ్రీ పరవస్తు వేంకటరంగాచార్య మండపాక పార్వతీశ్వరశాస్త్రి ప్రభృతి సద్వత్కవివరేణ్యులకును- అడిదము సూరనార్య మంత్రి పెగడ సూర్యప్రకాశకవి శ్రీపాద చలమయాది ప్రబంధకవులకును- శ్రీమదానంద గజపతీంద్రమహారాజ శ్రీమృత్యుంజయ నిశ్శంకాది మహీపాల కవిశ్రేష్ఠులకును-కందాళ రంగనాయకమ్మ మదిన సుభద్రయ్యమ్మ మొదలుగాఁగల కవయిత్రీవర్గమునకును మామండల మాకరంబు గాకపోలేదు. నేఁటికిని కపోతావధూటిని నూతనాలంకృతులఁగైసేయు కవిచంద్రులు పెక్కండ్రు గలరు. వారిలో శ్రీమాన్ ముడుంబై నరసింహాచార్యులుగా రుభయ భాషాకవిత్వ ప్రౌఢిచేఁ బూర్వకవుల మెప్పింపఁదగినవారు. శ్రీ గొడే వేంకట జగ్గారావుగారి గణితశాస్త్ర ప్రావీణ్యమును జ్యోతిషశాస్త్ర విజ్ఞానమును విచ్చట నక్షత్రశాలాముఖమున నిప్పటికిని బ్రకటితము లగుచున్నవి. విజయనగరాధిపతులయొక్కయు బొబ్బిలి ప్రభువులయొక్కయు మాడుగులు భూపతులయొక్కయు నాస్థానములు పండితకవిమండితములై యొప్పుచుండెను. శాస్త్రములును గళలును వాఙ్మయమును మా మండలమున భూమండలాఖండలులవలన లెస్సగఁ బోషింపఁబడుచుండెనని వేఱుగ నుడువ నక్కఱలేదుకదా. ప్రభుని కేతనములు సరస్వతీ నిలయములై విరాజిల్లుచుండె ననుటకు నేఁటికిని కోటలలో నిండియుండు నమూల్యములగు పుస్తకభాండాగారములే తార్కాణములయి యున్నవి.

## ప్రాచీన గ్రంథాలయములు.

భరతవర్షమునఁ బూర్వకాలమునందుఁ బ్రభుసౌధములును దేవప్రాసాదములును బండితసామంతజననికాంలంబులును బౌద్ధవిహారములును బుస్తకభాండాగారములై పరఁగుచుండెను. శారదనవరాత్రులందుఁ బుస్తకరూపిణీ సరస్వతీపూజ విధింపఁబడియుండుటవలనఁ బెద్దలకుఁ బొత్తములయం దెట్టిభక్తియుండెనో మనకుఁ దేట తెల్లముగఁ దెలియుచున్నది. పూర్వకాలమున మహోత్కృష్టములగు గ్రంథములు మాత్రము పండితమాన్యతను బడసి భూర్జపత్త్రములపైని దాళపత్త్రములపైని లిఖింపఁబడి భాండాగారముల సేకరింపఁబడుచుఁ బెన్నిధానములుగ నెన్నుకొనఁబడుచుండెను. గ్రంథముల సంగ్రహింపఁదలఁచినచో దూరాధ్వములు గడచి శ్రమముల కోర్చి, బహుకాలాయాసమున లిఖించుకొని వాంఛలను బరిపూర్తిగావించుకొనవలసివచ్చుచుండెను. ఇంచుకేని పాండిత్యము లేనివారలకు గ్రంథాలయసందర్శనమే దుర్ఘటముగా నుండెను. స్వహస్తలేఖనమువలన మనపండితులకుఁ దెలిముత్తెముల చాలనఁదగు వ్రాలును గిలెటింగిన చదువును నలవడుచుండెను.

అక్షరచణులగువారు లిపికారత్వమున నింపైన నైపుణిని బొందియుండెడివారు. విచిత్రలేఖనమున నుత్తమగ్రంథములు మాలికలుగను, వీవనలుగను, మత్స్యాకృతిని, పక్షిరూపమునను నింకను బలుదెఱంగుల వ్రాయఁబడుచు, సరసుల హృదయముల నాకర్షించుచుండెను. ముద్దులు మూటగట్టుచు మతి చూచినతోడనే కనుల నరికట్టివైచుచు నక్షమాలికవలెఁ బ్రకాశించు నక్షరపంక్తి యిపుడరుదై తోఁచుచున్నది. లేఖనకళాదీప్తి మందమై కానవచ్చుచున్నది. అచ్చువలె వ్రాయనేర్చిన లిపికారుల నేర్పు నశింపకుండఁదగు ప్రయత్నములు సలుపఁబడుంగాక! ప్రపంచముయొక్క పూర్వచారిత్ర మాయాదేశముల వాఙ్మయమువలననే తెలియఁదగి యున్నది. యుగాంతరములఁ గడచి సమధికవయోజీర్ణదశచేఁ గృశించియు నట్టి కార్శ్యముననే వింతతేజమున విరాజిల్లు విజ్ఞానమయమగు ప్రాచీనభాషావాఙ్మయమే ప్రపంచచారిత్రమునకు మూలాధారమైయున్నది. అస్సిరియాదేశపు శిలీముఖాక్షరశాసనములును, ఈజిప్టు రాజ్యమందలి పక్షిమృగాంకాక్షర పంక్తులును,నశోకుని జయస్తంభ

ములును, గతయుగ నాగరకతావిశేషమును సహస్రముఖంబులఁ జాటుచున్నవి. త్రయీ విద్యయం దెట్టి యద్భుత నాగరకతాచిహ్నము లుండినవియు నెట్టి యాధ్యాత్మిక విద్య యుపదేశింపబడియున్నదియు నది యనుభవైకవేద్యము; కాన వేఱుగ విస్తరింపఁబనిలేదు. కాని నాగరకతారుణోదయ ప్రభామరీచికలుమాత్రమందుఁ దోఁచుచున్నవనియును, నట్టి ప్రాభాత సమయమున మానవజ్ఞానము పరతత్త్వాన్వేషణమున సలిపిన ప్రయత్నములు బాలజల్పితముల పగిది మహోపనిషద్విద్యయందు భాసించుచున్నవనియుఁ బాశ్చాత్యపండితులలోఁ గొందఱు నుడువుట యెంతమాత్రమును సరికాదు. మానుషశేముషీప్రభ వెలుఁగొందినంతదనుక వేదములయందును వేదశిఖలందును బ్రతిపాదితములగు నుత్తమరహస్యములను గ్రహించి యుండెనని చెప్పఁజాలము. వేదములు బ్రహ్మముఖోద్గీతములైనను గాకున్నను బ్రాహ్మణములకంటె బ్రాచీనములగునట్టియు వానిని బోలునట్టివియుఁ జదువులేవియును బుడమిని గానరావు. అట్టి యమూల్యధనము మనపాలబడియుండ నద్దాని మన మెట్లుపయోగించుకొనుచున్నామో చెప్పసిగ్గగుచున్నది. త్రయీరహస్యంబులమాట యటుండనిచ్చి ప్రపంచనాగరకతాచారిత్ర పునర్నిర్మాణమునకు హేతుభూతమగు గీర్వాణభాషను గనుఁగొనుఁడు. దేవభాషయని కొనియాడఁబడు సంస్కృతము భాషలకెల్లఁ దల్లియని ప్రసిద్ధిగాంచినది; ఆర్యజనైకభావమును బోధించినది; అభినవశబ్దశాస్త్రపరిజ్ఞానమున వివిధరూపములు దాల్చి వేసములు మాఱియున్న బాస లన్నియు నొక భాషాకల్పకముయొక్క శాఖోపశాఖలని తెలియఁజెప్పినది; దేశమతాచారవిభేదజనితవైషమ్యరహితమగు జాతీయైక్యభావమును బ్రాక్పశ్చిమదేశవిజ్ఞాన ధర్మైక్యమును బ్రబోధించినది; మఱి మన భాగ్యవశమున మన భరతఖండమునందు నది నిక్షిప్తమై యున్నది. దానిని మన ముపయోగించుచుండిన విధమును దలపోయఁ దలలు వంచుకొనవలసి వచ్చుచుండును. లెక్కకు మీఱిన గ్రంథరాజములతో రాజిలుచు షట్శాస్త్రములు చతుష్షష్టికళలు మున్నగు విద్యలకెల్ల నాకరంబై రత్నాకరంబు పగిది శోభిలుచుండిన గీర్వాణవాఙ్మయ మంతయు మనవశమై యుండఁగా, దేశమున స్వాతంత్ర్యమస్తమించి సామ్రాజ్యము పరహస్తగతంబగుటను గొంతవఱకు విద్యలు క్షీణించి విజ్ఞానము తమోవృతము గాఁజొచ్చెను. మన యాంగ్లప్రభువర్యులాదినుండియుఁ దేశభాషాపోషణపరాయణులై, దేశీయమతాచార ధర్మపరిపాలనాతత్పరులై యుండుటను బ్రప్రథమమున సర్ విలియమ్ జోన్సు అను మహనీయుఁడైరోపాఖండము నంతయు నాశ్చర్యనిమగ్నము గావించిన కాళిదాసకృతమగు నభిజ్ఞానశాకుంతలనాటకమును నాంగ్లమున ననువాదమొనర్చి ప్రకటించెను. తదాదిగ భారతీయులకుఁ బాశ్చాత్యపండితవర్యులుగూడఁ బొగడఁదగిన విజ్ఞానవిస్తరంబగు వాఙ్మయము గలదని నెమ్మది నమ్మి పాశ్చాత్యపండితు లనేకులు సంస్కృతభాషాభ్యాసమునకుఁ గడఁగిరి. జర్మనీ, ఆస్ట్రియా, రష్యా, ఫ్రాన్సు, అమెరికా మొదలగు దేశముల విద్వచ్ఛ్రేణ్యులు సంస్కృతభాషను బూర్ణముగ నభ్యసించి తన్మూలమునఁ బెక్కు శాస్త్రసంతతుల నుత్పాదించి విజృంభింపఁ జేయుటయేకాక, సంస్కృతమునఁ గూడ మనపండితులకు దుర్ఘటములగు కార్యములను ఘటియించిరి. మోక్షమూలరు మహాపండితుని యుత్కృష్టభాషాసేవ యందఱకును విదితమే. ఋగ్వేదమును శాయనాచార్యభాష్యముతో శ్రీమదానందగజపతి మహారాజేంద్ర సాహాయ్యమునఁ జక్కగ నచ్చొత్తించి శాశ్వతకీర్తిని బడసెను. ఇంకను బలువురు పలువిధంబులగు సేవలఁ జేసి యున్నారు. పాశ్చాత్యదేశీయులకు గీర్వాణభాషయందు నూతనముగా నుదయించిన యాదరభావమునకు ఫలము మనయమూల్యపుస్తకరత్నములను మనదేశమునుండి తీసికొనిపోయి తమతమ దేశములందలి భాండాగారముల నించుటయే. కావుననే లండను, బెర్లిను, వియన్నా, సెంటుపీటర్సు బర్గు (పెట్రోగ్రాడు) మున్నగు పాశ్చాత్య దేశరాజకీయపుస్తకభాండాగారములయందు మనదేశమునం దిప్పుడు సంగ్రహముగాని యద్భుతగ్రంథము లెన్నియో స్థిరవసతిని గాంచినవి. స్వామిదయానంద సరస్వతిగారు జర్మనీనుండి తెప్పించువఱకును మననాలుగవవేదము మనదేశమున లేకుండెను! లిఖితప్రతుల నన్నింటిని మహోపాధ్యాయ మోక్షమూల

రు మనదేశమునుండి నిజఖండంబునకుఁ దీసికొనిపోయి యుండుట వలన నతఁడు ఋగ్వేదమును ప్రకటింపకున్నచో నది మనకలభ్యమయి యుండును. మన యాంగ్ల ప్రభుత్వమువారి గ్రంథసంగ్రహణకార్యమునఁ గొంచెమాలస్యము సలిపినట్లు కానవచ్చెడిని. అట్లయినను బ్రిటిషు మ్యూజియములోని ౯౬,౦౦౦ గ్రంథములు ప్రాచ్యవిద్యలతో సంబంధించినవని తెలియుచున్నది. వంగదేశమందలి యేష్యాటిక్ సొసయిటీ మొదలగు పండితసభల వలనఁ గొన్ని గ్రంథములుమాత్రము సేకరింపఁబడి మనదేశమున నెలకొల్పఁబడియున్నవి. మనరాజధానియందలి యుత్తరమండలములలో విశేషకాలముపనిచేసి ప్రజల యనురాగమును గడించుకొనినట్టియు బ్రౌణ్యనిఘంట్వాది గ్రంథకర్తయునగు బ్రౌనుదొరగారి ప్రోత్సాహమునఁ బ్రాచ్యలిఖితపుస్తకభాండాగారము నెలకొల్పఁబడినను, గొలఁదికాలముక్రిందటవఱకును దానిని వృద్ధిఁబొందించు ప్రయత్నములు మిగుల సలుపఁబడి యున్నట్లు కానరాదు. బ్రిటిషుప్రభుత్వమునకుఁ బూర్వము దేశ మశాంతి జెంది యల్లకల్లోలముగ నున్న కాలమున మనగ్రంథరాజములెన్నియో మంటఁగలిసినవి; కొన్ని క్రిమి భక్షితములైనవి; అనేకములు నానాఁటికిఁ గాలవశమునఁ జీర్ణములైనవి. అందువలన దేశమునఁ గలిగిన జ్ఞానవిప్లవమింత యని తెలుపశక్యముగాదు. బౌద్ధమతము దేశాంతరగతమగుటచేతఁ దదనుసరణపద్ధతిని బెక్కు మతగ్రంథములు బౌద్ధదేశములకుఁ బోయినవి. హౌనుత్సాంగను చీనాబాటసారి ౬౦౦ వ్రాతప్రతులను గొనిపోయెనఁట! రమారమి పదునేనువందల సంవత్సరములక్రిందటనే క్షీణదశ ప్రారంభమై పుస్తకభాండాగారములును పుస్తకములును నశింపఁదొడంగినవి. కాశ్మీరము, నేపాళము, మైసూరు మొదలగు స్వతంత్రరాజ్యములయందు మాత్ర మాదిసరస్వతీపీఠము గదలక నిలచియున్నది. తంజావూరు నగరమున నాంధ్రరాజులచేత నెలకొల్పఁబడిన యుత్తమగ్రంథభాండాగారమును జర్మనులు గొని, నిజదేశమునకుఁ దీసికొనిపోవ సంసిద్ధులయియుండ నీ ఘోరసంగ్రామము తటస్థించుటవలనఁ దత్ప్రయత్నమాగెను. ఇప్పుడు దానిని మన దొరతనమువారే కొని మనదేశమునందే యుంచుటకు వలయు ప్రయత్నములను జేయుచున్నారని విని సంతోషించు చున్నాము. ఈతంజావూరుగ్రంథాలయము పదునాఱవశతాబ్దమునఁగాని పదునేడవశతాబ్దమునఁగాని స్థాపింపఁబడి యుండును. అందు ౧౮౦౦౦ లిఖితగ్రంథము లున్నవని తెలియవచ్చుచున్నవి. వంగదేశస్థితాసియాసంఘగ్రంథాలయము ౧౭౮౪ సం॥ నాఁటనుండియు వృద్ధిగాంచు చున్నది. స్వదేశసంస్థానములయందుండు పుస్తకభాండాగారముల స్థాపనకాలము దెలియుట కష్టమయిన నది గడుఁ బ్రాచీనమని నిస్సంశయముగ, దెల్పవచ్చును. ఈజిప్టుదేశమునఁ గ్రీస్తునకు ముందు ౧౬౦౦ సం॥ కుఁ బూర్వము పేరుగాంచిన పెద్దగ్రంథాలయములు నెలకొల్పఁబడి యుండెను. ౩౬,౫౫౫ మతగ్రంథములే యవనవిజయమునాఁటి కందు గానవచ్చెనని తెలియుచున్నది. ప్రాచీనైగుప్తీయ నాగరకతయు హైందవనాగరకతయు సమీపసంబంధముగలవని చరిత్రకారులు నిర్ణయించి యుండిరి. అలెగ్జాండ్రియా నగరమున ౭,౦౦,౦౦౦ గ్రంథములుగల పుస్తకభాండాగారము క్రీస్తుశకమునకుముందే యుండెనన్నచో, నిరువదియవ శతాబ్దమున బ్రిటిషు మ్యూజియమున ౨౦,౦౦,౦౦౦ గ్రంథములుండుట యచ్చెరువు గాఁదోఁపదు. అచ్చుకూటములును, యంత్రసాహాయమును 'గాపీరైటు' పద్ధతులును నవీనదేశయాత్రాసౌకర్యములును జేరి యిరువది లక్షలగ్రంథములను మాత్రము సేకరించినవి. బెర్లినునగరమున నెలకొల్పఁబడిన గ్రంథాలయ మొక యాంగ్లవిద్వాంసునివలనఁ గొనఁబడి వృద్ధిగావింపఁబడినట్లు కానవచ్చు చున్నది.

ఇన్ని గ్రంథము లిన్ని స్థలముల నిట్లు చెదరియున్నను నింక నెన్నియో యముద్రితగ్రంథములు రహస్యవిషయములు గలవి దుర్గమములును దుస్సాధ్యములు నగు స్థలములను గిరిగహ్వరములను నూరూరఁ దిరుగు బైరాగులకడను గానవచ్చుచుండును. శిష్యశిక్షకైమాత్రము గురుప్రసాదమున నొసంగఁబడుచు మఱి యెవరికి నీయఁబడఁగూడ దని శాసింపఁబడుచుఁ బరంపరగఁ గైకొనఁబడుచుండు గ్రంథము లెన్నియో కలవు. మంత్రశాస్త్రమును దంత్రములలోను తమగ్రంథములును నింతవఱకును ముద్రితములు గాలేదని చెప్పవచ్చును. మహానిర్వాణ

సూత్రమును నుద్ధరించిన యొక భాగముమాత్ర మాంగ్లమున ననువాదము గావింపఁబడినది. రెండవభాగ మొక నేపాళ దేశపండితునికడ నున్నదనియు దాని ననువాదించి ప్రకటించినచో దానిమహిమ పోవునని దాని వాతఁ డన్యుల కొసంగఁడనియుఁ గలకత్తా హైకోర్టుజడ్జి గారగు న్యాయమూర్తి ఉడ్రాఫుదొరగారు దెలిపియున్నారు. మఱియు నాగ్రంథరాజముయొక్క మహత్త్వమును గొనియాడి యున్నారు. ఈవిధమున నమూల్యగ్రంథములను దాఁచుకొని విద్యను గాపాడు విద్వాంసు లెందఱో గలరు. కొన్ని విద్యారహస్యములు గురుముఖమునఁగాని తెలియవు. సామాన్యముగఁ బ్రాచీన గ్రంథములను విడుచుట గృహమేధికిఁ గొంత కష్టముగానే యుండక మానదు. దారిద్ర్యమున దోఁకుచున్నను, దన తండ్రి తాతల ధనముగు పొత్తములను నుయ్యలలపై నునిచి యూఁచుచుండుంగాని వానిని విక్రయింపనొల్లఁడు. సరస్వతీవిక్రయము పూర్వకాలమునఁ గన్యావిక్రయముకంటె హైన్యముగా నెంచఁబడుచుండెను.

## వర్తమాన గ్రంథాలయములు- గ్రంథాలయోద్యమములు.

గ్రంథాలయోద్యమ మాంధ్రదేశమున వెలసి నాలుగు హాయనంబులు మాత్రము గడచినవి. విజయవాటికయందే యుద్యమము ప్రభవము చెందినది. ఈ యభినవోద్యమ ముద్భవించినది మొదలు దినదిన ప్రవర్ధమానముగఁ దేజరిల్లుచున్నది. ఈ గ్రంథాలయోద్యమమునకును, నాంధ్రోద్యమమునకును మూలశక్తి యాంధ్రభాషయే. ఆంధ్రభాషాసేవ యభినవప్రబోధము గాంచినది. ఆంధ్రోద్యమమే యిట్టి ప్రబోధమునకుఁ గార్యరూపమై యున్నది. నూతనజాతీయతత్త్వవికాసము దేశమం దెల్లయెడల నిండు దీధితులతోఁ దేజరిల్లుచుండునపుడును, వదనీక్షణమునఁ బ్రజల హృత్సరోజములు వికసించి యున్నతాదర్శసౌరభ్య సంవాసితములై నెత్తావుల దిశల వెదచల్లుచుండునపుడును, మహోన్నత భావాదర్శవిజృంభణమునకు సాధనభూతముగ మాతృభాషాభ్యసనానురక్తియు దేశభక్తియు నూతనశక్తియుఁ బ్రేరేపింప, మాతృరూపిణియగు నాంధ్రసరస్వతి తన దివ్యరూపసాక్షాత్కారము నాంధ్రుల కొసంగి తనియఁజేసినది. ఆంధ్రవాఙ్మయము సర్వకావ్యకళానాటకాది వివిధగ్రంథమాలాంతరంగ వీచీవిక్షోభసంఘూర్ణిత మహావారాన్నిధివలె గంభీరనిర్ఘోషమున నుప్పొంగుచున్నది. శిల్పు లరుగు శీకములందు శిల్పనైపుణ్యమొప్ప విచిత్రములను జెక్కునట్లు పూర్వకవులు ప్రబంధములందుఁ గల్పనాచాతుర్యము దీపింప శృంగారరసప్రధానకవితనె చెప్పుచుండిరి. ఇప్పుడట్లుగాక యాంధ్ర వాఙ్మయము మతివిశాలదృష్టితో సర్వప్రపంచము నావరింపఁదలఁచి భూనభోంతరములఁ దాఁకుచు మహోన్నత భావవస్తు పరికల్పనాకౌశలమున వాసించుచున్నది. అట్టి నవ్యాంధ్రసరస్వతి పర్యటనమున కుత్తమయానము వచనకావ్యరూప వరాశ్వమై యున్నది. ఆంధ్ర వచనకావ్యరచన ఆధునికమైనను, అది నూతనభావగుంభితమై, యసమానపటుత్వచాతురీవిలసితమై, మఱి లసదనూననానానవ్యనవ్యాలంకారశోభితమై చదువరుల హృదయమ్ముల కిమ్ముగు భావమ్ములను గ్రొత్తరసమ్ములను దరిచినకొలఁదిని విరియఁజిమ్ముచు మదనాగమ్ముకైవడిఁ బ్రసరించుచుండును. రాజకీయ విషయమునను వాఙ్మయమునను దేశమున నూతనశక్తి యావిర్భావమును జెందినది. జనుల సాంఘికజీవనము వాఙ్మయాదర్శఫలకమునఁ బ్రస్ఫుటగతిం బ్రతిఫలించుచుండును. వర్తమానమునందు వాఙ్మయాదర్శమున జాతీయాదర్శములు బింబప్రతిబింబన్యాయమునఁ బ్రతిఫలించుచున్నవి. వాఙ్మయజీవన జాతీయజీవనములు పరస్పరాధారాధేయ భావముగలవై యద్భుతశక్తితో విరాజిల్లుచున్నవి. వాఙ్మయమునకును బ్రజాహితజీవనమునకును నవినాభావసంబంధము గలదు. సాంఘికజీవనమునఁగల గుణాగుణములు వాఙ్మయనికషోపలమునఁ బరీక్షింపఁబడి పరిశుద్ధి గాంచుచుండెను. ఆంధ్రత్వ మన్నియెడల సహస్రధా ప్రకాశించుచున్నది. శాస్త్రములు, కళలు, చరిత్రములు, జీవితచారిత్రములు, విమర్శనములు, చాటువులు మొదలగు సమస్తవిషయములును వాఙ్మయమునఁ బ్రవృద్ధి గాంచుచున్నవి. ప్రపంచమునం దంతట నుత్తమనాగరకతగల దేశములయందు దేశభాషలు సమస్తవిజ్ఞానసం

పన్నములగు గ్రంథరాజములచేత విలసిల్లుచున్నవి. భారతవర్షమున మాత్ర మట్టి యుద్యమలాభము సంపూర్ణముగ నింతవఱకుఁ జేకుఱలేదు. వంగ గూర్జర మహారాష్ట్రభాషలందు నీమహోద్యమము చాలవఱకుఁ బెంపుఁజెందియున్నది. ఆంధ్రమునను నామాతృభాషయగు నాంధ్రమునను నీనవీనోద్యమము మొలక లెత్తుచున్నయది. ఆచిరకాలమున నీపవిత్రవాఙ్మయములు రెంటను సమున్నతదశను జెంది శాశ్వతిసంపదతోఁ దులతూగుచుండునట్లు జగదీశ్వరుఁ డనుగ్రహించుఁగాత! మృదు మధుర గంభీరస్వరయుతమై, మానవబుద్ధిగ్రాహ్యంబులగు నైహికాముష్మిక సంబంధములగు సమస్తవిషయములను లలితపదవిన్యాసక్రమమునను బాఠకుల మనంబులఁ జేర్పఁ సమర్థంబైన సంస్కృత సాహిత్యము గలదియై యాంధ్రభాష ప్రకృతవ్యవహారంబులను సాధింపజాలని దొకంతును గలదని యూహింపఁజాలము. కాన భీతి నేల? విద్వాంసుల కొక విజ్ఞాపనము:-- ప్రాచీనగ్రంథములఁ బరిశీలించి ప్రకృతోపయుక్తములగు భాషాపరికరముల సేకరించి రూఢియగు నర్థములను బదములకు నిర్వచించి వ్యవహారమునఁ బ్రసరించునట్లు గావించుట కర్తవ్యమై యున్నది. వంగీయ సాహిత్యపరిషత్తు మొదలగు విద్వత్సభలు గావించుచున్న పనిని మన యాంధ్ర పరిషత్తుగూడఁ జేయఁబూనవలసి యున్నది. కౌటిల్యుని యర్థశాస్త్రము నొకదానిని గ్రమముగఁ జదివి చూచినచో రాజకీయ వ్యవహారవిషయమున నుపయుక్తములగు పదము లెన్నియో కానవచ్చుచున్నవి. కొలఁది యుదాహరణము లిందుఁ గైకొందము. లక్షణాధ్యక్షుఁడు=Superintendent of mint, రూపదర్శకుఁడు=Examiner of coins, ఆగంతులవణమ్ = Imported salt, వర్తని=Road Cess, సంకులదోషమ్=Centralisation, సర్వదేయవిశుద్ధమ్=free from all taxes, యాత్రావేతనమ్=Ship freight, శాసకుఁడు=Captain of a ship, మంత్రిపరిషత్తు-Cabinet or assembly of ministers, కర్మాంతికుఁడు=Superintendent of munufactories. ఈవిధముగ రాజకీయవ్యవహారమునఁ బెక్కు విధములగు పనులకును, దదధ్యక్షులకును బేర్లు గానవచ్చుచున్నవి. దీనినిబట్టిచూడ వర్తమాన వ్యవహారము ప్రాచీనహైందవరాజ్యాంగ విధానముకంటె హెచ్చు విస్తృతిగలదిగాఁ గానరాదు. ఇతరశాస్త్రములందుఁగూడ నీవిధముననే ప్రకృతోపయోగములగు పదములును భావములును దొరకుట కభ్యంతర ముండదు. శాస్త్రవిషయములఁ జర్చించుటలో నాంధ్రముననే కాక దేశభాషలన్నిటియందును రూఢిగ నేకార్థముననేకపదము వాడఁబడుట సముంజసమై యుండును. అట్లు కానిచో దేశమునందు విజ్ఞానము విస్తరిల్ల నేరదు. శాస్త్రపరిజ్ఞానము దేశమునందంతట నొక్కవిధముగ నే యుండవలయును. పూర్వకాలమునందు శాస్త్రపరిజ్ఞానము సంస్కృతము వలననే గ్రహింపఁబడుచుండుటచేత నాసేతుహిమాచలపర్యంతము నే దేశపండితుఁడైన సంస్కృతమున శాస్త్రచర్చయు విద్యాభ్యాసమును జేసి కృతార్థతఁ జెందుచుండెను. ఇప్పు డాంగ్లమున విద్యాభ్యాసము శాస్త్రపరిచితియుఁ గలుగుచున్నను, మాతృభాషాముఖమున విద్యలభ్యసించినం గాని విజ్ఞానవికాసము గలుగ నేరదనియును, బుద్ధిస్వాతంత్ర్యము గలిగి నూతన విషయములను గనిపెట్టి నవకౌశలము లభింపదనియును, కఠినమగు నన్యభాషాభ్యాసమున లేఁతవయసున గ్రహణశక్తిగల కాలము వృథాచనుచుండుటచేతఁ దుదకు మొఱకుదేఱి నైసర్గిక తేజమును గోల్పోవుటయుఁ దటస్థించుచుండునని పెద్దలందఱు నభిప్రాయముఁ జెందియున్నారు. మధ్యమవిద్యయు, నుత్తమవిద్యయుఁగూడ దేశభాషలయందుఁ గఱపఁబడినం గాని జాతీయాత్మ నైసర్గిక వికాసముతోఁ దేజరిల్ల నేరదనియు నందఱును గ్రహించిన విషయమై యున్నది. ఆంగ్లదేశమున విద్యానిలయములగు నాక్స్ఫర్డు, కేంబ్రిడ్జి సర్వకళాశాలలు పాండిత్యమునకు మూలముగ ల్యాటిను గ్రీకు భాషల నేర్పుచుండినంతకాల మాంగ్లభాషయు నాంగ్లజనబుద్ధివికాసమును ఉత్తేజముగాంచి యుండలేదు. ఆంగ్లభాషకుఁ బ్రాముఖ్య మొసంగి విద్యనొసంగుట కాప్రాచీనవిద్యానిలయములు గడంగినతోడనే యాంగ్లవాఙ్మయము వెల్లివిరిసి మహాప్రవాహమువలె వృద్ధిఁజెందఁ దొడఁగి

నది. ఆంగ్లభాషకుఁగూడ నవీనశక్తియు నెంత తేజమును గలిగి పెంపొందినవి. నేఁడాంగ్లము ప్రపంచమున నుత్తమ శాస్త్రజ్ఞానమునకును నుత్తమనాగరికతకును ముఖ్యసాధనమై యగ్రస్థానము నధిష్ఠించియున్నది. అటువలెనే భారతవర్షమున దేశభాషలయందు విద్యగఱపుటకుఁ బ్రయత్నములు సలుపఁబడినచో జాతీయతత్త్వము నూతనాద్భుతవికసనమును గాంచుననుట కించుకయు సంశయము లేదు. మనదేశమునందక్క నేదేశమునందైన నన్యభాషాభ్యాసమున శాస్త్రపరిచితి గ్రహించుట గలుగదు. ఆంగ్లభాషాభ్యాసమున భారతీయులకు రవియస్తమింపని యాంగ్లసామ్రాజ్యమునందంతటను గల విశేషానుభవము సంలభ్యమగుచున్నను, ప్రకృతమున దేశకాలపరిస్థితుల ననుసరించి యుద్ధపోషణమునకుఁగాక వేఱొకవిధమున జనసామాన్యమునకు నాంగ్లవిద్య గొఱగాకున్నయది. దేశభాషల నభివృద్ధి గావింపవలయుననియుఁ దన్మూలమున విద్యాభ్యాసము సాధ్యమైనంతవఱకు జరుపఁబడవలయుననియుఁ బ్రభుత్వమువారుగూడ గ్రహించియున్నారు. కాని, తగిన ప్రయత్నము లింకవఱకు జరిగియుండలేదు. జాతీయవిద్య నెలకొల్పుటకై ప్రయత్నములు మహనీయుల వలనఁ జేయఁబడుచున్నవి. అవి సంస్తవనీయములు. విజయనగరమునందుఁగూడ "ఆంధ్రవిద్యానిలయము" నెలకొల్పి పండితులు గొందఱుత్తమవిద్యల నాంధ్రమునఁ బ్రజలకుఁ గఱప యత్నించుచున్నారు. అట్టి యుద్యమములను బరాత్పరుఁడు ఫలింపఁజేయుచుగాక! గ్రంథాలయములు ముఖ్యముగ నీవిషయమునఁ గృషిసలుపవలసియున్నవి. ఉత్తమవిద్యాభ్యాసమునకుఁ దగిన పుస్తకసంభారమును గ్రంథాలయములు సేకరింపవలసియున్నది. గ్రంథాలయములు కొన్ని గ్రంథరచనకు సాహాయ్యమొసరించుచున్నవి. కావున, శాస్త్రరచనకుఁ దగిన ప్రోత్సాహమును గల్పించి శాస్త్రాభివృద్ధిఁ జేయుట వానికొక ముఖ్యవిధియై యున్నది. రాజపోషణము గొఱవడి ప్రజాపోషణమే గ్రంథకర్తలకును భాషాజీవనమునకును మూలాధారమగుటం జేసి యీ కాలమున గ్రంథాలయము లీపనికిఁ గడంగవలసియున్నది. విజ్ఞానచంద్రికామండలివారికొఱంతను గొంతవఱకుఁ దీర్చినను, అదియొకటి రెండు సంఘముల వలన నెఱవేఱుపని కాదు.

## గ్రంథాలయములు, రాజపోషణము.

ఇప్పటి గ్రంథాలయములు నవీనాంకురదశలో నున్నవి. అవి పెంపుఁజెందుట కెన్నియో సాధన సంపత్తులు గావలసియున్నవి. బరోడారాజ్యమునందువలెఁ బ్రభుత్వమువారు చేఁబూనినం గాని యీయుద్యమము కొనసాగి ఫలము నిచ్చునది గాదు. దొరతనమువారొక యుత్తమగ్రంథాలయమును స్థాపించినంతమాత్రమునఁ బ్రభుత్వవిధి నెఱవేఱఁజాలదు. గ్రంథాలయములు శాఖోపశాఖలుగ దేశమునం దంతటను వ్యాపించునట్లును బ్రజలకందఱకును సుకరముగాను సులభముగాను గ్రంథములు లభించునట్లును జేసినం గాని విద్య వ్యాపించి దేశమున నిండియుండు నజ్ఞానతమము పరియంజాలదు. సంచారగ్రంథాలయము లందులకు ముఖ్యసాధనములు. ఆంగ్లదేశమున గ్రంథాలయపోషణమున కొకపన్ను విధింపఁబడుచున్నట్లు కానవచ్చుచున్నది. అట్టి పన్ను విధించి గ్రంథాలయములను జనోపయోగమునకొఱకు స్థాపించు స్వాతంత్ర్యము పత్తనాదులకుఁ గలదు. ౧౮౫౦ సం॥మున పబ్లికు లైబ్రరీల చట్టము నిర్ధారణ మయినది. దానినిబట్టి దేశమునందు హెచ్చుగ గ్రంథాలయములు స్థాపింపఁబడినవి. ఇంచుమించుగ ప్రతిపట్టణమందును పెద్దపల్లెలయందును బుస్తకభాండాగారము లింగ్లండుదేశమునఁ గలవు. మనదేశమున దొరతనమువారట్టిపనికిఁ దొడఁగియుండలేదు. ప్రజలయం దీభార మింతవరకును నిక్షిప్తమై యున్నది. దీనిని దొరతనమువారు కొంతవఱకైనను భరియింతురుగాక యని వేఁడుకొనుచున్నారము. ఆంగ్లదేశమున "కాపిరైటుచట్టము" ననుసరించి యచ్చుపడిన గ్రంథము లన్నింటిని గొన్ని గ్రంథాలయములకు విధిగఁ బంపుచుండవలయును. గ్రంథాలయములు వృద్ధిఁజెందుటకది యొక కారణము. మనదేశమున దొరతనమువారు ముద్రించు గ్రంథములనైన నుచితముగ గ్రంథాలయములకిచ్చినచోఁ గొంత ప్రోత్సాహకరముగా నుండును. మఱియుఁ బురపాలకసంఘములు, తాలూకాబోర్డులు, మొదలగు సంఘములు గ్రంథాలయోద్యమమునకుఁ

దోడ్పడి ద్రవ్యసాహాయ్య మొసఁగుట యత్యావశ్యకము. పన్నులు హెచ్చుగనున్న మన దేశమున గ్రంథాలయములకొఱకుఁ గ్రొత్తపన్నును విధించుట కష్టముగాఁ దోఁచును. కాని, ప్రజలవలన స్థానికపరిపాలనా సౌకర్యము కొఱకు గ్రహింపఁబడిన ధనమున నొక కొంత గ్రంథాలయములకై వెచ్చించినచో బాగుగ నుండును. ప్రజలకు విద్య నేర్పుట స్థానిక స్వపరిపాలనా సంఘముల కున్న విధులలో నొకటియై యున్నది బడులలో నేర్చిన చదువు సామాన్యముగఁ బొట్టఁబోసికొనుట కుపయోగించును. కాని, దానివలన నధికప్రయోజనము లేదు. నిజముగ మానవుని చదువు బడి విడిచినపిదప నారంభమగును. కడుపు గడపుకొనుటకై చదువు సన్నగిల లేఁత వయసున బడివదలి పనులలో దిరుగువారలకు విద్య గఱపవలయునన్న గ్రంథాలయములే యాధారము. కావున నట్టి విద్యావ్యాపనమునకు సహకారులగుచున్న పుస్తకభాండాగారములకుఁ దోడ్పడుట ప్రజాహితైకతత్పర కార్యనిర్వాహక శక్తిగల స్థానిక స్వపరిపాలనా సంఘములకుఁ గర్తవ్యము. పాశ్చాత్యదేశములయందు లక్షలకొలఁది పుస్తకముల సంగ్రహించియు నేఁటేఁట నూతనగ్రంథములను సంగ్రహించుచు హెచ్చు వచ్చుబడితో నొప్పు గ్రంథాలయము లెన్నియో కలవు. ఒక్కొక్క మహనీయుని యుదారదాతృత్వమునను, బూనికవలనను, కృషివలనను నుత్తమపుస్తకభాండాగారములు పాశ్చాత్యదేశములయం దేర్పడి యున్నవి; రాజపోషణమున వృద్ధిఁ జెందియున్నవి. అండ్రూ కార్నజీయను కోటీశ్వరుఁడు పుస్తకభాండాగారముల నెన్నిటి నెలకొల్పెను. పూర్వకాలమునఁగూడ నా రీతిని యాక్సుఫర్డులోని బాడ్లియను లైబ్రరీ మున్నగునవి స్థాపింపఁబడి వృద్ధిగాంచినవి. వానిని పేర్కొనిన పిదపఁ జేర్కొనుట కనర్హములయినను, ఈ మండలమున జనోపయోగముకొఱకు విజయనగరమున వెన్లాకు పబ్లికు లైబ్రరీయును, మాపట్టణమున క్యాంపుబెల్ లైబ్రరీయును, నుచితముగాఁ బ్రసాదించి మహారాజశ్రీ మహాజన పేర్ల నారాయణశ్రేష్ఠిగారును నాతని పుత్రులగు రాయిసాహెబు మహాజన పేర్ల రామమూర్తిశ్రేష్ఠిగారును మహోపకారమును గావించిరి; రామమూర్తి శ్రేష్ఠిగారింకను గావింపఁగలరని నమ్ముచున్నారము.

## గ్రంథాలయోద్యమము

గ్రంథాలయములు చిరకాలమునుండియు దేశమున నెలకొల్పఁబడుచున్నను, గ్రంథాలయములు జనులచేత నాదరభావమున నుపయోగింపఁబడుచున్నను నీ నవీన గ్రంథాలయోద్యమము గ్రంథాలయములకు వన్నె దెచ్చినది; గ్రంథాలయసూత్రములను గేంద్రీకృతము గావించి యుత్తమపద్ధతుల నడిపింప సమకట్టి యున్నది; నూతన గ్రంథాలయస్థాపనమునకును, వాని యభివృద్ధికిని, వాని కార్యక్రమమునకును నూతనశక్తిని బ్రసాదించినది; గ్రంథాలయకృత్యముల నిర్వచించు చున్నది; మఱి గ్రంథాలయ స్వాతంత్ర్యములను గూడఁ బ్రతిపాదింప సమకట్టుచున్నది. కాన నాంధ్రులందఱు నీగ్రంథాలయోద్యమమునకుఁ దగిన సాయ మొసఁగి శీఘ్రఫలము నొందఁబూనినచో, నుద్యమము సంపూర్ణదీప్తిఁ గాంచ నేరదు. దేశమునం దంతటను బుస్తకభాండాగారములు విస్తారముగా వెలయవలయును. పట్టణములయందును, పక్కణములయందును, పల్లెలందును కళాశాలలందును పాఠశాలలందును పల్లెకూటములందును నుత్తమ పుస్తకభాండాగారము లుండవలెను. ప్రతిమండలముయొక్క ముఖ్యపత్తనమున నొక ప్రధాన పుస్తకభాండాగారమును నాంధ్రదేశమున కంతకును గేంద్రముగ నొక పుస్తకభాండాగారమును స్థాపింపఁబడవలయును. ఇవి గాక కొన్ని సంచారగ్రంథాలయములుగూడ నుండవలెను. ఉత్తమ విద్యాభ్యాసముకొఱకును, నాధ్యాత్మికజ్ఞానముకొఱకును, శాస్త్రాభ్యాసముకొఱకును, రాజకీయ వ్యవహారబోధముకొఱకును జరిత్రపరిచయముకొఱకును, కృషివాణిజ్య శిల్పాది కళాకలాపవిజ్ఞానముకొఱకును, బరిశోధక పద్ధతుల నెఱుకకొఱకును దగు పాత్రములతో భాండాగారముల నించుటయే కాక, శాసనములను బంధకా ప్రాచీనపత్త్రములను వంశచరిత్రములను సంపాదింప సర్వదా యత్నించుచుండవలెను. మఱియు భాండాగారములందు నాంగ్ల

సంస్కృతాంధ్రగ్రంథములేకాక, యన్యభాషాగ్రంథము లుండుటయుఁ దత్సభ్యు లితర భాషాభ్యాసకులై తజ్జ్ఞానముచేత మాతృభాషాభివృద్ధిని గావించుటయు నావశ్యకములు. ఇప్పుడు సాధారణముగా నాంగ్ల పారశీక వంగ మహారాష్ట్ర భాషలనుండి యాంధ్రమున కనువాదములు సలుపఁబడుచున్నవి.

వంగ ఘూర్జర మహారాష్ట్ర భాషావాఙ్మయము లుచ్చదశలో నున్నవని వినుచున్నారము. సర్ రవీంద్రనాథ ఠాకురువంటి కవీంద్రుఁడు వెలసి వంగభాషకు వన్నె దెచ్చెను. బంకిమ్‌చంద్రచాటర్జీ మొదలగు నుత్కృష్ట గ్రంథకర్తలు భాషాసేవ వేయివిధముల సలిపియుండిరి. ఆంధ్రమున నేకాక నా మాతృభాషయగు నుత్కళమునఁ గూడ వంగవాఙ్మయచ్ఛాయలు ప్రతిఫలించుచున్నవి. వర్తమాన కాలస్థితులనుబట్టి యాంధ్రులుగాని మఱియితర దేశీయులుగాని యొక్క మాతృభాషాభ్యాసముతోడ నే తృప్తిఁజెంద ననువుగాదు. భారతజాతీయజీవనము సహస్ర నాళములఁ బ్రవహించుచున్నది. అంతటను జాతీయాంతరాత్మ ప్రతిబింబము ప్రతిఫలించుచున్నది. కావున భారతీయులందఱును బాగుగ జాతీయ తత్త్వమును గుఱుతెఱుంగఁదలచిరేని జాతీయజీవనప్రభావము నన్ని దిశలను గాంచవలసియుండును. భారతజాతీయతా పోషణమున కేకభాష దేశమునందంతట వాడఁబడవలయు ననియును నట్లు కాకున్న నేకలిపియైన నుపయోగింపఁబడుట సమంజసమనియుఁ గొందఱు మహనీయులు ప్రబోధించుచున్నారు. లిపిమాత్ర మొకటియై భాషలు భిన్నములైనచో లాభమంతగాఁ గలుగదు. శాస్త్రపరిభాష లేకరీతిగా నుండుట విశేషలాభకరము. ఇప్పటిస్థితిని బట్టి భారతీయులు నిజమాతృభాషలందేగాక, సాధ్యమగునంతవఱకు నన్యభాషలందుఁ బరిశ్రమము సేయుట యుక్తము. (ఇప్పటి నా యుత్కళసోదరు లన్యభాషలలో వంగభాషనుమాత్రము నేర్చుకొని తృప్తిఁజెందుట సరిగాదు. ఉపేంద్రభంజాది మహాకవుల ప్రాచీనకావ్యములును రాయ రాధానాథరాయబహద్దరు రాయ మధుసూదనరావుబహద్దరు మొదలయిన కవివరుల యాధునిక కావ్యములును, శ్రీయుత ఫకీరమోహన సేనాపతియొక్క యుపన్యాసములు (నవలలు)ను నితరకవిసత్తముల పొత్తములును నుత్కళభాషను వెలసి, దాని పురాతనగౌరవమును నూతనజాతీయవికాసమును జాటుచున్నవి. గ్రంథాలయోద్యమమునఁగూడ నా యుత్కళసోదరులు దగిన కృషిసల్పి యందలి లాభమును బొందుదురుగాక! పుస్తకభాండాగారసంస్థాపకులు తత్పాత్రములను బాగుగఁ బరిశీలించి యాచరణములోనికిఁ దెత్తురని నమ్ముచున్నాఁడను.

## ఆధునికాంధ్రసారస్వతము.

వర్తమానమం దాంధ్రసారస్వతము వెల్లువెల్లువయై ప్రవహించుచున్నది. నవలలును, నాటకములు నెన్నియో వెలువడుచున్నను—జరిత్రలును, మహాపురుషుల జీవితములును, శాస్త్రములును, కళలును, వాణిజ్యాది విషయిక గ్రంథములును మాత్ర మరుదుగాఁ గానవచ్చుచున్నవి. సాంఘికశక్తు లభినవాదర్శసంచాలితములై క్రీకృతములగుటకుఁ బరిభ్రమణమును జెందుచున్నవి. ఈమహాసమయమున నట్టిశక్తులను దగినవిధమున జాతీయప్రణాళులఁ బ్రసరింపఁజేయుటకు యుక్తగ్రంథము లుత్పన్నములు గావలెను. "నానృషిః కురుతే కావ్య" మని యుండుటవలన ఋష్యంశసంజాతుఁడే కవి యగును. ఋషివోలె నాగతానాగత వృత్తాంతములను గవి నిజ దివ్యతేజఃప్రభావముచేత లెస్సగాఁదెలిసి గ్రంథరచన సేయును. లోకజ్ఞుఁడును సకలకళాపరిపూర్ణుఁడును దివ్యతేజోవిరాజితాంతరంగుఁడును గాని కవియొక్క కవిత యెక్కడ నెప్పుడును శోభిల్లదు. దేశకాలానుసారముగా సద్గ్రంథములను రచించి జనులను జ్ఞానవంతులను జేయుభారము సత్కవులయందు మోపఁబడి యున్నది. "కవులందఱును గాళిదాసు గా"రను లోకోక్తి సత్యమే యయినను, గవియగుటకు నిశ్చయించువాఁడు మాత్రము కాళిదాసునిమార్గము నే యనుసరింప సర్వదా యత్నించుచుండవలెను.

పూర్వకావ్యములను బాగుగఁ బరికించినచో నీకాలమునకుఁగూడ నుపయోగించు సూత్రము లందుఁ బొందుపఱుపఁబడియున్నట్లు తోఁపక మానదు. సంస్కృతి

కావ్యములయందును దేశభాషా ప్రబంధములయందును రమ్యములగు వర్ణనము లెన్నియో కలవు. రమ్యవస్తుగుణవర్ణనమున మనకావ్యములు వన్నెమీఱినవి. ఆధ్యాత్మికాదిభౌతికవిషయములనుగూడఁ జక్కని వర్ణనముల బొందుపఱచి కవులు వింతగా విశదీకరించియున్నారు. పద్యమునఁగాని గద్యమునఁగాని కావ్యమునకు వ్యంగ్యము ప్రాణము. ఆంగ్లవాఙ్మయసూత్రములనుబట్టి చర్చించినను, జదువరుల యూహకు ననువుగ వర్ణనాంశముల సూచించి విడుచుట ముఖ్యమని తేలుచున్నది. చదివినకొలఁదిని వింతచవులఁ గాఁచురీతిని, నూహలకుఁ బెక్కువిధముల నూహ్యము లగుతీరునను, బదములందు నిమిడ్చిన భావము పలువిధముల ననేకరుచులకు రుచించుపగిదిని భావములను బొందుపఱచుటయే మహాకవుల కవిత్వమునందలి ముఖ్యలక్షణము. "ఉన్మీలితం తూలికయేవచిత్రం। సూర్యాంశుభి ర్భిన్నమివారవిందం। బభూవతస్యా శ్చతురశ్రశోభి। వపుర్విభక్తం నవయౌవనేన." కాళిదాసుని కుమారసంభవమునఁ బార్వతీవర్ణనమునఁ బొందుపఱుపఁబడిన యీశ్లోక మెట్టివిచిత్రనైపుణ్యమును జూపుచున్నది! ఆంగ్లమున మిల్టను షేక్స్పియరు మహాకవుల ప్రాభవము నిట్టిదియే. ఇట్టి కవిత్వము దుర్లభ్యమగుచున్నది. ఉత్తమ విమర్శనగ్రంథములు వెలువడునేని యుత్కృష్టకావ్యరచనకు ననువుగ నుండునని తోఁచెడిని. ఆంగ్లసంస్కృతాంధ్రములందు సమానప్రతిభగల పండితవర్యులు విమర్శనగ్రంథరచనకుఁ గడంగుదురుగాక!

ఆంధ్రభాష చిరకాలమునుండి యున్నతదశలో నున్నను, బుట్టినదిమొదల దియట్లున్నదని చెప్పఁజాలము కదా. దానికిని గొంతకాలము బాల్యదశయందుండుట స్వాభావికము. అయినను వాగనుశాసనునకుఁ బూర్వమది యెట్లుండెనో యవ్విషయ మింతవఱకును దెలియకున్నది. అది భాషాభిమానుల చిరపరిశ్రమమునకుఁ దగు విశాలవిషయము. ఆంధ్రభాషాచరిత్ర మింతవఱకును వ్రాయఁబడియుండలేదు. మఱి భాషాస్వరూపమును సమగ్రముగా నిర్వచింపఁదగు వ్యాకరణము లేదు. ఆంధ్రశబ్దచింతామణి ప్రభృతి గ్రంథలక్షణములను బట్టి భాషాస్వరూపమును నిర్ణయింపఁగడంగినచో, స్ఖాలిత్యము లధికములై కనుపట్టెడిని. నాగరకుల భాస కట్టిలోటుండఁగాదు. దానిని సర్వాంగసుందరముగాఁ జేయవలెనన్నచోఁ దోడి ద్రావిడభాషలతో సమన్వయము గావించి కాంచుటసైతమావశ్యకము. కనుక సంస్కృతప్రాకృతములందేకాక, ద్రావిడభాషలందుఁగూడ నిపుణులగు విబుధు లాంధ్రభాషకు సంపూర్ణమగు నొకవ్యాకరణమును రచించి, దేశవాసుల వందనములను బడయుదురుగాక! అట్టి పొత్తమొకఁడు వెలయునేని గ్రాంథికభాషావాదులమనికొందఱును వ్యావహారికభాషావాదులమని మఱికొందఱు నిపుడు వెలువడి చేయుచున్న వ్యర్థవాద మడఁగంటుటయేగాక, సుస్వరూపముతో నాంధ్రవాణి విహరించుట కనువగును.

## గ్రంథాలయ విధులు.

గ్రంథాలయములు గ్రంథసంపాదనమునకును దత్పఠనమునకును మాత్రమేగాక, సాంఘికజీవనమునందును వాఙ్మయజీవనమునందును బెక్కువిధముల సహకారులు గాదగియున్నవి. అవి యింతవఱకు గ్రంథసంపాదనమున మాత్రము హెచ్చుకృషిని సలుపుచున్నవి. ముద్రితగ్రంథములు సాధారణముగ సంగ్రహింపబడుచున్నను, అముద్రితగ్రంథము లంతగా సమకూర్పఁబడుచున్నట్లు కానరావు. కొన్ని యుత్తమగ్రంథాలయములు పనిఁబూని తాళపత్రసంపుటములను సమకూర్చుచున్నవి. దొరతనమువారి ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారాదు లిందులకు దృష్టాంతములు. మన యాంధ్రదేశమునఁ బ్రతిమండలమునను ముద్రితములుగాని యమూల్యగ్రంథము లెన్నియో గలవు. ముద్రితములనియు నిజభాండాగారమున నున్నవనియు నుపేక్షింపక, పురాతన తాళపత్రప్రతులను సంపాదించుచుండవలెను; మఱి వానియందు గల పాఠభేదముల నెత్తి వ్రాయుచుండవలెను. ఇట్లొనరించుచుండుటవలన నిప్పటి ముద్రితపుస్తకములు పునర్ముద్రితములగునపుడు వానియందలి తప్పులను దిద్దవీలగును. కొన్ని యుత్తమగ్రంథము లొకటి రెండుసారులు మాత్రము ముద్రితములై యిప్పుడు సాధారణముగా ల

భించవున్నవి. అట్టివానినిగూడఁ బూనికతో సంపాదింప వలెను. పరదేశవాసులు వ్రాతప్రతులను గొని కొనిపోవు చుందురు. అట్టితరుణమున గ్రంథాలయమువారే తిన్మూల్య మిచ్చి పొత్తములను గాపాడవలసియుండును.

పాతినాశముములను భగ్నములయినను ప్రాచీన శిల్పములను సేకరించుచుండవలెను. స్థలచరిత్రములను, బుక్కటిపురాణములని నిరాకరింపక దేశస్థులచేతఁ జెప్పఁబడుచుండు కథలను, గ్రామ్యజనులు పాడు పాటలను సామెతలను వ్రాయించి భద్రపఱుపవలెను. గ్రంథాలయమునకు వసతిగానుండు వాసమును నుపచరించు నుపకరణములు నుండవలెనని వేఱుగా నుడువ నక్కఱలేదు కదా. పైని బేర్కొనినవానిని సంగ్రహించి యుంచుటయేగాక, గ్రంథాలయములనుండి పొత్తములను స్త్రీపురుషులు దీసికొనుచుఁ గ్రమముగాఁ జదివి మరల నప్పగించుచుండునట్లు చేయవలెను. సద్గ్రంథరచయితలకుఁ దగుసాహాయ్య మిచ్చుచు వాఙ్మయవృద్ధి గావించుచుండవలెను. కొన్ని గ్రంథాలయములు బీదల కన్నదానమును గొన్ని రాత్రిపాఠశాలలనుస్థాపించి కర్మకరులకు విద్యాదానమును జేయుచున్నట్లు వినుదుము. ఇట్టి కార్యము లల్పములయినను, సంఘాభివృద్ధికరములగుటం జేసి ప్రశంసనీయములు.

మామండలమున నిప్పటికిఁ బదునేడు గ్రంథాలయములే నెలకొల్పబడియుండుటవలన నీయుద్యమమున మామండలము వెనుకఁబడెనని చెప్పుటకు సిగ్గగుచున్నది. ఈసిగ్గునుబాపుకృత్యము మామండలమందలి ధనవంతులయందును విద్యావంతులయందును గర్మఠులయందును న్యస్తమయియున్నది. వారల చిత్తము—ప్రజల భాగ్యము! గ్రంథాలయసంఖ్యచేతమామండలము నిమ్నదశలోనున్నను, దత్కార్యములచేతమాత్ర మట్లుండలేదు. అమూల్యగ్రంథరత్నములతో నిండి ప్రాచీనగ్రంథాలయములలో నొక్కొకటన్న పరవస్తువారి "యార్ష గ్రంథాలయము"ను, నూమారిరువదిసంవత్సరములకుఁబూర్వము సార్వజనిక గ్రంథాలయముగానుండి పిదప విశాఖపట్టణ గ్రంథాలయమను పేరఁ గొంతకాలము వెలసిన "యాదిసరస్వతీనిలయ గ్రంథాలయమును" గలసి యేర్పడి త్వరలో జిల్లాగ్రంథాలయముగాఁ బనిచేయ యత్నించుచున్న "యానందగజపతి గ్రంథాలయమును," నెక్కుడు దెలుఁగుఁబొత్తములతో నొప్పు "బాలీబ్రదర్సుక్లబ్బు"వారి గ్రంథాలయమును మా విశాఖపట్టణమున బహుజనోపయోగములుగ భాసిల్లుచున్నవి. మాపురినున్న శారదానందనిలయమును, శృంగవరపుకోటతాలూకాయందున్న బాలసరస్వతీ పుస్తకభాండాగారమును ముఖ్యముగా స్త్రీల విద్యాభివృద్ధికై చేయుచున్న చేతలు గడుఁ బొగడఁదగి యుండును. మఱియు విజయనగరమునందలి యాంధ్రవిద్యానిలయము గొన్ని పరీక్షల నేర్పఱచి వానియందుఁ గృతార్థులగువారికిఁ దగుప్రోత్సాహమును గలిగించుచు మాతృభాషాసేవ సేయఁబూనుట యాంధ్రదేశవాసులకు నూతనసమాచారము గాదు. జ్ఞానానందమయుండగు జగదీశుని కృపవలన మనదేశమునందంతటను గ్రంథాలయములు హెచ్చి తద్వారా మానవులు జ్ఞానపూర్ణు లగుదురుగాక!

## ఉపసంహారము.

సోదరులారా, నా యసంబద్ధవచనములవలన నింతదనుకఁ దమకు శ్రమనొసంగి, యాంధ్రకవివరులును ధనవంతులును బహుభాషావిచక్షణులును రాజకీయకార్యనిపుణులును బుధావళిపోషకులును సుప్రసిద్ధ గ్రంథాలయస్థాపకులును నగు మన యగ్రాసనాధిపతిగారి యమూల్యోపన్యాసమును వినకుండం జేసినందులకు నన్ను మన్నించి, సభాధిపుని నెన్నుకొని కార్యక్రమమునకుఁ గడంగఁ గోరువాఁడను.

పిదుపరి శ్రీరాజా కొచ్చెర్లకోట వేంకటకృష్ణారావు బహద్దరు జమీందారుగారు అగ్రాసనాధిపత్యమును వహింపవలెనని, గౌరవనీయులగు ఆకెళ్ళ సూర్యనారాయణరావుగారు ఉపపాదింపగా, శ్రీ జగన్నాథపాడిఖడంగగారు, తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు, సూరి వేంకటనరసింహశాస్త్రిగారు, చెలికాని లచ్చారావుగారు, దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు బలపరచిరి. అంతట కరతాళధ్వనులు చెలఁగ సన్మానసంఘాధ్యక్షులగు శ్రీ విక్రమదేవవర్మగారిచే పుష్పమాలాలంకృతులై

అగ్రాసనాధిపతిగారు తమ యాసనము నలంకరించి, ప్రారంభోపన్యాసమును జెప్పిరి. (వీరి యుపన్యాసము లభింపకపోవుటచే ముద్రింపజాలమైతిమి.) అనంతరము ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు కార్యదర్శులగు అయ్యంకి వేంకటరమణయ్యగారు గతసంవత్సరముయొక్క కార్యనివేదిక నిట్లు జదివిరి:—

# ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము

## ౧౯౧౭—౧౯౧౮ సంవత్సర వృత్తాంతము.

### కడచిన సభ.

ఆంధ్రదేశమున గ్రంథాలయప్రతినిధుల మహాసభను జేయుట ప్రారంభించి నాలుగుసంవత్సరము లైనది. నేటితో అయిదవ సంవత్సరము ప్రారంభ మైనది. ఇదివఱకు జరిగిన సభలయం దెల్ల కడచిన సంవత్సరమున "బారువ" యందు జరిగిన నాల్గవ సభ అనేక విషయములచే ప్రాముఖ్యత జెంది యున్నది. "బారువ" పట్టణముగాదు; చిన్నగ్రామము. ముందటేడు ఈ గ్రామవాస్తవ్యులు వ్యయ ప్రయాసల కోర్చి నెల్లూరు పురమున జరిగిన సభకు వచ్చి ఈ సభను తమ గ్రామమున కాహ్వానము జేసినప్పుడు ఈ కుగ్రామమునకు బోవుట కనేకమంది సందేహించిరి. పట్టణవాసులు సభల నిర్వహించు పరిస్థితుల నెఱుంగుదురేగాని, పల్లెలవారి కేమి తెలియునని కొందరు పరిహాసించిరి. మఱికొందరు ఈ గ్రామమును గూర్చి మన కేమి తెలియనిది మన మాగ్రామమునకు బోవుటెట్లని సందేహించిరి. ఇంకొక కొందరు ఇంతవరకు జరిగిన మూడుసభలును పట్టణములయందే జరిపి యుంటిమి; కావున ఒకసంవత్సరము పల్లెయందు జరుపుటకుగూడ అవకాశమిచ్చి అదియెట్లు జరుగునో చూతమనిరి. ఈ యాలోచనప్రకారము "బారువ" వారి ఆహ్వాన మంగీకరింప బడెను.

### గంజాముజిల్లా గ్రంథాలయసంఘము

గ్రంథాలయప్రతినిధుల మహాసభను నిర్వహించిన దినము "బారువ" చరిత్రయందు సువర్ణాక్షరములతో లిఖియింపదగినదని చెప్పవచ్చును. ఇంతవరకు జరిగిన గ్రంథాలయప్రతినిధులమహాసభలయం దెల్ల ఈ సభయే అగ్రస్థానమును వహించినదని చెప్పితినిగదా ఆంధ్రులే గాక ఉత్కలులుగూడ ఈ సభ కేతెంచి కార్యక్రమమునందు పాల్గొనిరి. సభ జరిగిన పిమ్మట ప్రతినిధులలో కొందరు శ్రీజగన్నాథమునకు యాత్రవెడలి, తన ప్రసాదస్వీకరణయందు కులభేదమును ఎన్నియో వేలసంవత్సరములనుండియు తీసివైచిన యా జగద్రక్షకుని గ్రంథాలయోద్యమ విజయమున కై ప్రార్థించిరి.

ఈసభయొక్క ఫలితముగ గంజాముజిల్లాయం దెల్లెడల ఈ యుద్యమమునందు నూతన ప్రబోధముగలిగినది. అట్టిప్రబోధముతో లాభ మేమి? తత్ఫలితముగ మండల గ్రంథాలయసంఘమేర్పడి, తాలూకాసంచార కార్యదర్శు లేర్పడి, మూడుమాసముల కొకసారి జిల్లాయందలి వివిధప్రాంతముల యందు గొప్పసభలను సమకూర్చి ఈ యుద్యమవ్యాప్తికై సకలవిధముల దోడ్పడిరి. తుదకు ఈ మాసప్రారంభమునందే మండలగ్రంథాలయ ప్రతినిధులమహాసభనుగూడ మిక్కిలి జయప్రదముగ నిర్వహించిరి. ఇన్ని విధముల గంజాంమండలమున గూడిన సభ ఫలప్రదమై యొప్పినది.

### "వావిళ్ల" వారి దానము

ఆంధ్రభాషయందు అచ్చుగ్రంథము లింకను ప్రబలుటకు ప్రారంభము కాని యాకాలమున, ఆంధ్రభాషయందు గ్రంథపఠనాభిలాష ఇప్పటి దానిలో సహస్రాంశమైన లేనియాకాలమున, ముద్రణాసౌకర్య మిప్పటి దానిలో శతాంశమైనలేని యాకాలమున—సంస్కృత సారస్వతమునందు నిధియు, ఆంధ్రభాషయందు వేత్తయు నగు శ్రీవావిళ్ళ రామస్వామిశాస్త్రులుగారు ప్రప్రథమమున సంస్కృతాంధ్రగ్రంథము లనేకములనుముద్రించి ఆంధ్రదేశమునకు మహోపకార మొనర్చి యున్నారు గదా! వారి పుత్రులును, వారివలె విద్యాధికులును నగు శ్రీవేంకటేశ్వరశాస్త్రులుగారు తండ్రిగారి యుద్యమమును కొనసాగించుచున్నారను సంగతి మీ కందరికిని దెలిసియే యున్నది.

కడచిన గ్రంథాలయసభ జరిగిన పిమ్మట, ఒకటి రెండు మాసముల కాలములో నేను మద్రాసునకు బోవుట తటస్థించినది. అప్పుడు శ్రీవావిళ్ల వేంకటేశ్వర శాస్త్రిగారిని దర్శించి గ్రంథాలయముల విషయమై మనము చేయుచున్న పనిని గూర్చియు, గ్రంథాలయోద్యమముయొక్క ప్రాశస్త్యమునుగూర్చియు ముచ్చటించితిని అందుమీద వారు ఆనందభరితులై ఆంధ్రదేశమునగల ౧౧ మండలములయందును మండలమునకొక్కటిచొప్పున మండలగ్రంథాలయములను స్థాపింపవలసినదనియు, అట్లు స్థాపింపబడినవి స్వంతభవనములను బీరువాలను సిద్ధపరచుకొని, తమకు తెలుపవలసినదనియు, అట్లు తెలిపినయెడల, తాము ఇంతవరకును ప్రకటించినట్టి ముందుప్రకటించునట్టి గ్రంథములనెల్ల వానికిచ్చెదమనియు జెప్పిరి. వా రింతవరకును ప్రకటించిన గ్రంథములయొక్క విలువయే రు ౬౫౦ లుండును.

## నూతన శక ప్రారంభము

"వావిళ్ల"వారిసహాయముతో ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమమం దొక నూతన శకము ప్రారంభమైనదని చెప్పిన అతిశయోక్తిగాదు. మండలగ్రంథాలయసంఘములను, తాలూకా గ్రంథాలయసంఘములను స్థాపించుకొని పనిజేయవలెనని మనకిదివరకే సంకల్పము గలదు కాని ఆ యా సంఘములను స్థాపించిన, వానికి గ్రంథాలయములను గూడ తేర్పనిదే ప్రయోజనము లేదుగదా! గ్రంథాలయస్థాపనకు గ్రంథములను కొనుటకు మనయొద్ద ద్రవ్య మేమియు లేదే? ఎటుల ఈ మహత్కార్యమును జేయుదుమా యని యాలోచించుచున్న సమయమునందు ఈ "వావిళ్ల"వారి అమూల్యసహాయము వచ్చి మన చింతను దీర్చినది. భవనములను నిర్మించుకొని, గ్రంథములుంచుటకు బీరువాలను సంపాదించుకొని, సంఘమును "రిజిష్టరు" చేసికొని, మండలగ్రంథాలయోద్యమమునకై పాటుపడెడ మనెడు ౧౧ మండల గ్రంథాలయములకును శ్రీవావిళ్లవారి గ్రంథములసహాయము లభించును. ఈ ౧౧ మండలగ్రంథాలయములకేగాక, నైజాము రాష్ట్రమునందలి ఆంధ్రప్రాంతము లన్నిటిని ఒక ఆంధ్రమండలముగా పరిగణించి, నిజాం రాష్ట్రమునకు మండలగ్రంథాలయముగా నిర్ణయింపబడు గ్రంథాలయమునకు గూడ తమ గ్రంథముల నిచ్చెదమనిరి. ఇంతేగాక ఆంధ్రదేశగ్రంథాలయసంఘమునకు గూడ రు ౩౬౪-౧౧-౬ లు విలువగల గ్రంథముల నిచ్చి మిగిలిన గ్రంథములను గూడ త్వరలో నిత్తుమనిరి.

వావిళ్లవారు ఇదివరకే, కడపయందున్న శ్రీరామకృష్ణసమాజమునకును, నెల్లూరునందున్న శ్రీతిక్కన గ్రంథాలయమునకును, తమ గ్రంథముల నన్నిటిని ఇచ్చియుండిరి. ఐనప్పటికిని; ఆ రెండుజిల్లాలను గూడ తమ దానమునుండి తప్పింపకుండిరి.

## మండలగ్రంథాలయములు.

"వావిళ్ల"వారిసహాయము ప్రకటితముకాగానే పలు మండలములు మండలగ్రంథాలయనిర్మాణమునకై శ్రద్ధగాపనిజేయుచున్నవి. విశాఖపట్నమునందు పురపాలకసంఘమువారు అట్టి గ్రంథాలయస్థాపనమునకై కట్టి సిద్ధముగనున్న భవనము నొకదాని నిచ్చియున్నారు. అందుచే అచట మండలగ్రంథాలయము అచిరకాలమునందే ప్రారంభమగును. ఇంతేగాక గంజాం మండలమున బరంపురము "ఆంధ్రభాషాభివర్ధనీసంఘము"వారు స్వంతభవనమును నిర్మించుకొను చున్నారు. అంతేగాక "బారువ"యందున్న శ్రీకృష్ణదేవరాయగ్రంథాలయమున వారు స్వంతభవనమును ఇదివరకే నిర్మించుకొని యున్నారు. ఈ రెంటిలో నొకటి అచిరకాలముననే మండల గ్రంథాలయమగునుట కెంతమాత్రమును సందియము లేదని నాతలంపు.

## గ్రంథములను గూర్చిన ఇతర సహాయము.

ఇతరగ్రంథకర్తలలో గొందరు గూడ ఈ మండల గ్రంథాలయములకేగాక, ఆంధ్రేతరమండలములలో ఆంధ్రులచే ఆంధ్రభాషాభివృద్ధికై స్థాపింపబడునట్టి ౫ గ్రంథాలయములకుగూడ తమ గ్రంథముల నన్నిటి నిచ్చెదమని చెప్పిరి. అట్లు వాగ్దానముజేసినవారిలో

మొదటివారు బ్రహ్మశ్రీ వడ్డాది సుబ్బారాయుడుగారు. పిఠాపురము రాయప్రోలు సుబ్బారావుగారును, పెద్దాపురమునందున్న ఆంధ్రసారస్వతనికేతన గ్రంథమాలవారును, కాకినాడ తాలూకా అంద్రంగియందున్న 'భారతీయపరిషత్తువారును' పిఠాపురమునందున్న "శ్రీరామవిలాస గ్రంథమాలవారును," చెంగల్పట్టుజిల్లా ఈగావారిపాళెమునందున్న "శ్రీవైఖానసగ్రంథమాలవారును," మచిలీపట్టణము "స్వవృద్ధివిద్యార్థి సంఘమువారును," బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారును, ఆంధ్రపత్రికాధిపులగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారును తమచే ప్రకటింపబడినట్టియు ప్రకటింపబడబోవునట్టియు గ్రంథములన్నింటిని, వైవిధముగా ౧౨ మండలగ్రంథాలయములకును, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమునకును, ఆంధ్రేతరమండలములలో స్థాపింపబడునట్టి గ్రంథాలయములలో ౫ గ్రంథాలయములకును ఇచ్చెదమని వాగ్దానము జేసిరి. వీరిలో శ్రీవడ్డాదిసుబ్బారాయుడుగారును, రాయప్రోలుసుబ్బారావుగారును, కాశీనాథునినాగేశ్వరరావుగారును తమ గ్రంథముల నిదివరకే ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకిచ్చియున్నారు. శ్రీనాగేశ్వరరావుగారు ఊరక గ్రంథముల నిచ్చుటతో తృప్తినొందక వానికన్నింటికిని సుందరముగ తోలుతో అట్టలు కట్టించి ఇచ్చియున్నారు. మిగిలిన గ్రంథకర్తలును, గ్రంథప్రకాశకులును, ఈవిధముగనే దోడ్పడి, మండల గ్రంథాలయముల స్థాపనకును ఆంధ్రేతరమండలములయందీయుద్యమము వ్యాపించుటకును సహాయము చేసెదరనుట కొంతమాత్రమును సందియము లేదు.

## సంచారగ్రంథాలయములు.

పాశ్చాత్యదేశములయందు పట్టణములయందేమి పల్లెలయందేమి సంచారగ్రంథాలయములు జనసామాన్యమునందు జ్ఞానమును వ్యాపింపజేయుటకై గొప్పసహకారులై యున్నవి. పట్టణములయందుండు గ్రంథాలయములు జనసామాన్యమునకు గావలసిన వివిధరకముల గ్రంథములను చిన్నచిన్న పెట్టెలయందు బెట్టెదరు; పాటకపుజనులును గ్రంథాలయము లందుబాటులోనుండనట్టియు అందుబాటులోనున్నను అచటికివచ్చుటకు అలవాటు పడనట్టియు జనులు నివసించి యుండెడి పేటలకు ఆ గ్రంథపేటికల నంపి, వానిని జనులు చదువునటుల జేసెదరు. ఇంతేగాదు, ఆటలు—ఆడునట్టిస్థలములు నాటకములు ప్రదర్శించునట్టి శాలలు—సభలు జరుగునట్టి మంటపములు వేయేల—జనులు ఎక్కడెక్కడ గుమిగూడి యుండెదరో అట్టి స్థలముల కెల్ల ఈ సంచార గ్రంథాలయపేటికలతో గ్రంథములను గొనిపోయి జనసామాన్యమందు జ్ఞానధనమును వెదజల్లెదరు. నేడిచట తెరచినట్టి గ్రంథాలయ ప్రదర్శనమునందు అమెరికా దేశమునందున్న "సెంటులూయిసు పబ్లికులైబ్రరీ" వారిచే మోటారుబండిమీద పెట్టబడి పంపబడిన సంచార గ్రంథాలయము నొకదానిని మీరు జూచెదరు. అది ఆటలాడుకొను స్థలములయందుండు వారికి గ్రంథముల నిచ్చుటకై పంపబడినది.

బొంబాయిపట్టణమునందు సేవక సంఘము వారు ఒక్కొక్క పెట్టెయందేబది గ్రంథముల నుంచి ఆ పెట్టెలను పాటకపుజను లుండుపేటల కంపి అక్కడ ఒక్కొక్కపెట్టెను నెలమొదలు రెండునెలలవరకుంచి, అక్కడి జనులలో చదువగలిగినవారిచే చదివించియు, చదువలేనివారికి చదివి వినిపించియు, వారియందు జ్ఞానధనమును వెదజల్లుచున్నారు

బరోడారాజ్యమునందు గూడ సంచార గ్రంథాలయములు స్త్రీలకు, పిల్లలకు, వ్యవసాయదారులకు, చిత్రకారులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు-ఈ ప్రకారము వేర్వేరు మనోవృత్తులు గలిగినవారికి తగు గ్రంథములను ప్రత్యేకముగ నేర్చిపెట్టిరి.

ఈ పద్ధతుల ననుసరించి ఆంధ్రదేశమునందు గూడ సంచారగ్రంథాలయములను ప్రారంభింపవలెనని సంకల్పించుకొని ఆ పనిని ఇప్పుడే ప్రారంభించితిమి. నేడు మీరిచట గ్రంథాలయ ప్రదర్శనమునందు రెండు సంచార గ్రంథాలయ పేటికలను జూడగలరు. అందులో ఒకటి చిన్నది. ఒకటి పెద్దది. చిన్నదానిఖరీదు రు 25 లు

పెద్దదానిఖరీదు రు 50 లు. ఉదారవంతులందరును ఒక్కొక్క పెట్టెను కొని దానమొసంగుదురని ప్రార్థించుచున్నారము అట్టి పెట్టెలను దానమొసంగ గోరువారికి ఆ పెట్టెల సందజేయగల బాధ్యతను మేము వహింపగలమని విన్నవించుచున్నారము. మీరందరును విరివిగా సహాయము చేసినగాని, వీనిప్రచారము నెక్కువచేయుట కవకాశ ముండదు.

ఈ సంచారగ్రంథాలయములను మనము విశేషముగా పల్లెలయందు వ్యాపింపజేయగలిగితిమేని, అనంతమగు విజ్ఞానధనమును దేశమునం దంతటను అచిరకాలముననే వెదజల్లగలమనుట కెంతమాత్రమును సందియములేదు. నూతన గ్రంథాలయములను స్థాపించుటకు కావలసిన పరిస్థితు లనేక గ్రామములయందు లేకపోవచ్చును. కాని చదువుకొనగలిగిన ఒక్క మనుజునినైన సంపాదింపగలిగిన ఏ గ్రామమైనను వీనిని వినియోగింప నర్హములగును. ఏలనన ఆ చదువుకొనగలిగిన మనుజుడే తానా గ్రంథములను చదువుకొనుటయేగాక చదువుకొనజాలని తోడిగ్రామస్థుల కందలి విషయములను బోధించును.

సోదరులారా! వేయేల గ్రామముల నిప్పుడు వహించియున్న అజ్ఞానతిమిరబాధను అచిరకాలముననే తొలగింపదలతురేని స్వల్పవ్యయముతో వేయదగినమందు సంచార గ్రంథాలయ వ్యాపనమేను. ఇతరమందు లున్నవి; లేవని చెప్పుటకు సాహసింపను. కాని ఇతరమందు లన్నియు విశేష వ్యయప్రయాసలతో గూడుకొనినవి. సులభముగా మోక్షమునిచ్చున దిది యొక్కటేను.

## సంచారగ్రంథాలయములకు గ్రంథసహాయము

సంచారగ్రంథాలయములను స్థాపింపవలెనని తలంచి మన సభకు నేడగ్రాసనాధిపత్యము వహించిన శ్రీకొచ్చెర్లకోట వేంకటకృష్ణారావుబహద్దరుగారిని దర్శింపగా వారు తమచే ప్రకటింపబడిన గ్రంథము లన్నిటిని ఒక్కొక్కటి మూడుప్రతులచొప్పున ఇచ్చి ప్రోత్సాహమును గలిగించిరి.

ఇంతేగాక తల్లాప్రెగ్గడసూర్యనారాయణరావుగారు గూడ తమచే రచియింపబడినట్టి హిందూదేశ ఆర్థిక చరిత్రయొక్క ౫ ప్రతుల నిచ్చి సహాయము చేసిరి.

## "మాజిక్కులాంతరు"

"సినిమాటోగ్రాఫ్, బయస్కోపు" మొదలగు పెద్ద యంత్రములను కొనలేకపోయినను, మాజిక్కులాంతరు, నొకదానినైన ఈసంఘపక్షమునకొని కొంతవ్యాప్తిని గలుగజేయవలెనని తలంచితిమి. చరిత్ర, ప్రకృతిశాస్త్రము మానవశరీరము, ఆరోగ్యము, నీతి మొదలగు అనేకవిషయములనుగూర్చి చదువుకొనజాలని జనులకు జ్ఞానమును గలుగజేయుటయందివి మిక్కిలి యుపయోగకరములై యున్నవి. ద్రవ్యాభావముచే మేము దీనిని కొనజాలక పోయినను, ఏలూరులోనున్న "యువజనసంఘము" వారు ఒక "మాజిక్కులాంతరును" కొని కొంతవరకు పనిని, ప్రారంభించినందుల కెంతయు సంతసింపవలసియున్నది. మరియు అంగలూరునందున్న శ్రీబాలసరస్వతీగ్రంథాలయమువారుగూడ "మాజిక్కులాంతరు" నొకదానినికొనుటకై ప్రయత్నించుచున్నారు. వీరిప్రయత్నముగూడ త్వరలోఫలోన్ముఖమగునని నమ్ముచున్నాము.

## నూతనభవనములు.

ఈవత్సరమున తయారైన భవనములలోకెల్ల తెనాలి తాలూకా అనంతవరమునందు శ్రీభారతీనిలయమునకు కుప్పా శ్రీరామశర్మగారిచే నిర్మింపబడినది మిక్కిలి గొప్పది. నాలుగువేల రూప్యములవరకు వెచ్చించి వీరాభవనమును నిర్మించియున్నారు. ఏలూరు తాలూకా దెందులూరునందున్న గ్రంథాలయమునకుగూడ గొప్ప భవనమొకటి తయారగుచున్నది. రాజమహేంద్రవరమునందు శ్రీరావుబహద్దరు కందుకూరి వీరేశలింగపంతులుగారు ౫,౦౦౦ గ్రంథములతో నూతనముగా నొక గ్రంథా

లయమును ప్రార్థనసమాజము వారి యాదరణకొసంగి దానికి ఒక భవనమునిర్మించి ఇచ్చియున్నారు. దానిని మద్రాసునందున్న ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారము వలె చరిత్రపరిశోధనకు ఎక్కువ ఉపయోగకరముగ నుండునటుల అభివృద్ధిచేయుదురని చెప్పిరి. దానికి ప్రార్థనసమాజమువారు శ్రీవీరేశలింగాస్తిక పుస్తకభాండాగారమని పేరిడిరి. ఇంకను పెక్కుచోట్ల నూతన భవన నిర్మాణప్రయత్నములను మిక్కిలి పట్టుదలతో చేయుచున్నారు. కొందఱుస్థలములను కొనియుండిరి. మఱికొందరు ఇప్పుడిప్పుడే భవనముల నిర్మించుటకు ప్రారంభించుచున్నారు.

## యుద్ధభటులకు గ్రంథసహాయము.

దక్షిణాఫ్రికాయందు యుద్ధముచేయుచున్న ఆంధ్ర సోదరులు విశ్రాంతిసమయములయందు చదువుకొనుటకై పత్రికలును గ్రంథములును కావలయునని, యస్. వి. రెడ్డి నాయుడుగారు వార్తాపత్రికలయందు ప్రకటించిరి. వెంటనే మనసంఘపక్షమున పత్రికలను, గ్రంథములను వారికి పంపుటయొక్క ఆవశ్యకతను దెలుపుచు ప్రకటించితిమి. పుస్తకములను తమంతట తామే పంపదలచుకొనువారికి, శ్రీ రెడ్డినాయుడుగారి చిరునామాలు ముద్రించియున్న కాగితముల నంపితిమి. ఈప్రకారము ౪౦౦ ఆంధ్ర గ్రంథములను 3000 ఆంధ్రపత్రికలను వారికిసంపిసహాయముచేసితిమి.

ఈవత్సరము జనవరినెలయందు లాహోరుపట్టణమున ప్రభుత్వమువారి యాదరణక్రింద హిందూదేశమందలి గ్రంథభాండాగారుల సభజరిగినది. ఆసభకు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునుండికూడ ప్రతినిధిని పంపెదమని వ్రాయగా, సభ్యులసంఖ్య అంతకుపూర్వమే ఎక్కువగానుండియుండుటచేత, స్థలముండినచో ప్రేక్షకునిగా మాత్రమురానిచ్చెదమని తెలిపిరి. విశేషవ్యయప్రయాసములకులోనై ఆంధ్రదేశమునుండి లాహోరుపట్టణమేగినను, సభయందు ప్రేక్షకుడుగానైన స్థలము దొరుకునో లేదో తెలియకపోవుటయుండగ, ఈగ్రంథభాండాగారుల సభవలన మనసార్వజనిక గ్రంథాలయోద్యమమున కేవిధమైన ఉత్సాహప్రోత్సాహములును లేవని గ్రహించి ఆసభకు ఆంధ్రదేశగ్రంథాలయ సంఘమునుండి ప్రతినిధులెవ్వరును పోయియుండలేదు. తుదకు ఫలితముకూడ ఊహించినట్లే జరిగినది. ఈవత్సరము విశాఖపట్టణమున మనసభతోబాటుగ, యావద్భారతవర్ష ధర్మగ్రంథాలయ ప్రతినిధుల మహాసభను కూర్పవలెనని యత్నించితిమి. కాని అచ్చట "ప్లేగు" వ్యాధివలన సభయొక్క ప్రయత్నములు ఆలస్యముగా ప్రారంభమగుటవలన అట్లు చేయుట సంభవము గాలేదు.

## దేవాలయములకును, గ్రంథాలయములకును సంబంధము.

నేటికాలమున మనము గ్రంథాలయములను ప్రత్యేకముగ నిర్మించుకొనుచున్నను, ప్రాచీనకాలమందివి, ముఖ్యముగా దేవాలయములతో సంబంధమును గలిగియుండెను. ఆకాలమునందు గ్రామమునందుండు జనులలో చాల భాగము ప్రతిదినము దేవాలయములకుబోయి దేవుని సేవించు నలవాటును గలిగియుండిరి. అందుచేత అచ్చటికిబోయినపుడే పురాణకాలక్షేపమును, సద్గ్రంథపఠనమును, పరస్పరభావప్రకటనమును భజనలు హరికథలు మొదలగునవిగూడ జరుగుచుండెను. క్రమముగ జనులయందు భక్తిసన్నగిలి దేవాలయములకు పోవుట తగ్గినకొలదిని, జనులకు వ్యావృత్తి లేమియులేకుండుటంజేసి దుర్వ్యాపృత్తులకు లోనగుట సంభవించినది. అట్టిస్థితియందు జనులుజ్ఞానవంతులగుటకు దగిన అవకాశములు గ్రంథాలయములయందు గలిగినవి. కాని ఈగ్రంథాలయములుగూడ దేవాలయములకు జేరియుండినయెడల, ఇప్పటికంటె ఎక్కువ ఉపయోగకరములై యుండగలవేమోయని నాయభిప్రాయము. ఏలయన నానాటికి జనులయందు దైవభక్తి సన్నగిలుచున్నమాట వాస్తవము. ప్రపంచమునందే జాతికైనను, అందుముఖ్యముగ భారతీయులకు, దైవభక్తి నశించిన మోక్షములేదు. కావున దేవాలయమును గ్రంథాలయమును ఏకముజేయుటవలన ఐహికాముష్మికములు రెండిటియందును మానవున కౌన్నత్యము సిద్ధిం

మిటుకనావుగనుండునుగదా? దేవాలయములకును గ్రంథాలయములకును సంబంధము కలుగజేయుటవలన, గ్రంథాలయములకు కొందరిని రాకుండ జేయుచున్నారేమో యను సందేహము కొందరకు గలుగవచ్చును. కావున నట్టి సందేహమునకవకాశము లేకుండ జేయుట కర్తవ్యము.

గ్రంథాలయములకును, దేవాలయములకును పరస్పర సంబంధము నుండవలె యొక్క యావశ్యకతను గ్రహించి, నాగపూరునందు సత్పురుషులసహాయముతో శ్రీ సూరి సీతారామస్వామి గారును భక్తిసద్యయు సీతారామ మందిరమును స్థాపించియున్నారు. ఇందు దేవాలయమును గ్రంథాలయమును కలిసియే యున్నవి. ఇదేరీతిని గుంటూరు పట్టణమునగూడ పాటిబండ సూర్యనారాయణ పంతులుగారు దేవాలయమును గ్రంథాలయమును కలిపియే స్థాపించియున్నారు. వీనియొక్క ఫలితమును బట్టి దేశమునందెల్ల నిట్లుచేసిన నెంతయు బాగుండుట సందియము లేదు.

## పురపాలక సంఘముల సహాయము.

కడచిన సంవత్సరమునందువలెనే ఈ సంవత్సరమునగూడ బెజవాడ పురపాలక సంఘమువారు అచటి రామమోహన గ్రంథాలయమునకు రు ౧౦౦ ల విరాళ మొసంగిరి. ఈప్రకారమే ప్రతిసంవత్సరమును ఇచ్చుచుందురు. ఏలూరు పురపాలకసంఘమువారు గూడ అచటనున్న సింహాయవజనసంఘము వారికి నెలకు రు ౫ లు చొప్పున విరాళమిచ్చుచున్నారు.

## జిల్లాబోర్డువారి సహాయము.

క్రిందటి సంవత్సరమున కృష్ణాజిల్లాబోర్డువారు అంగలూరునందలి బాలసరస్వతీ గ్రంథాలయమునకు నెలకు రు ౧౦ లు విరాళమునిచ్చిరి. కాని కారణము నేమియు దెలుపకయే, ఈ సంవత్సరము విరాళమును ఆపుదలజేసిరి. ఈ విరాళమును తిరిగి దయచేసెదరని ప్రార్థించుచున్నారము.

## ప్రభుత్వమువారి సహాయము.

అంగలూరునందలి బాలసరస్వతీ గ్రంథాలయమునకు ప్రభుత్వమువారు వారిచే ప్రకటింపబడిన ఆంధ్రప్రచురములనన్నిటిని దయచేసి సహాయము చేసిరి. ౧౮౬౦ సం॥ ౨౧ నెం రు ఆక్టుప్రకారము సంఘములను రిజిష్టరుచేసికొనుటకు ఏబదిరూపాయల "రిజిష్టరుఫీజు" నకు బదులుగా ఇరువదిరూపాయలు మాత్రమే పుచ్చుకొనుటకు ఏర్పాటు చేయవలసినదని ఆంధ్రమహాజనసభవారు తీర్మానించి, దానిని ప్రభుత్వమువారికంపిరి. అటులతగ్గింపబడకపోయినప్పటికిని ప్రత్యేక సంఘములనుండి వచ్చు దరఖాస్తులను వానివాని యోగ్యతలనుబట్టి యాలోచించెదమని ప్రభుత్వము వారుత్తరువొసంగిరి. కాని అంగలూరు బాలసరస్వతీ నిలయమువారు పంపిన దరఖాస్తును నిరాకరించిరని దెలుపుటకు చింతిల్లుచున్నారము.

## "హిందూపత్రిక" యందలి వ్యాసములు.

అమెరికాదేశమునందు పల్లెటూండ్ల గ్రంథాలయములు జ్ఞానవర్ధక కేంద్రముల వ్యాపింపజేయుటకు అత్యావశ్యకముగ బనిచేయుచున్నవనియు, ఆ రీతిని, మనదేశమునందు గూడ పల్లెటూండ్లయందు గ్రంథాలయములను స్థాపించి పనిజేయుటకు తగిన సావకాశములను గల్పింపవలసినదనియు, చెన్నపురియందు ప్రకటింపబడుచున్న "హిందూ" పత్రికాధిపతి చదువరులను గోరియుండెను. అందుమీద మనసంఘముయొక్క ఉపాధ్యక్షులును, గ్రంథాలయోద్యమశాస్త్రవేత్తలునగు శ్రీ సూరి వెంకటనరసింహంగారు.

౧. గ్రంథాలయోద్యమమునందలి ప్రధానాంశములు: దాని ఉత్పత్తి.

౨. ఐరోపాఖండమునందును, బరోడాదేశమునందును అమెరికాఖండమునందును గ్రంథాలయోద్యమము చేయుచున్నపని

3. ఆంధ్రదేశగ్రంథాలయోద్యమ వ్యాపన (ప్రస్తుతస్థితి.)

౪. ఆంధ్రదేశ గ్రంథాలయములకు లేకమైయున్న సూత్రములు.

౫ ఆంధ్రభాషయందలి సకలాంగ సాధనముల

గ్రంథాలయమును నిర్మించుటకుగల సావకాశములను గూర్చి విశేషపరిశ్రమజేసి ఐదువ్యాసములను ఆపత్రికయందే వ్రాసిరి. మఱికొన్నిటినిగూడ వ్రాసియుండిరి గాని స్థలాభావముచే ఆపత్రికప్రకటించియుండలేదు.

## మార్గదర్శకము.

"హిందూ"పత్రికయందు ఆంగ్లేయభాషయందీవ్యాసములు ప్రకటింపబడుటచే దేశముయొక్క వివిధప్రాంతములవారు వీనిని జదివి మనయుద్యమముయొక్క ఉత్కృష్టతను దెలిసికొనిరి. ఇందుకు తార్కాణముగ, పూనానగరమున మహారాష్ట్ర భాషయందు ప్రకటింపబడుచున్న "కేసరి" పత్రికమనయుద్యమముయొక్క ప్రాశస్త్యమును గూర్చి సంపాదకీయ వ్యాసమును వ్రాసియుండెను.

ఇంతేగాదు. దక్షిణహిందూదేశమునందు పుదుకోట సంస్థానమందున్న "అలంగుడి" వాస్తవ్యులు ఆసంస్థానమందుండు గ్రంథాలయముల యొక్కయు, పఠనమందిరములయొక్కయు మహాసభ నొకదానిని కూర్పవలెనని తలంచి, అందుకు జేయవలసిన ఏర్పాటులనుగూర్చియు, విధానములనుగూర్చియు విపులముగా తెలుపవలసినదని మన సంఘమునకు వ్రాసిరి. ఊరక సలహాలనిచ్చుటతో పోనివ్వక, గ్రంథాలయశాస్త్రసంబంధమైన గ్రంథములను, పత్రికలను, గొప్పగ్రంథాలయముల పటములు మొదలగువానిని వారికోరికమీదనే వారిప్రదర్శనమునకు పంపితిమి. ఇంతేగాక మన సంఘమునకు ఉపాధ్యక్షులగు శ్రీ సూరి వెంకటనరసింహశాస్త్రిగారు గ్రంథాలయనిర్మాణమునుగూర్చి వ్యాసమునొకదానిని వ్రాసిపంపగా, వారు దానిని తమస్వభాషలోనికి మార్చుకొని సభయందుజదివిరి. ఆవ్యాసము మిక్కిలి అనుభవసిద్ధముగ నున్నదనియు, దానినివినుటవలన గొప్పలాభముచేకూరినదనియు ఆసభవారు తెలియజేసియుండిరి. ఆసభతోగూడజరిగిన ప్రదర్శనమునందు మనసంఘమునకు వారిచ్చిన యోగ్యతాపత్రికను నేడు మీరు గ్రంథాలయప్రదర్శనమునందు జూడగలరు.

దక్షిణాదినున్న "ఎట్టియాపురము"నందు ధర్మగ్రంథాలయమును నిర్మింపదలచి, ఆచటి జమీదారుగారి యుత్తరువుమీద వారు బెజవాడయందున్న రామమోహనధర్మగ్రంథాలయముయొక్క "ప్లానును" తెప్పించుకొనిరి. ఈవిధముగ ఆంధ్రదేశమందేగాక ఇతరదేశములయందుండు గ్రంథాలయోద్యమాభిలాషులకుగూడ మనము సహాయకారులమగుచున్నాము.

## గ్రంథాలయములచరిత్ర.

నలనామసంవత్సరమునకు ఆంధ్రదేశ గ్రంథాలయముల చరిత్రను సేకరించితిమి కాని అనివార్యములగు కారణాంతరములచేత ప్రకటింపజాలమైతిమి - పింగళనామ సంవత్సర గ్రంథాలయచరిత్రను త్వరలో ప్రకటించుటకై ప్రయత్నించుచున్నారము. నళనామసంవత్సరాంతమున ఆంధ్రదేశమున చరిత్రలు పంపిన గ్రంథాలయములు ౩౧౨ ను చరిత్రలంపనివి ౮౦ యును మొత్తము ౩౯౨ గలవు. పింగళనామసంవత్సరాంతమునందు ౪౫౦ వరకును గ్రంథాలయములు లెక్కకువచ్చినవి. ప్రదర్శనమునందు ప్రచురింపబడిన చిత్రపటమునందు ఇందలి వివరములు కననగును.

## ఉద్యమవ్యాపన.

కడచిన వత్సరమందువలెనే ఈవత్సరమందు గూడ కార్యదర్శులు పలుస్థలములకుబోయి గ్రంథాలయోద్యమవ్యాప్తికై పాటుబడియున్నారు. ఇంతేగాక.

## జిల్లాతాలూకాసంఘములు.

కృష్ణా, గుంటూరు, గోదావరిజిల్లాలకేగాక గంజాం జిల్లాకుగూడ మండలగ్రంథాలయ సంఘమేర్పడి చక్కగపని జేయుచున్నది. సత్తెనపల్లి, గుంటూరుతాలూకాలకు నూతనముగ తాలూకా గ్రంథాలయసంఘము లేర్పడినవి. గోదావరి జిల్లాయందున్న కాకినాడ తాలూకాకుగూడ తాలూకా సంఘమేర్పడి చక్కగ పని చేయుచున్నది. తాలూకా గ్రంథాలయ ప్రతినిధుల మహాసభనుగూడ మిక్కిలి యుత్సాహముతో జరిపియున్నారు. ఇదివరకేర్పడిన గుడివాడ, భీమవరం, బెజవాడ, తెనాలి, బాపట్ల, రామచంద్రపురం తాలూకా

సంఘములు చక్కగ పనిచేయుచున్నవి. ఇంతేగాక బాపట్లతాలూకా గ్రంథాలయసంఘ కార్యదర్శిగారగు శ్రీ కోన వెంకటరాయ శర్మగారు తమతాలూకాయందే గాక, జిల్లాయందితరభాగములయందుగూడ సంచారముచేయుచు పాటుపడుచున్నారు. బాపట్లతాలూకా తాలూకాగ్రంథాలయ ప్రతినిధుల మహాసభగూడ జరిగినది. ఈవత్సరము కృష్ణా, గోదావరి, గుంటూరు మండల గ్రంథాలయప్రతినిధుల మహాసభలు, మండల రాజకీయసభలతో బాటుగ జరిగినవి. గంజాంమండల గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ ప్రత్యేకముగ టెక్కలియందు జరిగినది. గోదావరిమండల గ్రంథాలయ ప్రతినిధుల మహాసభనుగూడ రాబోవువత్సరమునుండియు, మండల రాజకీయసభతో బాటుగ జేయక, ప్రత్యేకముగ నేనిర్వహించుటకు తీర్మానించియున్నారు. మండల రాజకీయ సభతోగూడ జేయుట వలన, ఈసభయొక్క కార్యములు సరిగ నెరవేరుటలేదనియు, అందుచేత ఈ సభను మండలరాజకీయ సభనుండి వేరుపరచితిమనియు ఆజిల్లా గ్రంథాలయ సంఘకార్యదర్శులు దెలుపుచున్నారు. ఈసభను రాబోవుసంవత్సరము చిత్రాడకాహ్వానించియున్నారు.

ఈవత్సరము గంపలగూడెమునందు జరిగిన కృష్ణా మండల గ్రంథాలయసభయందు ఆమండలమున గ్రంథాలయోద్యమమును వ్యాపింపజేయుటకుగాను, ప్రత్యేకమొకకార్యదర్శిని నియమించుటకై ప్రయత్నించిరి. కార్యదర్శికి జీతము, ప్రయాణవ్యయములు మున్నగుఖర్చులన్నిటికిని గలిపి వత్సరమునకు రు ౫౦౦ లు కావలయును. ఇరువది గ్రామములవారు గ్రామమునకు ఇరువదియైదు రూపాయిలచొప్పున ఇచ్చిన ఈపని సుకరముగ నెరవేరగలదని తలంచి ౫ గ్రామములనుండివచ్చిన ప్రతినిధులు తమతమ గ్రామములయందు ఇరువదియైదురూప్యములచొప్పున వసూలుజేసి పంపెదమనిరి. త్వరలోనే ఈపని నెరవేరవచ్చును.

## సంచారకార్యదర్శి.

ఈ సంఘపక్షమున దవ్వూరి జగన్నాథశర్మగారిని సంచారకార్యదర్శిగ నియమించియున్నారు. కాని మూడుమాసములకాలము పనిజేసినపిమ్మట అనివార్యములగు కారణాంతరములచేత వారు మానుకొనవలసివచ్చినది. వారు బాపట్ల, ఒంగోలు తాలూకాలయందు జరిగిన గ్రంథాలయసభలకుబోయి యుపన్యాసముల నిచ్చియు గుంటూరుజిల్లాయందు కొన్ని గ్రంథాలయములను దర్శించియు పాటుపడియున్నారు. మఱియు గోదావరిజిల్లాయందలి కాకినాడతాలూకాయందు సంచారము చేసి నూతన గ్రంథాలయములను స్థాపించుటకై విశేషకృషినిసల్పియున్నారు.

వీరికి పిమ్మట గోపరాజు బ్రహ్మానందంగారు ఈ సంఘపక్షమున పనిజేసి యున్నారు. వీరును పలు గ్రంథాలయములకు బోయి నిబంధనలు జేసికొనుట మున్నగు విషయములయందు దోడ్పడి యుండిరి.

## గ్రంథాలయ శాస్త్రగ్రంథములు.

పాశ్చాత్యదేశములయందు గ్రంథాలయములు ఎట్లు నడుపవలయునో, ఎట్లు జనుల నాకర్షింపవలయునో, ఎట్లు గ్రంథముల నుంపవలయునో, ఎట్లు గ్రంథములను విభజింపవలయునో ఎట్లు భవనములను నిర్మింపవలయునో ఈ విషయములన్నియు ప్రత్యేక మొకశాస్త్రమై విలసిల్లినది. అందుచేత మన మా శాస్త్రమునుగూడ కొంతవరకు దెలిసికొనుట ఆవశ్యకమై యున్నది. కావున ఈ సంవత్సరముగూడ గ్రంథాలయశాస్త్రగ్రంథములను కొన్నింటిని తెప్పించి యుంటిమి.

## రామప్రసాదము.

పావనవంతమును, పుణ్యఫలప్రదంబును నగు శ్రీగోదావరినదీతీరమునందు భద్రాచలపుణ్యక్షేత్రము గలదుగదా! ఆ క్షేత్రమునందు ప్రతిసంవత్సరమును చైత్రశుద్ధనవమికి శ్రీసీతారామచంద్రుల కళ్యాణమహోత్సవము జరుగునను సంగతి మీ కందరికిని దెలసియేయున్నది. భద్రాచలక్షేత్రమునందు "శ్రీకల్పవల్లిగ్రంథనిలయ"మను పేరున గ్రంథాలయ మొకటి కలదు. ఆ గ్రంథాలయము

చక్కనికట్టు దిట్టములతో సాంఘికుల శ్రేయోభివృద్ధికై నిరంతరము తోడ్పడుచుండును. ప్రతిసంవత్సరమునందును జరుగు శ్రీసీతారాముల కళ్యాణమహోత్సవమును ఆ గ్రంథాలయసభ్యులు స్వయముగ వీక్షించి తరించుచున్నారు. ఇట్లు తాము పొందుచున్న లాభముతో తృప్తినివహింపక, గ్రంథాలయోద్యమమును ప్రచారము చేయుచున్న తోడసోదరులకుగూడ, ఆ లాభమును అందజేయవలెనని ఆ సంఘకార్యదర్శిగారు తలంచిరి. స్వయముగ స్వామికళ్యాణమును దర్శింపకపోయినను, సీతారాముల కళ్యాణమహోత్సవతలంబ్రాలుబియ్యమును శిరస్సున ధరించినచో సాక్షాత్సందర్శనఫలము లభించునని సనాతనధర్మావలంబకు లందరికిని నమ్మకము గలదు. ఈ నమ్మకము ననుసరించి ఆంధ్రదేశగ్రంథాలయసంఘసభ్యుల కందజేయవలసినదని, ఆ పట్టణగ్రంథాలయ కార్యదర్శి మన అందరియొక్క శ్రేయస్సును గోరుచు శ్రీవారి తలంబ్రాలను భక్తిపురస్సరముగ మనకు పంపియున్నారు. వీని మీ రందరును ఇప్పుడే స్వీకరింపగలరు.

ఈ ఒక్క విషయమును మనము పరికించి చూచినచో మన గ్రంథాలయోద్యమమునందు ఎట్టి శక్తులు నిగూఢమై యున్నవో మనకు బోధపడక మానదు. మొదట ఆ గ్రంథాలయ సభ్యుల ఈశ్వరభక్తి పొగడదగినది. పిమ్మట వారు పొందు లాభము వారితోనే నిల్వక "సర్వేజనాస్సుఖినోభవన్తు" అను నార్యోక్తి ప్రకారము ఆ లాభము తమ సోదరులకు గూడ లభింపజేయవలయుననువారలకు గల గాఢమగు వాంఛ మనకు గోచరించుచున్నది. దీనివలన మఱియొక విషయముగూడ విశదమగుచున్నది. భారతీయులు ఎప్పుడును స్వలాభముతోడనే సంతుష్టి నొందరనియు "ప్రపంచమంతయు తన లాభముకొరకే ఈశ్వరునిచే సృష్టింపబడెనని పాశ్చాత్యసిద్ధాంతమును త్రోసివైచి, "ఆత్మవత్సర్వభూతేషు । యఃపశ్యతి సపశ్యతి" (ప్రపంచమంతయు తనవలెనే చూచుకొనువాడే జ్ఞాని) అను నార్యోక్తిని కేవల మాదర్శముగా నుంచుకొనుటయేగాక, అవకాశము కలిగినప్పుడెల్ల ఆచరణలోనికి తెచ్చుకొనుటకై ప్రయత్నించువారను నదియొక యంశము తెలుపుచున్నది. ఎట్టి విపత్కాల మాసన్నమైనను, మన దేశమునందు అనుశ్రుతముగ వచ్చుచున్న మర్యాదలను రూపుమాప సమర్థములు కల పరిస్థితు లెంతగా వ్యాపించి విజృంభించుచున్నను, ఆర్యధర్మము సనాతనమనియు ఆర్యావర్తమందలి ధారావాహికజ్ఞానము అనశ్వరమనియు ఈ చిన్న విషయము మనకు బోధించుచున్నది. అంశము స్వల్పమే యైనను ఆలోచించినకొలదిని, ఈ ఒక్కదానిని బట్టియే, మన కెన్నియో మహత్తరములగు నంశములు స్ఫురించుచున్నవి.

## మన ఉద్యమప్రాశస్త్యము.

గ్రంథాలయోద్యమముయొక్క ప్రాశస్త్యమును గూర్చి మీకు విశేషముగ జెప్ప నక్కరలేదు. ఏ గ్రామమునందైననేమి పట్టణమునందైననేమి, నిత్యజీవనమును గలిగి, నిత్యమును జనుల నుద్బోధింప శక్తి గలిగిన వీగ్రంథాలయములే యని చెప్పిన అతిశయోక్తి ఎంతమాత్రమును గాదు. మన సోదరులజీవితములు పవిత్రవంతములుగను, పురుషార్థసాధకములుగను చేయవలెనన్న ఈ యుద్యమమే పరమతారకమై యున్నది.

కాని, గ్రంథాలయోద్యమము ఆంధ్రదేశమునందు ఏయే పరిస్థితులయం దభివృద్ధిని జెందుచున్నదో, అట్టిది ఇతరదేశములయం దెచ్చటను గనుపింపదు. బరోడారాజ్యమునందైనను, ప్రభువుల సహాయముచేతనే గ్రంథాలయములు స్థాపింపబడి, పోషింపబడుచున్నవి. మన దేశమునందటుల గాదు "కార్నీజీ" వంటిదాతల దాతృత్వమింకను ఈయుద్యమము వైపునకు మరలలేదు- "బరోడా" యందువలె ప్రభువులసహాయమింకను ఈయుద్యమము పట్ల లభింపలేదు- ఇతరదేశముల యందువలె ప్రోత్సాహము లేకపోవుట యటుండ ఈ యుద్యమమునకు నాయకుల మనోదృష్టియందైన స్థాన మేర్పడి యుండలేదు. గ్రామస్థులకన్ననో ఈయుద్యమతత్వమింకను బోధపడలేదు.

ఇట్టి పరిస్థితులలో నీ యుద్యమ మెట్టుల ప్రారంభ మైనది? ఎట్టుల నిర్వహింపబడుచున్నది? ఉత్సాహవంతులగు కొందరు యువకులచేతనే యీ యుద్యమము ప్రారంభ మైనది. ఉత్సాహవంతులగు యువకుల తీవ్ర కష్ట పరంపరలవలననే ఈ యుద్యమము నిర్వహింపబడుచున్నది. గ్రంథాలయముల నిర్వాహకులే యధికముగ, కష్టములకు సహనము చేయక తమ స్వప్రయోజనము సఫలమగు నంతవరకు మిక్కిలి ఉత్సాహముతో తమ ధర్మములను నిర్వర్తించుచున్నారు.

ఈ విషయమును గూర్చి "ఆంధ్రపత్రిక" యిట్లు వ్రాయుచున్నది "ఆంధ్రదేశమునందలి గ్రంథాలయోద్యమము మిగుల యుద్యమములవలె ప్రభుత్వము వారిచే ముద్రింపబడి నాయకుల యాధీనమందున్న యుద్యమము కాదు. గ్రంథాలయములందగు సంకల్పమునందుండెడు పనివారలు మువ్వురు. సర్వస్వతంత్రులైన కార్యకర్తలే యీ యుద్యమమునకు మూలకారకులు. గ్రంథాలయములు కేవలము ... కార్యకర్తలచే నడుపబడుచున్నవి."

తృతీయ గ్రంథాలయ ప్రతినిధి సభకు అధ్యక్ష స్థానము వహించిన శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు చెప్పినట్లు — "గ్రంథాలయోద్యమము సాంఘిక సభలవలె, ప్రసంగ భూయిష్ఠమగు వివాదములకు కారణములు కాకున్నవి. సభాసమావేశములు భాషాప్రసంగములకు కాక నాయకులైన భావవిజ్ఞానముకొరకు నడుపబడుచున్నవి. గ్రంథాలయ సభలు కార్యక్షేత్రములందు నడుపబడు కార్యవ్యాప్తికి సోపానములగుచున్నవి. గ్రంథాలయ సభా ప్రతినిధులు గ్రంథాలయ నిర్వాహకులు. గ్రంథాలయ సభల ప్రతినిధులు, కార్యకర్తలు గాని, వాక్చాతుర్యముగల సభాపతులు కారు. వారు ఉపన్యాసకులు కారు, అధికారులు కారు, సేవాసక్తులు గాని లోకప్రసిద్ధులు కారు. నిస్వార్థులైన సేవకులు గాని, ... భాగ్యవంతులు గారు."

ఆంధ్రోద్యమముతో సమకాలికముగా గ్రంథాలయోద్యమము ప్రారంభమైనది. ఆంధ్రోద్యమము యొక్క ఆశయములన్నిటి యొక్కయు అవసరావశ్యకతలను వెల్లడించి వానిని కార్యాచరణమునకు తెచ్చిన ప్రాప్తి నొసంగుచున్నది. ఈయుద్యమమే ఆంధ్రశక్తిని లోకమున స్ఫుటపఱచి దాని వికాసమును ప్రజ్వలింపజేయుచున్నది. ఈ యుద్యమము యొక్క ప్రచారణ వల్లనే కదా సేలముజిల్లా హోసూరునందును బరంపురం వలసందలి మాండలీయందు, బంగాళా రాజధానియందున్న సాక్షి, కలకత్తా ఖరగపూరు జీవకునందున్న జాతీయందును చెంగల్పట్టు జిల్లా ... గారి పాలెమందును ... జిల్లాయందున్న సింహపురమునందును గల ఆంధ్రులందరు ఏకత్రసమావేశమయి తమ భావములను తమ ప్రాప్యములను తమ కార్యసిద్ధిని ఏకముగా మాతృభాషామూలమున వ్యక్తీకరించుకొనుటకు సావకాశము కల్గినది. దేశభాషలయందు ... ఏకీకరణముగను ... జనులకును ... వ్యాపింపగలదని ఈ యుద్యమమే ఋజువు చేసినది. ... దేశమం ... భిన్నభిన్న ... జాతీయ ప్రబోధము ఈ యుద్యమ ప్రచారణవల్లనే మారుమూలలనున్న జానపదులనుకూడ సాక్షాత్కరించి వారలయందు ఆత్మగౌరవమును జాతీయాభిమానము వృద్ధిపరుపను ... నాటినది. మన ప్రజలు అజ్ఞానాంధకార నిమగ్నులుగా నున్నారు. వారికి రాజకీయ పరిజ్ఞాన మేర్పరచి ... రాజకీయ స్వాతంత్ర్యము వారల కొసంగిన సింహాసనము ఆ తత్క్షణమే ... స్వలాభాపేక్షకులకు ... వ్యతిరేకులు ... వాదమునందు ఏమియు ఆధారము లేదని యిదివరకు పరిస్థితులు కల్పించినచో ప్రస్తుత పరిజ్ఞానస్థితి ... మన పల్లెటూరివారు రాజ్యాంగ భారనిర్వాహణమునకు తగియున్నారని రూఢిపరచినది.

ఈ విషయమునుగూర్చి ఆంధ్రపత్రిక ఇట్లు వ్రాయుచున్నది. "ఆంధ్రోద్యమమునకు ఆంధ్రగ్రంథాలయ ... గ్రంథాలయము ఆంధ్రోద్యమమునకు ఫలములైన దేశ ... భాషాభివృద్ధి ...

గ్రంథాలయోద్యమము ప్రయోజనకారియై యున్నది. ఏపండితుఁడు, ఏవార్తాపత్రిక, ఏపాఠశాల నిర్వహింపజాలని మహాకార్యమును గ్రంథాలయములు నిర్వహించుచున్నవి. ఆంధ్రోద్యమసాధ్యములైన సకలాదర్శములును నాంధ్రగ్రంథాలయములయందు విస్పష్టముచేయఁబడుచున్నవి.”

భారతవర్షమునంతకును భారతవర్షమున కనసేల ప్రపంచమున కంతకును, ఆంధ్రదేశమునందు ప్రబలియున్న గ్రంథాలయోద్యమము ఆదర్శప్రాయమై యున్నది ఇట్టిదని స్వోత్కర్షగర్భాపింప వలసినదిలేదు- ప్రపంచమునందెచటనైనను, ఎవ్వరికైనను, స్వస్వరూపానందము లభించినగాని ఆత్మౌన్నత్యమును బొందజాలరు. అదే విధమున, మనయుద్యమముయొక్క స్వస్వరూపానందము ననుభవించినగాని, ఉద్యమమునం దున్నతస్థానము నాక్రమింపజాలము. కావున ఈయుద్యమముయొక్క శ్రేష్ఠతను గ్రహింపవలెను. గ్రహించి అనుభవింపవలెను. అప్పుడుగాని ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమము ప్రపంచమున కంతకును ఆదర్శప్రాయముగ నిగోచరింపదు. ఇట్టి మహోత్కృష్టమైన ఉద్యమాశయములను భారతవర్షమునకును, తన్మూలమున ప్రపంచమునకంతకునుగూడ ఒసంగుట మనవిధ్యుక్తధర్మమై యున్నది.

## గ్రంథాలయసర్వస్వము.

ఈధర్మమును నిర్వర్తించుటకై ఈసంఘపక్షమున ప్రకటింపఁబడు గ్రంథాలయసర్వస్వమును ఆంగ్లేయభాషయందుగూడ ప్రకటించుటకై ప్రయత్నించుచున్నారము. గ్రంథాలయసర్వస్వముయొక్క రెండుసంపుటములు ముగింపఁబడినవి మూడవసంపుటమునందు ఒకసంచిక వెలువడినది. రెండవసంపుటమునకు రు ౧౩౦ లు నష్టమువచ్చి యుండినను, సంవత్సరమునకు నాలుగుసంచికలకు బదులు ఆరు సంచికలను ప్రకటింపవలెనని నిర్ణయించుకొంటిమి.

## భవిష్యత్తు.

ఆంధ్రదేశమునందు గ్రంథాలయోద్యమము ఇంతవరకు, భారతవర్షమున జన్మించిన యుద్యమములన్నింటికంటె మిన్నయగు నభివృద్ధినే జూపియున్నది కాని గ్రంథాలయములను నిర్వహించువారి కింతటితో తృప్తి గలుగలేదు. వారు ఇంకను పలువిధముల ఆంధ్రవ్యక్తి వికాసమునకును, ఆంధ్రదేశాభ్యుదయమునకును పాటుపడవలెనని సంకల్పించుకొనియున్నారు మూడవ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభకు అగ్రాసనాధిపతులగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారిట్లు చెప్పిరి:—

“గ్రంథాలయములు, పఠనమందిరములు, వ్యాయామనిలయంబులై, కర్మక్షేత్రంబులై, సేవాసదనంబులై, విద్యాలయంబులై సుందరసంగరంబులై, నాటకరంగంబులై, ధర్మసంరక్షణ సాధనంబులై విరాజిల్లునప్పుడు జాతీయ వికాసంబునకు మహత్తరంబైన సాధనంబులు కాగలవు.”

ఇందుసూచింపబడిన విషయములయందన్నిటియందు మనము ఇంతవరకు కొద్దిగనో, గొప్పగనో పనిచేయుచునే యున్నాము. అయినను మనము ఆయావిషయములందింతకంటె ఎన్నియో మడంగులెక్కువగ కృషి సలుపవలసియున్నది.

కావున ఈవత్సరమునుండియు, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమునకు ౧ సేవాశాఖ ౨ సారస్వతశాఖ 3 వ్యాయామశాఖ ౪ లలితకళాశాఖ ౫ నిమ్నజాత్యుద్ధరణశాఖ ౬ విద్యాశాఖలను స్థాపించి మనకు చేతనైనంత వరకు పనిచేయుట అత్యంతావశ్యకమైయున్నది వివిధములగు ఇన్నిపనులను బెట్టుకొనుటవలన మనపనిఇప్పటికంటె అనేకవిధముల పెరుగుననుట కెంతమాత్రమును సందియములేదు. అయినను మనము ఎంతమాత్రమును సంకోచింపవలసినదిలేదు. అల్పారంభములే మహదుద్యమములగుచుండుననుట మనకు స్వానుభవవైక వేద్యమేగదా: కావున ముందంజవేయుటయేగాని వెనుకకడుగువేయ వలసినదిలేదు.

మనము చేయవలసిన ముఖ్యమగుపనిఇంకొకటిగలదు. ప్రపంచమందెచటనైనగాని మతముపైనను ధర్మముపైన

ను ఆధారపడియుండినట్టి ఎంత స్వల్ప యత్నమైనను రాణించుననుటకు సందియములేదు. అట్టి గుణము ముఖ్యముగా భారతీయులయందు వేళ్ళూనియున్నది. వృద్ధులనైననేమి, యువకులనైననేమి, విద్యాధికులనైననేమి, మూఢులనైననేమి - ఎల్లరను సర్వకాలసర్వావస్థలయందును ఆకర్షింపదలతుమేని, పట్టణములు - పల్లెలు అను భేదములేకుండ సర్వప్రదేశములయందును జ్ఞానజ్యోతిని వెలిగింపదలతుమేని మనయుద్యమముగూడ మతముమీదను అంటె ముఖ్యముగ ధర్మముమీదను ఆధారపడియుండవలెను; ఇట్లనుటవలన ఇదివరకు లేదనిగాదు. ధర్మముమీదను, మతముమీదను ఆధారపడియుండుట వలననే మన యుద్యమమున కింతటి జయము చేకూరినదని నా యభిప్రాయము - ఇకముందు ఇంతకన్న పలుముఖముల ఏతద్విషయమై పనిజేయవలెనని నాయభిప్రాయము. ఉత్సాహవంతులగు యువకులనేకులు మనయుద్యమమునందు నిష్కామముగ పనిజేయుచున్నారు - "ఆంధ్రపత్రిక" చెప్పినటుల వారు "స్వయంసహాయావలంబనులు, త్యాగపరులు, సేవానిరతులు, కార్యశూరులు, వ్యగ్రోత్సాహభరితులు, మాతృభాషాభిమానులు" వివిధ గ్రామములందువారు వెదజల్లబడియున్నారు. వారికి ఈ గుణములన్నియు, ఒకరిబోధనవలన ఒకరిశుశ్రూషవలన వచ్చినవిగావు ఇట్టి పరిజ్ఞానము స్వతహాకలిగినదియైయున్నవి. ఇట్టివారినందరిని ఒకచోజేర్చి వారికసరియైన శిక్షణనొసంగి మంచిపరిజ్ఞానమును గలిగించిన వారివలన మహాత్కార్యములు సాధింపవచ్చును - కావున వారికొక బోధనాతరగతిని వెంటనే ఏర్పాటుచేయుట అత్యావశ్యకము.

సోదరులారా! ఇట్టిమహాత్కార్యములకు తలపెట్టుకొనుమంటిమే! తలదాచుకొనుటకొక వసతియైన మన సంఘమునకు లేదే!! అని మీరాలోచింప వలసినది లేదు. మనము సత్కార్యములను దలపెట్టికొనిన అవి నెరవేరకపోవునా! సత్కార్యాచరణమునకు భగవంతు డెప్పుడును తోడ్పడుచునే యుండును.

## కేంద్రగ్రంథాలయము.

బెజవాడపట్టణమునందు రామమోహనగ్రంథాలయమను పేరున, గ్రంథాలయమొకటి ఉండినసంగతి మీకందరికిని తెలిసియేయున్నది. ఆ గ్రంథాలయమునకు ౨౧౦౦ చతురపుగజముల స్థలమును, అందులోతయారై సిద్ధముగనున్న పెద్దడాబాయిల్లును, తగినన్ని బీరువాలును, వానిలో రమారమి ౫,౦౦౦ గ్రంథములునుగలవు; ఇవియన్నియు రమారమి పదునైదువేలరూపాయిల విలువగలిగియుండెను. ఆంధ్రదేశగ్రంథాలయ సంఘము ౧౯౧౪ సం॥ నందు ఏర్పడినది మొదలు ఆగ్రంథాలయ భవనమునందే ఒకగదియందుంపబడినది. ఇప్పుడా గ్రంథాలయమువారు ఆంధ్రదేశగ్రంథాలయసంఘమను పేరుతో తమ రామమోహనగ్రంథాలయమే కేంద్రగ్రంథాలయముగ నుండవలెనని తీర్మానించుకొనియున్నారు. మనకంగీకారమగు నెడల మనసంఘమును గూడ దానితో గలిపిన యెడల వారును మనముసు గలిసి పనిజేయుటకనువుగనుండును అనగా ౧౫౦౦౦ రూప్యముల విలువగలస్థలమును భవనమును గ్రంథములును ఆంధ్రదేశాభ్యుదయమునకై వినియోగించుటకు సందర్భముగలిగియుండును. ఇంతేగాక గ్వాతీను గోదావరిమండల గ్రంథాలయసభయందు ఆంధ్రదేశకేంద్రగ్రంథాలయమును రాజమహేంద్రవరమున స్థాపింపబడుటకు తత్పౌరులను హెచ్చరించుచు తీర్మానించియున్నారు. మనయుద్యమము ఇంకను మీరాదరించినటుల పలుముఖముల వ్యాపింపజేయుటకుగాను ఈ యమూల్యసహాయమును అపరాత్పరుడే మనకు పంపినాడని నాతలంపు. ఈయవకాశమును మనము పోగొట్టుకొనక వినియోగించెదరని నాప్రార్థన.

## ఆదాయవ్యయములు.

ఆదాయము:—

| | |
|---|---|
| నాల్గవఆంధ్రదేశగ్రంథాలయప్రతినిధుల మహాసభ ప్రతినిధులరుసుములు | ౬౩-౦-౦ |
| వెనుకటిబాకీవసూలు | ౮-౧౦-౦ |
| గంటి లక్ష్మన్న గారు | ౫-౦-౦ |

| | |
|---|---|
| ఆంధ్ర మహాజనసభ స్థాపితోపసంఘము వారు సంచారకార్యదర్శికొరకు | ౧౫౦-౦-౦ |
| వెరశి ... | ౨౨౬-౧౦-౦ |

వ్యయము:—

| | |
|---|---|
| ప్రథమగ్రంథాలయప్రదర్శనమునకు వస్తువులను పంపుటకు, తిరిగి తెప్పించుకొనుటకు అయిన వ్యయములు | ౨౦-౦-౦ |
| పోష్టుఖర్చులు | ౧౬-౪-౬ |
| పత్రికలు | ౭-౧౩-౦ |
| చిల్లరలు | ౭-౧౦-౦ |
| అచ్చు ... | ౭-౪-౦ |
| గ్రంథములు ... | ౦-౧౪-౦ |
| టెలిగ్రాఫ్‌లు ... | ౨-౧౧-౬ |
| సంచారకార్యదర్శుల జీతములు రైలుఖర్చులు | ౯౨-౧౦-౬ |
| గతసంవత్సరము తాలూకు బాకీతీర్చినది | ౫౬-౧౩-౯ |
| | ౨౧౨-౧-౩ |

నిల్వ:— రు ౧౪-౮-౯

సోదరులారా! ఈవత్సరమున జరిగినపనినిగూర్చియు, ఆదాయవ్యయములగూర్చియు మీరువినియేయున్నారు. ఇట్టి ఆదాయముతో మనమిక ముందు కార్యములను కొనసాగించుట దుర్ఘటము. ముందుమనము ప్రారంభింపవలసిన మహాకార్యములను గూడ వివరించియుంటిని. ఇంతేగాక బెజవాడ రామమోహనగ్రంథాలయమువారు కేంద్రగ్రంథాలయ విషయమై చేసినప్రయత్నములను గూడ మీకు విశదపరచితిని. వావిళ్ళవారి దానముతో కేంద్రగ్రంథాలయస్థాపనయు, మనసంఘముయొక్క స్థిరత్వమును తప్పని సరియయ్యెను. కావున ఈవిషయములన్నిటిని చక్కగాయోచించి, కార్యవిధానమును నిర్ణయించెదరని కోరుచున్నాడను.

నిస్సారమును, భావోద్రేకరహితమునునగు నీదీర్ఘవ్యాసమును మీరు ఓపికతో విన్నందులకు నాహృదయపూర్వకవందనము లర్పించుచున్నాడను.

సభనలంకరించిన పెద్దలలో గొందరు:— ఆకెళ్ల సూర్యనారాయణరావుగారు, భూపతిరాజు వేంకటపతిరాజుగారు; సి. పి. ఎన్. నరసింహరాజుగారు, మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రిగారు, దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు, వఝ్ఝుల చినసీతారామశాస్త్రిగారు, రాయబహద్దరు సూర్యనారాయణశాస్త్రిగారు, ఆచంట వేంకటరాయసాంఖ్యాయన శర్మగారు, బుర్రా శేషగిరిరావుగారు, ప్రభల లక్ష్మీనరసింహముగారు, ఎసమండ్ర నారాయణమూర్తిగారు, రావుబహద్దరు నరసింహారావుగారు, చెలికాని లచ్చారావుగారు, దేవులపల్లి స్వామిశాస్త్రిగారు, నేలనూతుల సుబ్బారావుగారు, శ్రీజగన్నాథ పాడిఖడంగగారు, కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు, ఉమ్రే ఆలీషాకవిగారు, ఆతీ అప్పడు పంతులుగారు, కోపల్లె హనుమంతరావుగారు, బెల్లంకొండ రాఘవరావుగారు, తిత్తి బలరామయ్యగారు, వంగూరి సుబ్బారావుగారు, తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు, సి. వి. రంగం శ్రేష్ఠిగారు.

పిమ్మట సభకు రాజాలమనియు, జయప్రదముగ జరుపబడుగాకయని భగవంతుని ప్రార్థించుచు వ్రాసిన ఈక్రిందివారుపంపినయుత్తరములును తంతీవార్తలును జదువబడెను:— కొండాలి శివరామకృష్ణారావుగారు, గోనుగుంట్ల వేంకటసుబ్రహ్మణ్యంగారు, బూదూరు రామానుజులురెడ్డిగారు, పానకాపట్టాభిరామారెడ్డిగారు, ఆరెకపూడి రామశాస్త్రులుగారు, దేవరాజు సీతారామస్వామిగారు, ఆచంట సూర్యనారాయణరాజుగారు, సోంభొట్ల వెంకయ్యగారు, తాడంకి వెంకయ్యగారు, నట్టి నరసింహారావుగారు. రాబోవువత్సరము ఈసభను బందరునందు జరుపవలసినదని కొండాలి శివరామకృష్ణారావుగారును, చెన్నపట్నమునందు జరుపవలసినదని గోను

గుంట్ల వేంకటసుబ్రహ్మణ్యంగారును ఆహ్వానములనంపిరి. అంతటితో నాటిసభముగిసినది.

తిరిగి ౨3-౬-౧౮ తేదీఉదయము తొమ్మిదిగంటలకు పురమందిరమున సభకూడెను. అప్పుడు దిగువతీర్మానములుచేయబడినవి:—

తీర్మానములు.

౧ ప్రపంచకళ్యాణముకొఱకును ధర్మసంస్థాపనకొఱకును నున ఏలికలిప్పుడు జరుపుచున్న మహాసంగ్రామమున, వారికచిరకాలమున జయము పరమేశ్వరుడు చేకూర్చుగాత మని ఈసభవారు భగవంతునిప్రార్థించుచున్నారు. అగ్రాసనాధిపతి.

౨. ఆంధ్రమహాజనసభతోబాటుగ ఈగ్రంథాలయసభను ఆంధ్రమహాజనసభ జరుగు ప్రదేశములయందే ప్రతివత్సరము జరుపుచుండవలెనని, ఆసభవారుచేసిన తీర్మానమును ఈసభవారు అంగీకరించుచున్నారు.

ఉ.—సి. వి. రంగంశెట్టిగారు (చిత్తూరు)

ఆ.—దుగ్గిరాల దేవశ్రీరాజుగారు (ఏలూరు)

ఈతీర్మానమునకు వ్యతిరేకముగ నేలనూతుల సుబ్బారావుగారు (మద్రాసు), కె. యస్. నారాయణరావుగారును మాట్లాడిరి. అంతట ఓట్లు తీసికొనగా ఈతీర్మానమునకు అనుకూలముగా ౧౯ మందియును, వ్యతిరేకముగా ౧౭౧ మందియును సమ్మతులనిచ్చిరి. అందుచేత ఈతీర్మానము ఓడిపోయెను.

౩. ౧౮౬౦ సం॥ ౨౧ నెం. ఆక్టు ప్రకారము రిజిష్టరుకాగోరు గ్రంథాలయములయొద్దనుండి రుసుమును వసూలుపరచకయే అట్టి రిజిష్టరీ అంగీకరింపవలెననియు, ఆంధ్రదేశగ్రంథాలయములన్నిటికి ఆంధ్రభాషయందు దొరతనమువారు ముద్రించుప్రకటనములన్నింటిని ఉచితముగా దొరతనమువారు ఇచ్చుచుండవలెననియు గ్రంథాలయములకు స్థానికస్వపరిపాలనా సంఘములనుండియు దొరతనమువారి బొక్కసమునుండియు ధనసహాయము చేయుచుండవలెననియు ఈసభవారు దొరతనమువారిని ప్రార్థించుచున్నారు. అగ్రాసనాధిపతి.

3. గ్రంథాలయముల యాజమాన్యముక్రింద ఆంధ్రుల ప్రత్యేకవ్యక్తిని, కళలను, ఆచారములను, పండుగలను, వర్ధంత్యుత్సవములను, ప్రోత్సాహపఱచుటయు—తమకు సంబంధించిన రాత్రిపాఠశాలలయందు, ఆంధ్రుల ప్రత్యేకవ్యక్తిని, కళారూపమును దెలుపు విద్యావిధాన మవలంభింపవలెననియు ఈసభవారు ఆంధ్రదేశగ్రంథాలయ సాంఘికులను కోరుచున్నారు.

ఉ.—ప్రభల లక్ష్మీనరసింహంగారు

ఆ.—మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రిలుగారు

దివాకర్ల తిరుపతిశాస్త్రిలుగారు

కే. ఎస్. నారాయణరావుగారు

ఉమ్రావు ఆలీషాకవిగారు

౪ ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమునకు బెజవాడ రామమోహనధర్మగ్రంథాలయము కేంద్రగ్రంథాలయముగా జేయుచు, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమువారిచే నిర్వహింపబడిన నిబంధనల ననుసరించి తత్సంఘమును నిర్వహించుటకై సభవారు తీర్మానించుచున్నారు.

ఉ.—గాడేపల్లి సూర్యనారాయణశర్మగారు,

ఆ.—టంకాల సాంబమూర్తిగారు, టెక్కలి.

ఈతీర్మానమునుగూర్చినచర్చ ఆఖరు కాకుండుటచే ౧౦-30 గంటలకు సభ ముగింపబడి, తిరిగి మధ్యాహ్నము ౨ గంటలకు కూడెను. అప్పుడు కొంత చర్చ జరిగినపిమ్మట అందరిచే నేకగ్రీవముగ నంగీకరింపబడెను.

౫ ఆంధ్రపరిశోధక మహామండలిపక్షమున పిఠాపురమునందు లిఖితమాతృగ్రంథాలయమును స్థాపించి ఆంధ్రదేశ భాషావాఙ్మయచరిత్రాభివృద్ధికి పాటుపడుచున్న ఎర్నగూడెంజమీందారులగు శ్రీచెలికాని లచ్చారావుగారి నీసభవారు హృదయపూర్వకముగ నభి

సందించుచు, ఆంధ్రదేశమునందలి గ్రంథాలయముల వారు తమ శక్తికొలది తమ చుట్టుప్రక్కల లిఖిత గ్రంథాధికముల సంపాదించి, ఆ మండలివారికి బంపి సాయపడుట అత్యవసరమని ఈ సభవారు అభిప్రాయపడుచున్నారు.

ఉ.—బెల్లంకొండ రాఘవరావుగారు

ఆ.—అయ్యంకి వేంకటరమణయ్యగారు

౬ భాషాసాహిత్యాభివృద్ధికిని, అన్యోన్యాభిప్రాయముల వెలిబుచ్చి నూతన సమాచారముల గ్రహించుటకును గ్రామచరిత్రలను వ్రాయుటకును, వ్రాతగ్రంథములను ప్రతి గ్రంథాలయమువారును వెంటనే స్థాపించుట ఆవశ్యకముగాన, వానిని స్థాపింపవలసినదని, గ్రంథాలయ సభ్యులను ఈ సభవారు కోరుచున్నారు.

ఉ.—నేలనూతుల సుబ్బారావుగారు, మద్రాసు.

ఆ.—దాసరి లక్ష్మణస్వామిగారు, పిఠాపురం.

౭ ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు క్రిందటి సంవత్సరమునందున్న అగ్రాసనాధిపతి ఉపాగ్రాసనాధిపతులు, కార్యదర్శి సహాయకార్యదర్శులు, ఇతర సభ్యులు, జిల్లా తాలూకా సంఘముల ఉద్యోగులు, దివాకర్ల తిరుపతిశాస్త్రిలుగారు, ప్రభలలక్ష్మీనరసింహంగారు కలిసి, ఆంధ్రదేశగ్రంథాలయసంఘముగ ఏర్పడుటకును, కేంద్రగ్రంథాలయసంఘముయొక్కయు, ఆంధ్రదేశగ్రంథాలయసంఘముయొక్కయు నిబంధనలను ఈ సంఘమువారేర్పరచుటకును, అట్లేర్పడిన నిబంధనలు ఏర్పడినవెంటనే అమలులోనికి వచ్చి ఇదివరకున్నవి రద్దు అగుటకును తీర్మానించడమైనది.

ఉ.—శ్రీవిక్రమ దేవవర్మగారు

ఆ.—అయ్యంకి వేంకటరమణయ్యగారు

౮ వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండు సన్సువారు వడ్డాది సుబ్బారాయుడుగారు, కాశీనాధుని నాగేశ్వరరావుగారు, మద్దుల వేంకటచిన్నంరాజుశ్రేష్టిగారును, ఆంధ్రదేశగ్రంథాలయసంఘమునకును పండ్రెండుమండలములయం దేర్పడు పండ్రెండు మండలగ్రంథాలయ సంఘములకును తమ గ్రంథముల నన్నిటిని ఇచ్చుటకు వాగ్దానముచేసి, ఆంధ్రదేశగ్రంథాలయసంఘమున కిదివరకే తమ గ్రంథముల నిచ్చినందులకు ఈ సభవారు తమ కృతజ్ఞతను దెలుపుచున్నారు.

౯ ఈ సభ రాబోవు వత్సరమున బాపట్లయందు జరుపవలెనని, కోన వేంకటరాయశర్మగారు ఆహ్వానము చేసిరి. పిఠాపురమునందు చేయవలెనని, గాడేపల్లిసూర్యనారాయణశర్మగారును, మల్యాలగోపాలరావుగారును ఆహ్వానము చేసిరి. కొండవీటియందు చేయవలెనని బెల్లంకొండరాఘవరావుగారును, కోలవెన్ను రామకోటీశ్వరరావుగారును ఆహ్వానము చేసిరి. చెన్నపట్నమునందు చేయవలసినదని గోనుగుంట్ల వేంకటసుబ్రహ్మణ్యంగారు ఉత్తరము వ్రాయుటయేగాక, వాసంతగ్రంథాలయ కార్యదర్శిగారగు నేలనూతులసుబ్బారావుగారు వచ్చి అచట చేయవలసినదని ఆహ్వానము జేసిరి. తుదకు మద్రాసునందుచేయుటకే తీర్మానింపబడినది. అంతటితో నాటి సభ ముగిసినది.

౨౮వ తేదీ ఉదయము ౭ గంటలకు పచ్చయప్పమందిరమున తిరిగి సభకూడినది. అప్పుడీ వ్యాసములును ఉపన్యాసములును జరిగినవి:—

౧ గ్రంథాలయోద్యమము—ఆంధ్రులసిద్ధాంతము. —సూరి వేంకటనరసింహశాస్త్రిగారు, బెజవాడ,

౨ గ్రంథాలయమహాసభలు-అవిచేయవలసినపనులు. —వెలిదెండ శ్రీనివాసరావుగారు,

3 గోదావరిమండల గ్రంథాలయోద్యమము. —చింతపెంట వేంకటరమణయ్యగారు,

౪ నారాయణవరం గ్రంథాలయవృత్తాంతము. —సి. వి. రంగంశెట్టిగారు, నారాయణవరం.

౫ గోదావరీమండలగ్రంథాలయసభవృత్తాంతము. —అవసరాల వేంకటరెడ్డిపంతులుగారు,

౬ గుంటూరుమండలగ్రంథాలయోద్యమము. —బెల్లంకొండరాఘవరావుగారు, పమిడిపాడు.

౭ కృష్ణాజిల్లా భీమవరంతాలూకా గ్రంథాలయోద్యమము.

—నిడమర్తి లక్ష్మీనారాయణగారు

౮ గంజాంమండలగ్రంథాలయోద్యమము.

—తిత్తిబలరామయ్యగారు, (బరువ)

౯ శారదానందనిలయము—విశాఖపట్నము.

౧౦ ఏలూరు హిందూయువజనసంఘచరిత్ర.

—గ్రంధిరామమూర్తిగారు, ఏలూరు.

౧౧ బాపట్లతాలూకాగ్రంథాలయసంఘచరిత్ర.

—కోన వేంకటరాయశర్మగారు.

౧౨ గ్రంథాలయోద్యమము.

—దేవులపల్లిస్వామిశాస్త్రిగారు.

౧౩ పురాణపఠనము.

—కే. రంగనాయకులుగారు.

పిమ్మట ఈదిగువతీర్మానము చేయబడినది:—

హర్ హైనెస్ వధ్వాన్ రాణిసాహెబాగారు విశాఖపట్టణమున స్థాపించిన మహారాజా సర్. జి. ఎన్. గజపతిరావు కె. సి. ఐ. యి. వారి హిందూపఠనమందిరము, జనోపయోగముగ నున్నందున ఈ సభవారు శ్రీవారికి వందనము లర్పించుచు, ఈ ప్రతిష్ఠాపనవలన కల్గెడి ఉపయోగము జనసామాన్యమందరికిని చేరుటకై ఈ పఠనమందిరమును ధర్మమండలగ్రంథాలయముగ నేర్పర్చి, తన్మూలమున విశాఖపట్టణజిల్లాప్రజ లందరకు ఉపయోగముగా నుండునట్లు చేయుటకు శ్రీవారిని ఈ సభవారు వినయపూర్వకముగ ప్రార్థించుచున్నారు.

ఉ.-కోలవెన్ను రామకోటీశ్వరరావుగారు,

ఆ.-బెల్లంకొండరాఘవరావుగారు, పమిడిపాడు.

అద్దంకిసత్యనారాయణశర్మగారు

పిమ్మట అగ్రాసనాధిపతి గారు అంత్యోపన్యాసము నిచ్చిరి. అనంతరము బ్రహ్మశ్రీ దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు ఈ ఆశీర్వచనపద్యములను జెప్పిరి:-

సీ. మీకున్న ధనశక్తిమేరకుఁ దగిన యా
చితిఁగల్గు పాత్రముల్ చేర్పుఁడయ్య
ప్రత్యాలయంబునఁ బ్రతిదినంబు పురాణ
పఠనగౌరవము గాపాడరయ్య
పగలు రాత్రులని బడుగువారలకు
గ్రాసులఁ బాఠశాలలు నిలుపరయ్య
తమ సేయుపనుల నాదర్శంబుగాఁ
దక్కినవారిచేత తర్కింపుడయ్య
భారతీసేవసేయంగఁ గోరుఁడయ్య
నిచ్చలును మాతృభాష వర్ధింపుఁడయ్య
గ్రంథభవనంబులను జేర్పఁగఁదగుఁడయ్య
సద్యమతులార! ఆంధ్రసోదర్యులార

ఉ. ఒక్కకచోట నీకరుణ
నొక్కకరీతిగనుంచుచుండు వే
దిక్కునఁ దావకీనమగు
దీప్తివెలుంగుచునుండు దానికిన్
జక్కని తెల్వివచ్చునని
సజ్జనులే వచియింత్రుగాన మా
ప్రక్కకువచ్చి పల్లెల ని
వాసము సేయఁగదమ్మ భారతీ!

అంతట అగ్రాసనాధిపతి గారికిని, ప్రతినిధులకును ఆహ్వానసంఘమువారికిని తగినతియలకును వందనసమర్పణమైన పిమ్మట వందేమాతరధ్వానములతోడ సభ ముగింపబడినది.

# గ్రంథాలయము.

వేదశాస్త్రపురాణ విద్యారహస్యంబు
లాలింపఁజేయు గ్రంథాలయంబు
సర్వతంత్రాక్రాంత చర్చామృతరసంబు
గ్రోలింపఁజేయు గ్రంథాలయంబు
స్వాతంత్ర్యమున సర్వసర్వంసహారాజ్య
మేలింపఁజేయు గ్రంథాలయంబు
కామాదివిద్విషద్గ్రామ ప్రకోపంబుఁ
మాలింపఁజేయు గ్రంథాలయంబు
ధర్మనీతివివేక మర్మంబు లనిశంబు
గీలింపఁజేయు గ్రంథాలయంబు
సంసారసంతాప సాగరంబుననుండి
తేలింపఁజేయు గ్రంథాలయంబు
దేశాభిమాన విద్వేషప్రతాపంబు
వ్రాలింపఁజేయు గ్రంథాలయంబు
ఉగ్రాత్ములగు నాస్తికాగ్రగణ్యులనెల్ల
సోలింపఁజేయు గ్రంథాలయంబు
సరసగానకవిత్వ సాహిత్యములఁ గడుఁ
గ్రాలింపఁజేయు గ్రంథాలయంబు
లౌకికప్రజ్ఞావివేక ప్రచారంబుఁ
జాలింపఁజేయు గ్రంథాలయంబు
రసనాగ్రమందు సరస్వతిందాండవం
బాడింపఁజేయు గ్రంథాలయంబు
అవ్యయంబగురీతి దివ్యతేజోరాసి
నార్జింపఁజేయు గ్రంథాలయంబు
సత్పాత్రులైన విద్వత్పుంగవులఁజేరి
ప్రార్థింపఁజేయు గ్రంథాలయంబు
స్థైర్యయుక్తంబైన ధైర్యసాహసలక్ష్మి
నాశింపఁజేయు గ్రంథాలయంబు
అత్యాశమైదూఱు మృత్యుదేవతనైన
నడలింపఁజేయు గ్రంథాలయంబు
భక్తివైరాగ్యసంసక్తి సార్థక్యంబుఁ
బ్రాప్తింపఁజేయు గ్రంథాలయంబు
నానామతాంచిత జ్ఞానోదయస్ఫూర్తి
నర్థింపఁజేయు గ్రంథాలయంబు
చిత్రసృష్టిక్రియా పాత్రసాధనశక్తి
నందింపఁజేయు గ్రంథాలయంబు
మించుఁగార్యములు సాధించు విద్యుచ్ఛక్తి
నర్పింపఁజేయు గ్రంథాలయంబు
ఘనయశోయుతులైన కవిసార్వభౌముల
నర్చింపఁజేయు గ్రంథాలయంబు
కాలమెరిగింపఁజేయు గ్రంథాలయంబు
శీలముఘటింపఁజేయు గ్రంథాలయంబు
ఆలయములకునెగ్గు గ్రంథాలయంబు
పాలవెైఁబొల్చునిగ్గు గ్రంథాలయంబు.

—పిసుపాటి చిదంబరశాస్త్రి, శతావధాని.

# ద్వితీయ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రదర్శనము.

## ప్రథమ భారత పత్రికా ప్రదర్శనము.

ఈ ప్రదర్శనములయొక్క ప్రారంభోత్సవము ౧౯౧౮ సం॥ జూను నెల ౨౨ వ తేదీ ఉదయము ౭ గంటలకు పఠనమందిరమున జరిగినది. ఆహ్వానసంఘాధ్యక్షులగు భూపతిరాజు వేంకటపతిరాజుగారు ప్రతినిధులకు స్వాగతమిచ్చుచు ఇట్లుపన్యసించిరి:—

### ఆహ్వానసంఘాధ్యక్షుల ఉపన్యాసము.

గ్రంథాలయోద్యమము మనదేశమున చిరకాలమునుండి వ్యాప్తిలోనున్నను కొంతకాలముక్రిందటనుండి క్రొత్తపద్ధతులవలంబించి, క్రొత్తత్రోవలు త్రొక్కి, పూర్వముకంటె హెచ్చుగా జనసామాన్యమునకు ఉప

యోగకరముగా వెలయుచున్న విషయము తదుద్యమాభిలాషులకందఱకును కరతలామలకంబె. ఈ ఉద్యమము మనదేశమునందలి మఱికొన్ని ఉద్యమములవలె సంవత్సరములో కొలదిదినములుమాత్రము పొడమూపుచు తక్కిన కాలమంతయును ఉన్నవో లేవో అను స్థితిలో నుండక, నిరంతరము కొన్ని స్థలములలోకాకున్న మఱికొన్ని స్థలములలోనైన ప్రత్యక్షముగా కొనసాగుచున్నదనుటచేతను- సామాన్యప్రజలలో ఎక్కువమందిని ఆకర్షించి వారిచే దేశాభివృద్ధికై పనిచేయించుచున్నదనుటచేతను- మన ఉద్యమములలోనెల్ల మిన్నయన్న అతిశయోక్తికానేరదు. ఆంధ్ర గ్రంథాలయముల సంఖ్యయే దీని సత్యతను తెలుపుచున్నది.

తక్కిన ఉద్యమములతో సరిపోల్చి చూచినప్పుడు గ్రంథాలయోద్యమము మిన్నగా ఉన్నదని సంతోషించినను దీనినిగూర్చి ఇంక చేయవలసినదేమియు లేదని అనుకొనుస్థితి దీనికి ఇప్పటికిని రాలేదు. త్వరలో వచ్చునను కొనుటకును అవకాశము లేదు. ఆంధ్రదేశమున ప్రతి గ్రామమునను గ్రంథాలయములేర్పడి జనులకందఱకిని లాభకరముగా పనిచేయుచుండుట చూచి సంతసించు భాగ్యము కొలది కాలములో అబ్బునను నిబ్బరము ఎవరికిని గాని కలుగునను కొనుట కనువుగాదు. కాన, గ్రంథాలయములు హెచ్చుగా స్థాపించుటకై పలువిధముల ప్రోత్సాహపఱచుటకు ప్రయత్నము చేయుట అత్యావశ్యకము.

గ్రంథాలయ వ్యాప్తినిగూర్చి గ్రంథాలయోద్యమము అత్యున్నతస్థితిలో ఉన్న అమెరికా సంయుక్త రాష్ట్రములవారు తదుద్యమాభిలాషులు అవలంబించిన మార్గములలో గ్రంథాలయ ప్రదర్శన మొకటి. ఆమార్గమునే మన భరతఖండములో ఈ ఉద్యమమునుగూర్చి ఎక్కువగా పాటుపడి ప్రజలకు ఎంతో మేలుకలిగించుచున్న బరోడా సంస్థానమువారును అవలంబించి పనిచేయుచు, అంతటితో తృప్తిచెందక తనవలెనె ఈ ఉద్యమమునుగూర్చి పనిచేయుచున్న మనవారికి వీలగునన్ని విధముల సాయపడుచుండుట ఎంతయు శ్లాఘనీయము. అచ్చట జరుగు గ్రంథాలయ ప్రదర్శనమునుగూర్చి ఉత్తరప్రత్యుత్తరములతో సంగతులు తెలిసికొనుటతో సంతృప్తి పొందక, వ్యయప్రయాసములకోర్చి అక్కడ జరుగు ప్రదర్శనమునకు స్వయముగానే చని, ఏర్పాటులు చూచి, పలువిషయములు తెలిసికొని ఉపకరణములు సమకూర్చుకొని, నిరుడు "బారువ" లో జరిగిన నాల్గవ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభతో మొదటి గ్రంథాలయ ప్రదర్శనము జరుగుటకు ముఖ్యకారకులును, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు కార్యదర్శిగారును అగు అయ్యంకి వేంకటరమణయ్యగారి ప్రయత్నము మిక్కిలి శ్లాఘాపాత్రము. ఈ సంవత్సరము ఇచ్చట ఐదవ గ్రంథాలయ మహాసభతో ద్వితీయ గ్రంథాలయ ప్రదర్శనమే గాక ప్రథమ భారత పత్రికాప్రదర్శనముకూడ జరుపుటకు ఆయన ప్రోత్సాహమును పట్టుదలయును ఎంతయు తోడ్పడినవని చెప్పుటకు సంతసించుచున్నాడను. ఏ యుద్యమముగాని సఫలమగుటకు వ్యగ్రోత్సాహపరిపూర్ణులగు ఇట్టివారు తమ అర్థప్రాణములు ధారపోయుట అవసరము. స్వార్థపరత్వముచే ఏదో వృత్తి అవలంబింపక తమ జీవితముల పరోపకారమునకై పనికివచ్చు ఉద్యమములయందు గడుపుటకు నిశ్చయించుకొని పనిచేయు ఇట్టి స్వార్థత్యాగులు పలువురు కలిసిపాటుపడుచో ఏఉద్యమముగాని ఏల సఫలముగాదు? ఈ సందర్భమున ఈ యుద్యమమునుగూర్చి పనిచేయుచున్న నేనెఱిగిన మఱియొకరినికూడ ప్రశంసింపక తప్పదు. ఆంధ్రదేశగ్రంథాలయ సంఘ కార్యదర్శిగారివలెనే తత్సంఘోపాధ్యక్షులలో నొకరగు శ్రీ సూరి వేంకటనరసింహశాస్త్రిగారు మఱియొక వృత్తి నవలంబించినవారైనను ఈ యుద్యమమునుగూర్చి అత్యుత్సాహముతో పనిచేయుచుండుట మిక్కిలి ప్రశంసనీయమగుటేగాక యితరులకు మార్గదర్శకమనియుకూడ చెప్పనొప్పు. పలుమాటలేల? ఏయుద్యమముగాని ధనాఢ్యులై పరాపేక్షలేక పరోపకారార్థము పనిచేయువారు పూనికొనినప్పుడే సులువుగా నెఱవేఱుటకు వీలుకలుగును. ఇట్టి యుద్యమములకు పెక్కింటికి సాయముచేసి సరిగా నడిపించుటకు తగినవారును, మాన

నీయులును నగు శ్రీఆకెళ్ల సూర్యనారాయణరావుగారిని గ్రంథాలయప్రదర్శన పత్రికాప్రదర్శన ప్రారంభోత్సవమును సాగింప ప్రార్థించెద.

అంతట శ్రీఆకెళ్ల సూర్యనారాయణరావుగారు ప్రదర్శనములను తెరచి, ప్రదర్శింపబడిన వస్తువులను, పత్రికలను గ్రంథములను విశేష ఆసక్తితో దిలకించిరి.

## పత్రికలు

ఈ ప్రదర్శనము మహారాజా గజపతి హింగూపతన మందిరముయొక్క పైయంతస్థునందు ఏర్పరుపబడినది. హాలు అంతయూ పలువిధములగు ప్రదర్శనములతో నలంకరింపబడి మిక్కిలి శోభస్కరముగ నుండెను.

హిందూదేశముయొక్క అన్ని భాగములనుండియు బెంగాలీ, గుజరాతీ, హిందీ, ఉర్దు, మహారాష్ట్రము, అరవము, తెలుగు, ఆంగ్లములయందు ముద్రింపబడుచున్న ౪౦౦ పత్రికలు ప్రదర్శింపబడెను. ఇవియన్నియు పెద్దపెద్ద బల్లలమీద పరువబడియున్నవి. వీనియందు దినపత్రికలు, వారపత్రికలు, పక్షపత్రికలు, మాసపత్రికలుగూడ గలవు. ఇంతేగాక ఆంధ్రభాషయందిదివరకు ప్రకటింపబడియున్న ప్రాచీన పత్రికలనేకము ప్రదర్శింపబడినవి. వీనిలో గొన్నిటిని శ్రీఅద్దంకి సత్యనారాయణ శర్మగారును, మరికొన్నిటిని మాకేపల్లి రామచంద్రశాస్త్రిగారును ప్రదర్శించిరి. మిగిలిన పాతపత్రికలన్నిటిని కొండాలి శివరామకృష్ణారావుగారి సహాయముతో బెజవాడ రామమోహన ధర్మగ్రంథాలయమువారు ప్రదర్శించిరి.

భారతవర్షమునందు వివిధభాషలయందు ప్రకటింపబడుచున్న ఇన్నిపత్రికల నొక్కచో జూచుసరికి, భారతమాత ప్రత్యక్షమైనట్లే కన్పట్టెను. ఈ పత్రికాప్రదర్శనమువలన మహత్తరమైన లాభముగలిగెను. భారతవర్షమునందిన్ని పత్రికలు గలవాయని ప్రతివారును ఆశ్చర్యపడసాగిరి. అట్లు ఆశ్చర్యపడుటతో సంతృప్తిని వహింపక, ఆంధ్రమునందున్న పత్రికలను ఇతరభాషలయందున్న పత్రికలను పోల్చిచూచి ఆంధ్రపత్రికలు ఏవిషయములయందభివృద్ధిని పొందవలసియున్నవో; గుర్తించిరి.

## సంచార గ్రంథాలయములు.

వీనికి పిమ్మట గనపడునవి రెండుపెట్టెలు. అందులో ఒకటి చిన్నది. రెండవది పెద్దది. రెండుపెట్టెలనిండ పుస్తకములు కలవు. వీనికే సంచార గ్రంథాలయ పేటికలని పేరు. గ్రంథాలయములేని గ్రామమునకు వీనిని పంపి, అచట అవసరమునుబట్టి ౧౫ దినములు మొదలు 30 దినములవరకు ఉంచెదరు. అందుగల గ్రంథములను గ్రామస్థుల కెరువిచ్చి వానిని భద్రముగానుంచుటకు ఎవరైన పూనుకొనినయెడల, వారిగ్రామమునకీసంచార గ్రంథాలయపేటిక పంపబడును. ఆగ్రామస్థులు అందుండు గ్రంథములను చదివిన పిమ్మట- ఆపెట్టెను వేరొక గ్రామమునకంపి, ఇంకొక రకము గ్రంథములు గలిగిన పెట్టెను ఆగ్రామమునకంపబడును. ఈపద్ధతివలన గలుగు ప్రయోజనమును అందరును మెచ్చుకొనిరి.

## గ్రంథవిభజన పేటిక.

వీనికి ప్రక్కనే, గ్రంథవిభజన పేటిక ఉంచబడినది. ఇది ఒకగ్రంథాలయమునందున్న గ్రంథములయొక్క పట్టిక. ప్రతిగ్రంథమునకును పుస్తకముయొక్క పేరు- గ్రంథకర్తపేరు- విషయము-వీనిని విడివిడిగా "కార్డుల" యందు వ్రాసెదరు. ఈపేటికయందు 3 అరలున్నవి. ఒక అరయందు పుస్తకముల పేర్లు అకారాదిగా వ్రాసిన "కార్డు" లుండును. రెండవ అరయందు గ్రంథకర్తల పేర్లనుబట్టి అకారాదిగా "కార్డు" లుండును. మూడవ అరయందు విషయవిభాగమును బట్టి గ్రంథములు అకారాదిగానుండును. ఇట్టి గ్రంథముల పట్టికవలన అనేకలాభములుగలవు. ఒకచదువరి గ్రంథాలయమునకు వచ్చి పుస్తకముల పేర్లనుబట్టి తనకు కావలసిన గ్రంథమును నిర్ణయించుకొనదలచిన యెడల, మొదటిఅర వానికి సహాయభూతమగును; గ్రంథకర్తలపేర్లనుబట్టి తనకు కావలసిన గ్రంథమును నిర్ణయించుకొనదలచిన రెండవఅర

సహాయభూతమగును; విషయ విభాగమును బట్టి తనకు కావలసిన గ్రంథమును ఏరుకొనదలంచినయెడల మూడవ అర సహాయము చేయును. ఇంతేగాక, గ్రంథముల వ్రాతపట్టికకును ఈ పేటికకును వేరొక ముఖ్యమగు భేదముగలదు. మన మామూలు గ్రంథముల వ్రాతపట్టికయందు ఆంధ్రుల చరిత్రయొక్క ప్రథమభాగము "చరిత్ర" లయందు ౧౦ వ సంఖ్యను గలిగియుండు నను కొనుము. పిమ్మట ౧ హిందూదేశచరిత్ర, ౨ మహమ్మదీయుల చరిత్ర, ౩ మహారాష్ట్రుల చరిత్ర, ౪ సిక్కుల చరిత్ర, ౫ చైనాదేశ చరిత్రలు మన గ్రంథాలయమునకు వచ్చెను. అప్పుడు ఆ గ్రంథములకు వరుసగా సంఖ్యలు వేయుచువచ్చెదము. పిమ్మట "ఆంధ్రుల చరిత్ర రెండవభాగము" గాని లేక "ఆంధ్రకవుల చరిత్ర" గాని లేక "ఆంధ్రవీరుల చరిత్ర" గాని మన గ్రంథాలయమునకు సంపాదించితిమనుకొనుడు. ఇదివరలో వచ్చిన గ్రంథములకు ౧౦ నుండి వరుసగా ౫ సంఖ్యలు వేయగా ఇప్పుడు వచ్చిన "ఆంధ్రుల చరిత్రకు" గాని, "ఆంధ్రకవుల చరిత్రకు" గాని "ఆంధ్రవీరుల చరిత్రకు" గాని ౧౬ సంఖ్య వేయవలసివచ్చును. ఈ క్రొత్తపద్ధతిప్రకారమట్లు కాదు. "ఆంధ్రుల చరిత్ర మొదటిభాగము" నకు ఏ సంఖ్య వేయుదురో, రెండవభాగమునకు ఆ సంఖ్యయే వచ్చును; మూడవభాగమునకుగూడ ఆ సంఖ్యయే వచ్చును. "ఆంధ్రకవుల చరిత్రకును," "ఆంధ్రవీరుల చరిత్ర" కును దాని ప్రక్క సంఖ్యయే వచ్చును. ఈ ప్రకారమే గ్రంథవిభజన పేటికయందలి "కార్డులు" గూడ వచ్చును. అందుచేత ఈ క్రొత్తపద్ధతిప్రకారము ఒకవిషయముమీద ఉన్న గ్రంథములన్నియు - అంతర్విభాగములతోగూడ ఒకచోటనే చూడగలము - ఒకకవి వ్రాసిన గ్రంథములన్నిటిని ఒకచోటనే చూడగలము - ఒకే పేరుగల గ్రంథములన్నిటిని ఒకచోటనే చూడగలము. ఈ ప్రకారము గ్రంథవిభజన పేటిక యుండును. బీరువాయందు గ్రంథములు విషయవిభజనమును బట్టి అకారాదిగానుండును. పాతపద్ధతిప్రకారమైన యెడల ప్రతిదినమును గ్రంథముల క్రొత్తపట్టికనొకదానిని తయారు చేసినప్పటికిని, ఈ ఉపయోగము అందుండజాలదు. ఈ గ్రంథవిభజనపేటిక అనేకుల దృష్టి నాకర్షించినది.

## గ్రంథాలయభవనములు.

ఆంధ్రదేశమునందున్న కొన్ని గ్రంథాలయములయొక్క ఆకారములను దెలుపు పెట్టెలు, "ప్లానులు" ప్రదర్శింపబడినవి. ఇంతేగాక అమెరికా, ఐరోపాదేశములయందున్న గొప్ప గ్రంథాలయములయొక్క ప్లానులుగూడ ప్రదర్శింపబడినవి.

## గ్రంథాలయశాస్త్రగ్రంథములు.

అమెరికా, ఐరోపాదేశములయందు అనేక వేలరూప్యములు వ్యయపరచి ప్రముఖులచే ప్రత్యేకముగ వ్రాయింపబడిన గ్రంథాలయశాస్త్రగ్రంథములనేకములు చూపబడినవి. ఇంతేగాక ఆదేశములయందు గ్రంథాలయశాస్త్రమును గూర్చియు గ్రంథాలయములను గూర్చియు ప్రత్యేకముగ ప్రకటింపబడు పత్రికలనేకములు ప్రదర్శింపబడినవి. "గ్రంథాలయసర్వస్వము"ను ముద్దులమూటగట్టినటుల "బైండు" చేసి బెజవాడ వాణీముద్రాక్షరశాలవారు ప్రదర్శించిరి. ఆంధ్రదేశమున కొన్ని గ్రంథాలయములచే ప్రకటింపబడిన గ్రంథములపట్టికలుగూడ చూపబడినవి.

## అముద్రితగ్రంథములు.

మండపాక పార్వతీశ్వరశాస్త్రి గారు ఈ అముద్రిత గ్రంథములను ప్రదర్శించిరి:—

౧. కవితావినోదకోశము ౨. హరిశ్చంద్రనలోపాఖ్యానము ౩. విశ్వనిఘంటు ౪. ఆంధ్రీకృతిమాఘకావ్యము ౫. లక్ష్మీనారాయణసంవాదము ౬. నానార్థనిఘంటు ౭. గీతగోవిందటీక: తెనుగు ౮. పారాశరి ౯. విరాటపర్వము: ద్విపద ౧౦. భల్లాణోపాఖ్యానము ౧౧. గణచతుర్థ్యుపాఖ్యానము ౧౨. సుగ్రీవవిజయము—యక్షగానము ౧౩. అక్షరోత్పత్తిఫలాలు ౧౪. గోవ్యాఘ్రచరిత్ర ౧౫. రాఘవయాదవపాండవీయము.

## గ్రంథాలయముల పటములు.

భవనముయొక్క గోడలన్నియు వివిధదేశములయందున్న గొప్ప గ్రంథాలయములయొక్కయు వివిధదేశములయందు గ్రంథాలయోద్యమ విషయమై పనిజేయుచున్న గొప్పవారియొక్కయు పటములతో నలంకరింపబడి

యుండెను. ఒకచోట బరోడారాజు, రాణి, మొదట గ్రంథాలయోద్యమమును ప్రారంభింపజేసిన బోర్డను దొర, గ్రంథాలయ శాఖాధ్యక్షులగు కుడ్వొల్కరు-గార్ల పటములును, ఆ రాజ్యమునందున్న గొప్పగ్రంథాలయముయొక్క లోపలియాకారమును బయటిఆకారమును జూపుపటములు చూపబడినవి. మఱియొకచోట ఆంధ్రదేశగ్రంథాలయ ప్రతినిధుల మహాసభలయొక్క ఆహ్వానసంఘాధ్యక్షుల అధ్యక్షులయొక్కయు, ఆంధ్రదేశమందున్న గొప్పగ్రంథాలయములయొక్కయు పటములు జూపబడినవి. వేరొకచోట అమెరికా, ఐరోపా ఆస్ట్రేలియా, జపాను, హాలండుమున్నగు దేశములయందున్న గొప్పగ్రంథాలయములయొక్క బయటి ఆకారములను, లోపలిఆకారములను దెలుపుపటములు విరివిగా జూపబడియున్నవి. ఇంకొకచోట గ్రంథాలయోద్యమమును ప్రారంభింపజేసి, అభివృద్ధిజేసిన మహనీయులయొక్క పటములున్నవి. గ్రంథాలయ ప్రదర్శనములయొక్క పటములు, బాలశాఖలయొక్క పటములు, జర్మను దురాగతమువలన దగ్ధమైన "లోవైను" విశ్వ విద్యాలయ గ్రంథాలయపటములు, యుద్ధభటులకు గ్రంథముల నంపుపటములు— ఇట్లే వివిధరకములైన పటములు వివిధస్థలములయందు ప్రదర్శింపబడి యున్నవి.

## ఇతర పటములు.

బరోడాయందు జరుగు గ్రంథాలయోద్యమాభివృద్ధిని ఒక పటము దెలుపుచుండెను. ఆంధ్రదేశముననున్న పట్టణములు పల్లెలలయొక్క సంఖ్యలు జిల్లాలవారీగా వేయబడి, ఆ యా జిల్లాలయందు వెంటనే ఎన్ని గ్రంథాలయములు స్థాపింపవలసి యున్నదియు, ఎన్ని సంచార గ్రంథాలయ పేటికలు పంపవలసి యున్నదియు, అందుల కెంత సొమ్ము వ్యయపరుపవలసి యున్నదియు, వేరొక పటమునందు చూపబడినది. ప్రతిజిల్లాకును ఒకొక్క మండలగ్రంథాలయ మేర్పడినయెడల, ఆ మండల గ్రంథాలయమునకు వావిళ్లరామస్వామిశాస్త్రులు అందు సన్సువారును, ఇతరులును ఇచ్చురు ౨౫౦ ల విలువగల గ్రంథముల మొత్తము ఒక పటమునందు జూపబడినది. ఆంధ్రదేశముయొక్క పెద్దపట మొకటి గలదు. అందు ఆంధ్రదేశమునందు గల గ్రంథాలయముల సంఖ్యలును ఆంధ్రేతరదేశములయం దాంధ్రులచే స్థాపింపబడిన గ్రంథాలయములసంఖ్యలును జల్లాలవారీగా చూపబడినవి. ఇవిగాక ఇంకను అనేకపటములు ప్రదర్శింపబడెనవి.

## బాలశాఖ

ప్రదర్శనమున కంతకును బాలశాఖ అగ్రస్థానమును వహించిన దని జెప్ప వచ్చును. తెనుగునందు పిల్లలకొరకై సులభశైలిని వ్రాయబడిన చక్కని గ్రంథము లనేకములు ఇక్కడ జూపబడినవి. అవిజూచి తెనుగునందు పిల్లలకు పనికివచ్చు గ్రంథము లిన్ని గలవా యని పలువురు తమ ఆశ్చర్య ఆమోదములను జూపిరి. ఇంతేగాక ఆంగ్లభాషయందు పిల్లలకొరకై విశేష వ్యయప్రయాసలతో ప్రత్యేకముగ తయారు చేయబడిన అనేక గ్రంథములు చూపబడినవి. బాలురహృదయములనాకర్షించి వారికి ఆటలరూపముననే విజ్ఞానమును బోధించు అనేకవిధములైన ఆటలు, గుడ్డమీద చిన్నపిల్లలకై ముద్రింపబడినగ్రంథములు చూపబడినవి.

గుడ్డలమీద ముద్రింపబడియున్న గ్రంథములన్నిటిని (౧౫), కొన్ని ఆట్టలపెట్టెలను కొన్నిబొమ్మల పొత్తములను ప్రదర్శనమునుండి ఎవరితోడను చెప్పకయే ఎవరో తీసికొనిపోయిరి. మిగిలిన వేవియుపోక, ఇవియేపోవుటవలన, ఇవిఎంత ఆకర్షకముగనున్నదియు ఊహింపనగును.

ఈ ప్రదర్శనములవలన గలిగినలాభములనుగూర్చి ఇట వివరింప బనిలేదు. ఆంగ్లభాషయందు గ్రంథాలయములనుగూర్చిన ప్రత్యేక గ్రంథములు పత్రికలు ఇన్ని యున్నవనుసంగతి అనేకమందికి తెలియనేలేదు. పాశ్చాత్యదేశములయందు గ్రంథాలయశాస్త్ర మొక ప్రత్యేకశాస్త్రమై విలసిల్లినదని చాలమంది ఎఱుంగరు. గుడ్డలమీద పుస్తకములను ముద్రించుట యనునది చాలమంది విద్యాధికులకుగూడ నూతనవిషయము. మనపిల్లలు చదువుకొనుటయనగా పెద్దపులిని జూచినటుల జూచెదరు. అటులగాక ఆటలమూలమున పిల్లలకు జ్ఞానముకలిగించి, చదువుకొనుటవలనగూడ- ఆటలవలన వారికి గలుగు ఆనందమునే గలిగించుపద్ధతులు అసలే క్రొత్త. ఇట్టి నూతనవిషయము లెన్నియో ఈప్రదర్శనములవలన బోధపడినవి. ప్రేక్షకులును,ప్రతినిధులును, వీనిని జూచినవారెవ్వరును ఆనందపరవశులుగానివారు లేరు.

ధనుర్వేదవిశారదులును, కలియుగార్జునులును నగు

# శ్రీ గుండవరపు అప్పారావుగారి కర్పింపఁబడిన

# స్వాగత పద్యములు.

ఉ. కూరిమి వీరదంపతుల♦కుర్విఁ జనించిన భారతీయు, లా
చారతపోధురీణులయి ♦ సాధనఁజేసి గడించి రేద్విష
ద్దారణదారుణంబయిన ♦ ధర్మధనుస్సు, తదీయ తేజ మిం
పారఁగఁ గాచు మాకలియు♦గార్జును నప్పయధన్వి నెప్పుడున్.

సీ. విన్నాము కడుపులో♦నున్న కండలు కదలఁగ భారత రణ♦రంగచరిత
చెవిమొగ్గినాము, పు♦చ్చినశల్యములు మాంసగింప రామానుల♦యంపకోఁత
ఆలించితిమి గుండె♦లదరఁ బల్నాటివీరుల గండ్రగొడ్డండ్ర♦రోషపదము,
అవధరించితిమి క♦న్నవ వేడిమొలుపెక్క రాజపుత్రుల యల్లె♦త్రాళ్లమ్రోఁత
గీ. భావమున; నంతె కాని మా♦పాపనశతఁ
జూచినది లేదు, చూడఁగా♦నోచలేదు
నేటికి ధనుస్సునెత్తి సం♦ధించినావు
మా యదృష్టంబిదియె అప్ప♦రాయధన్వి.

ఉ. వ్రాసినవ్యాసవాక్యముల ♦ భావభరంబెఱుఁగంగలేని స
న్యాసుల, మిట్టిసీమగత♦నమ్మునకుం దగువీరగౌరవో
ల్లాసము నెట్లుసల్పఁగఁగ♦లారము, మాటలు లేనిమాదు వి
శ్వాసమె పచ్చకర్పుపు సు♦వాళిగ గైకొను మప్పరాణ్మణీ!

సీ. వల్లెఁజెప్పిన వేద♦పన్నాలువర్జించి బాణదేశికుఁడైన ♦ ద్రోణుశక్తి
మాన్ద్రో దకముల ని♦ర్మలమైనకరముల రక్తాంజలిడిన భా♦ర్గవుసుదీక్ష
అమృత తేజోభూత♦మయిన గంటమువీడి కత్తిదాలిచిన తి♦క్కనయశస్సు
గోచీనదల్చి కం♦గులవీరకాశెఁగట్టిన [illegible] పోత నా♦రుని తపస్సు
గీ. బ్రాహ్మణుఁడవయి ధనువుఁ జే♦పట్టినట్టి
నీభుజాయుగ పీఠి ♦ నిలచుగాత
ఆంధ్రలోకద్రోణాచార్యుఁ ♦ డనెడికీర్తి
మోయుదువుగాత శ్రీయప్ప♦రాయధన్వి.

బెజవాడ. 3–౯–౧౮.

# ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము—నిబంధనలు.

ఈసంఘముయొక్క సభ ౧౯౧౫ వ సం॥ జూలై నెల ౧౪ వ తేదిమధ్యాహ్నము ౪ గంటలకు బెజవాడ రామమోహన ధర్మగ్రంథాలయ భవనమునందు జరిగినది. అప్పుడు ఈక్రిందినిబంధనలును, తీర్మానములును చేయబడినవి:—

## నిబంధనలు.

“ఆంధ్రదేశగ్రంథాలయసంఘము, బెజవాడ” అని దీని నామము. దీనియొక్క కేంద్రగ్రంథాలయము పేరు “బెజవాడ రామమోహన ధర్మగ్రంథాలయము.”

## ఉద్దేశములు.

౧. ఆంధ్రదేశమున ధర్మగ్రంథాలయోద్యమము నభివృద్ధిచేయుట. ఈక్రిందవివరింపబడిన సాధనములవలనను అందుకు విరుద్ధముకాని ఇతర సాధనముల మూలమునను ఈయుద్యమాభివృద్ధి గావింపబడును:—

(క) బెజవాడపట్టణమున ఆంధ్రదేశమునకంతకును కేంద్రగ్రంథాలయమును నిర్వహించుట.

(చ) ఆంధ్రదేశమున స్థాపింపబడునట్టియు తదితర దేశములయందు ఆంధ్రులచే స్థాపింపబడునట్టియు, ధర్మగ్రంథాలయ సంఘములను ఈసంఘమునకు చేర్చుకొనుట, అట్టిధర్మగ్రంథాలయములను స్థాపించుట.

(ట) “మాజిక్కు లాంతరులు” “సినిమెటోగ్రాఫులు” “బయాస్కోపులు” మున్నగు యంత్రసామగ్రిని సేకరించి తన్మూలమున జనసామాన్యమునందు జ్ఞానాభివృద్ధినికలుగజేయుట.

(త) సంచారగ్రంథాలయములను నేర్పరిచి వానిని ఆంధ్రదేశమునందంతటను పంపి, తన్మూలమున జ్ఞానాభివృద్ధిని జేయుట.

౨ ఆంధ్రదేశమునందును తదితర దేశములయందును శక్తికొలదిని ధర్మగ్రంథాలయోద్యమమును గూర్చిన జ్ఞానమును వ్యాపింపజేయుట.

3 ఆంధ్రసారస్వతమునందలి గ్రంథములన్నిటికిని ప్రత్యేక ప్రాముఖ్యతతో ప్రపంచమందలి గ్రంథరాజములన్నింటికిని పనికివచ్చెడి గ్రంథవిభజనపట్టికను తయారుజేసి ప్రచురించుట.

౪ జనసామాన్యమునందు జ్ఞానాభివృద్ధినొందించుటకుగాను జ్ఞానాభివృద్ధికరములగు గ్రంథములు కరపత్రములు మొదలగు వానిని ప్రచురించుట.

౫ జనసామాన్యమునందు జ్ఞానాభివృద్ధికి సాధనములుగానుండు జాతీయ సంస్థాపనలను, కాలానుసరణములగునట్లు ఉద్ధరించుట.

౬ ఆంధ్రజాతీయవికాసమునకును ఆంధ్రవ్యక్తివికాసమునకును సాధనభూతములగు సారస్వతము, విద్య, చిత్రకళలు, చరిత్రపరిశోధన, మానవసేవ, మున్నగు పరమార్థకార్యములను చేయుట.

౭ ఈసంఘముయొక్క ఉద్దేశములను గలిగిన ఇతర ప్రతిష్ఠాపనలతో కలిసిపనిజేయుట. అట్టి వానితో సంబంధమును కలుగజేసికొనుట.

## కార్యనిర్వహణము.

౮ దీనియొక్క కార్యనిర్వహణము ఈక్రిందిసంఘములవలన జరుపబడును.

(క) సామాన్యసంఘము.

(చ) కార్యనిర్వాహకసంఘము.

(ట) సేవకసంఘము.

## సామాన్యసంఘము.

౯ ఈక్రిందివారు ఈసంఘమున సభ్యులుగ నుందురు.

(క) రాజపోషకులు.

(చ) ప్రధానపోషకులు

(ట) పోషకులు.

(త) శాశ్వతసభ్యులు.

(ప) సామాన్యసభ్యులు (ఒకటి, రెండు, మూడు తరగతులవారు.

(గ) సేవకులు.

(ఘ) జిల్లాగ్రంథాలయసంఘములయొక్క కార్యదర్శులలో ఒకరును అగ్రాసనాధిపతియును తమపదవులనుబట్టియే ఇతరచందాలను చెల్లింపవలసిన యవసరములేకనే ఈసంఘమునందు సభ్యులుగనుందురు.

(చ) ఈసంఘమునకు చేరు ఉపసంఘములనుండి ప్రతి జిల్లాకును, ఆజిల్లాయందలి సంఘములచే ఎన్నబడు ఒక ప్రతినిధి.

(ఛ) ఈసంఘమునందు ఏర్పడునట్టి ఉపశాఖలయొక్క అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు.

౧౦ రాజపోషకులు:— ఈసంఘమునకు గాని, ఈ సంఘమునకు చేరిన మరియేయితర ప్రతిష్ఠాపనకు గాని, రు ౨౫౦౦ లు గాని, అంతకు ఎక్కువసొమ్మునుగాని విరాళముగ నొసంగువారు.

౧౧ ప్రధానపోషకులు:— ఈసంఘమునకు గాని, దీనికి చేరిన మరియే యితరప్రతిష్ఠాపనకు గాని, రు ౧౦౦౦ లు మొదలు రు ౨౫౦౦ లవరకు విరాళము నిచ్చెడివారు.

౧౨ పోషకులు:— ఈసంఘమునకు ప్రతివత్సరమును నూరురూపాయల విరాళమిచ్చెడివారు.

౧౩ శాశ్వతసభ్యులు:— ఈసంఘముయొక్క మూలధనమునకు రు ౨౦౦ ల విరాళమిచ్చెడివారు.

౧౪ సామాన్యసభ్యులు:— సంవత్సరమునకు రు ౧౨ లకు తక్కువగాని చందానిచ్చెడివారు మొదటితరగతి సామాన్యసభ్యులు. సంవత్సరమునకు రు ౬ లకు తక్కువగాని చందానిచ్చెడివారు రెండవ తరగతి సామాన్య సభ్యులు. సంవత్సరమునకు రు ౩ లకు తక్కువగాని చందానిచ్చెడివారు మూడవ తరగతి సభ్యులు.

పదునెనిమిదివత్సరములు వయస్సుగల పురుషుడుగాని స్త్రీగాని ఏజాతివారైనను, ఈసంఘముయొక్క ఉద్దేశములయందు అభిమానమును దెలుపుచు, ఇద్దరుసభ్యుల సిఫారసుతో దరఖాస్తునంపినమీదట, కార్యనిర్వాహక సంఘము వారియనుమతికిలోబడి సభ్యుడుగ జేరవచ్చును. కార్యనిర్వాహకసంఘమువారి అనుమతి ఇచ్చుటకు పూర్వము కార్యదర్శి ఆసంఘమువారి అనుమతికిలోబడి, అట్టిదరఖాస్తును తాత్కాలికముగ అంగీకరింపవచ్చును. కార్యనిర్వాహక సంఘమువారు ఏదరఖాస్తునైన కారణమును దెలుపకయే నిరాకరింపవచ్చును.

౧౫ సేవకులు:— సేవకసంఘసభ్యులలో నిద్దరిచే పేర్కొనబడి, ఆసంఘసభ్యులలో మువ్వాతిక వంతుచే, అంగీకరింపబడి, కార్యనిర్వాహకసంఘముచే అంగీకరింపబడినవారు సేవకులు. అట్టివారు తాము కనీసము పదిసంవత్సరముల కాలము ఈసంఘనిబంధనలకులోబడి, ఈసంఘముయొక్క కార్యములను నెరవేర్చెదమని ప్రమాణపత్రిక నియ్యవలెను.

సామాన్యసభ్యులు తప్ప, మిగిలిన తరగతులసభ్యులు చందాలనియ్యవలసిన యవసరము లేదు.

ఉద్యోగులు:— ఈసంఘమునకు ఒక అధ్యక్షుడును, ముగ్గురకు తక్కువకాని ఉపాధ్యక్షులును ఉందురు. ఉపాధ్యక్షులలో ఇద్దరు బెజవాడవాస్తవ్యులై యుండవలెను.

మరియు ఒక కార్యదర్శి ముగ్గురు సహాయకార్యదర్శులుగూడనుందురు. కార్యదర్శిని, సేవకసంఘసభ్యులలోనుండి ఎన్నుకొనవలెను. సహాయకార్యదర్శులలో ఇద్దరు బెజవాడవాస్తవ్యులైయుండవలెను. మండలగ్రంథాలయములయొక్క అధ్యక్షులందరును తమపదవినిబట్టియే ఈసంఘమునకు ఉపాధ్యక్షులగుదురు.

సభలు:— ఈసంఘముయొక్క సభలకు, మొత్తము సభ్యులలో మూడవవంతును, ఆసంఖ్య ౨౦ కి మించినప్పుడు, ౨౦ మందిసభ్యులును "కోరం" అయియుందురు. ఈసంఘసభనియమిత కాలమునకు ఒకగంటలోపుగా "కోరం" కానియెడల, అప్పుడు హాజరుఉన్న సభ్యులు సభాసమావేశమునకు మరియొకదినమును నిర్ణయింపవలెను. అట్లు రెండవసారి నిర్ణయింపబడినసభకు "కోరం" వచ్చినను రాకపోయినను సభాకార్యములను నిర్వహింపవచ్చును.

ఈసంఘమువారు సంవత్సరమునకు అర్థమునకు ఒకసారియైన సమావేశముగ నుండవలెను. అట్టిసమావేశమునందు హోదాదారులను ఎన్నుకొనుట, కార్యనిర్వా

హకసంఘమును ఎన్నుకొనుట, ఆసంఘమువారుతయారు జేసిన ఆదాయవ్యయముల మదింపును అంగీకరించుట మొదలగునవి జరుగవలెను. క్రొత్తఎన్నికలు జరుగు వరకును వెనుకటి హోదాదార్లే ఉద్యోగములను నిర్వహింపవలెను.

ఈసంఘసమావేశముల యందు గమనింపవలసిన నిబంధనలను హోదాదార్లలో సంవత్సరము మధ్యగలిగిన ఖాళీలను పూర్తిజేయుట, ఏయే హోదాదారులు ఏయేవిధులను నిర్వర్తింపవలెననుట, ఈ సంఘమునకు దీనికి చేరు సంఘములకు గల సంబంధములు, ఇంకను అవసరములగు ఇతరసంగతులనుగూర్చిన నిబంధనలను సామాన్య సంఘమువారు అవసరమునుబట్టి చేయుచుండవలెను.

## కార్యనిర్వాహకసంఘము.

౧౭ ఈసంఘమునకు ౧౫ కును తక్కువకానట్టి సభ్యులుండవలెను. ఈక్రిందిరీతిని ఈసంఘమందలి సభ్యులు నిర్ణయింపబడుదురు.

(క) సేవకసంఘమునందు అయిదుగురుసభ్యులుగాని అంతకు తక్కువగాని ఉన్నప్పుడు వారందరును, అంతకుఎక్కువమంది ఉన్నప్పుడు ఆసంఘముచే ఎన్నుకొనబడిన అయిదుగురు సభ్యులును.

(చ) తమపదవులనుబట్టి సామాన్యసంఘములోసభ్యులుగానుండు మండలగ్రంథాలయముల కార్యదర్శులలో ఒకరు, అధ్యక్షుడును.

(ట) తమపదవులనుబట్టి అంతశ్శాఖా సంఘముల కార్యదర్శులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు.

(త) జిల్లాకు ఒక్కరుచొప్పున ఉపసంఘములచే ఎన్నుకొనబడిన ప్రతినిధులు.

(ప) సామాన్యసంఘముయొక్క కార్యదర్శి సహాయ కార్యదర్శులు, ఈసంఘమునకు కార్యదర్శిసహాయ కార్యదర్శులుగను ఉందురు.

(గ) సేవకసంఘమునుండి ఈసంఘమునకు ఒకఅగ్రాసనాధిపతిని గ్రంథభాండాగారిని, సామాన్యసంఘముచే ఎన్నుకొనబడవలెను.

(జ) సామాన్య సంఘముయొక్క అగ్రాసనాధిపతి ఉపాగ్రాసనాధిపతులు, కార్యదర్శి సహాయకార్యదర్శులు, గ్రంథభాండాగారి.

(డ) మిగిలినసభ్యులను సామాన్యసంఘమువారు ఎన్నుకొనవలెను. తమపదవులనుబట్టి, కార్యనిర్వాహక సంఘమునందు సభ్యులుగ ఏర్పడునట్టివారి సంఖ్యకు రెట్టింపు ఇతర సభ్యులు ఈ సంఘమునందుండవలెను. సేవకసంఘమునుండి పైనచెప్పబడినప్రకారము ఎన్నుకొనబడి కార్యనిర్వాహక సంఘమునకువచ్చు ఐదుగురు సభ్యుల వరకుమాత్రము వారు తమపదవినిబట్టి వచ్చిన సభ్యులుగ ఎన్నబడుదురు. బెజవాడవాస్తవ్యులగు సేవకసంఘసభ్యులతోగూడ ఈసంఘమునందు తొమ్మండుగురకు తక్కువకానిసభ్యులు బెజవాడవాస్తవ్యులుండవలెను.

శాఖాసంఘములను స్థాపించుట, చేర్చుకొనుట, చేర్చుకొనిన వానిని తీసివేయుట, సామాన్యసంఘసభలనుపిలుచుట, ఆంధ్రదేశగ్రంథాలయప్రతినిధుల మహాసభనేర్పాటుజేయుట, అంతశ్శాఖాసంఘములను ఏర్పరచుట, సంవత్సరపు ఆదాయవ్యయముల మదింపును తయారుచేయుట, ఆస్తినిసంపాదించుట, ఆదాయవ్యయములను పరిపాలించుట, అప్పులనుచేయుట తీర్చుట, ఈసంఘముయొక్క ఉద్దేశముల నాచరణయందు బెట్టుటకు ఆవశ్యకములైయున్న ఇతరకార్యములను జేయుటయును ఈ సంఘముయొక్క విధులైయున్నవి. ఈసంఘముయొక్క సభలకు "కోరం" నలుగురుసభ్యులు ఈసంఘముయొక్క సభ 3 మాసములకొకసారి జరుగవలెను. ఈసంఘసభ్యులెవరైన ముగ్గురు ఈసంఘముయొక్క సభను జరుపవలసినదని అవసరమును దెలుపుచు, కార్యదర్శిని వ్రాతమూలముగ కోరినమీదట, కార్యదర్శి సభను పిలువవలెను. సామాన్యసభలకును కార్యనిర్వాహకసభలకును కనీసము వారముదినములుముందుగా ఆహ్వానపత్రికలను సభ్యులకు పంపవలెను.

సామాన్య సభలను సమావేశముచేయవలసినదని పదిమందికి తక్కువకానిసభ్యులు కార్యదర్శికి తెలిపినమీదట అట్లు సభనుకార్యదర్శిసమావేశము చేయవలయును.

## సేవకసంఘము.

౧౮ సేవకులందరును గలసి ఈసంఘమునందు సభ్యులుగనుందురు. సామాన్యసంఘముయొక్క కార్యదర్శియే ఈసంఘమునకు గూడ కార్యదర్శిగనుండును.

ఈసంఘమునకు ఈక్రిందివాక్కు బాధ్యతలుండును.

(క) ఆయిదుగురకుమించకుండా, కార్యనిర్వాహక సభకు సభ్యులనెన్నుకొనుట.

(చ) ఆదాయవ్యయముల లెక్కలను అమలులోనికి దెచ్చుట.

(ట) సంఘమునకు చేరిన శాఖాసంఘములను పరిశీలించుట, క్రొత్తవానినిస్థాపించుట, గ్రంథాలయోద్యమమును వ్యాప్తము గావించుట, ఈసంఘముయొక్క ఉద్దేశములను ఆచరణయందు బెట్టుటకు కావలసిన సకలమైన కార్యములను నిర్వర్తించుట.

(త) సంవత్సర కార్యవివరణమును తయారుజేసి కార్యనిర్వాహక సంఘమువారి యంగీకారముతో సామాన్యసంఘమునకు విదితపరుచుట.

(ప) కేంద్రగ్రంథాలయమునకు గ్రంథముల నేర్చుట.

(గ) ఈకార్యములను ఆచరణలోనికి దెచ్చుటకు కావలసిన నిబంధనలను జేసికొనుట.

౧౯ సామాన్యసంఘముయొక్క అగ్రాసనాధిపతి:— ఈయన సామాన్యసంఘసభలయందు అధ్యక్షతనువహించుట, కార్యదర్శిద్వారా గాగాని, అతనికి తెలియజేసిన నెలదినములలోగా సభను పిలువనియెడల స్వయముగా గాని, సామాన్యసభను కూర్చుట, సంఘముయొక్క ఆస్థిని ఇతరహోదాదారులు చేయుపనులను, దీనికిసంబంధించిన సంఘములను తనిఖీచేయుట.

౨౦ సామాన్యసంఘముయొక్క ఉపాగ్రాసనాధిపతులు:— అగ్రాసనాధిపతి హాజరులేనప్పుడు సామాన్యసంఘసభలయందు అధ్యక్షతవహించుట, సంఘముయొక్క ఆస్థిని, ఇతరహోదాదారులుచేయుపనులను, దీనికి సంబంధించిన సంఘములను తనిఖీచేయుట.

౨౧ కార్యదర్శి:—సంఘముతో సంబంధించినయావత్తు దస్తావేజులను, లెక్కలను, స్వాధీనమునందుంచుకొనుట. సంఘముయొక్క లెక్కలనుంచుట- కార్యనిర్వాహక సంఘముయొక్క తీర్మానములకులోబడి సంఘద్రవ్యమును వినియోగించుట. సేవకసంఘముయొక్కయు, కార్యనిర్వాహకసంఘముయొక్కయు, సామాన్యసంఘముయొక్కయు సభలను సమావేశము జేయుట- సేవకసంఘమువారి తీర్మానములకు లోబడి నౌకరుల నేర్పరచుట, తీసివేయుట - సంఘముతో కోర్టునకు సంబంధించినట్టియు, దస్తావేజులకుసంబంధించినట్టియు అన్ని వ్యవహారములను సంఘపక్షమున నిర్వహించుట- ఈ సంఘమువారేర్పరచినట్టి అంతశ్శాఖాసంఘములయందును ఈసంఘమునకు చేరినట్టి యావత్తుసంఘములందును ఈ సంఘముయొక్క కార్యదర్శి తనపదవినిబట్టియే సభ్యుడుగ నుండును.

౨౨ సహాయకార్యదర్శులు:—అన్ని వ్యవహారములయందును కార్యదర్శికి సహాయముచేయుట. కార్యదర్శి గ్రామమునందు లేనప్పుడు ఆయన హక్కులను గలిగియుండుట.

౨౩ గ్రంథభాండాగారి:— కేంద్రగ్రంథాలయమునందలి గ్రంథములను స్వాధీనమునందుంచుకొని, సరియైన స్థితియందుంచుట- బాలశాఖను నిర్వహించుట.

౨౪ కార్యనిర్వాహకసంఘముయొక్క అగ్రాసనాధిపతి:—కార్యనిర్వాహకసంఘసభలకెల్ల వీరగ్రాసనాధిపత్యమును వహించెదరు. కార్యనిర్వాహకసంఘముతో గూర్చిన అన్నిపనులు సక్రమముగా జరుగునట్లు తనిఖీ చేయవలయును.

౨౫ కార్యనిర్వాహకసంఘముయొక్క ఉపాగ్రాసనాధిపతులు:—అధ్యక్షులు లేనిసమయమందు కార్యనిర్వాహకసభలయందు అధ్యక్షతనువహించుట. మిగిలిన పనులయందు అగ్రాసనాధిపతికి సహాయము చేయుట. అధ్యక్షుడు గ్రామమునందు లేనప్పుడు ఆయనయొక్క హక్కులను గలిగియుండుట.

౨౬ లెక్కలు:— తెలుగుసంవత్సరాదితో ఈసం

ఘముయొక్క లెక్కలు ప్రారంభమగును. ఈసంఘము యొక్క లెక్కలను ప్రతిసంవత్సరమును కార్యనిర్వాహకసంఘముచే నిర్ణయింపబడు తనిఖీదారునిచే తనిఖీ చేయింపవలెను.

౨౭ అంతశ్శాఖా సంఘములు :—కార్యనిర్వాహక సంఘమువారిచే అంతశ్శాఖా సంఘములు ఏర్పాటుచేయుబడవలయును. అట్టి శాఖలకు ఒక అధ్యక్షుడు, ఇద్దరుఉపాధ్యక్షులు, ఒకకార్యదర్శి ఉండవలయును. స్థాపించునపుడు మొదటి వత్సరమునకు హోదాదార్లను కార్యనిర్వాహక సంఘమువారే ఎన్నుకొనవలయును. పిమ్మట ప్రతివత్సరమును సామాన్య సంఘసభయందు సంఘముయొక్క మిగిలిన హోదాదార్లతోగూడ, ఈ అంతశ్శాఖాసంఘముల హోదాదార్లను ఎన్నుకొనవలయును. అంతశ్శాఖాసంఘములయొక్క హోదాదార్లు అందరును తమ పదవులనుబట్టి కార్యనిర్వాహకసభయందును, సామాన్యసభయందును సభ్యులగుదురు. అంతశ్శాఖలు ప్రత్యేకముగ కార్యనిర్వాహకసభచే చేయుబడు నిబంధనల ననుసరించి పనిచేయవలెను.

౨౮ ఈ క్రింది అంతశ్శాఖలను వెంటనే స్థాపించడమయినది.

౧ సేవాశాఖ.

౨ సారస్వతశాఖ.

౨౯ ఇతర సంఘములు ఈ సంఘమునకు ఉపసంఘములుగ జేరవచ్చును. అట్టి ఉపసంఘములు సంవత్సరమునకు ఒకరూపాయి చందానియ్యవలెను. ఈ ఉపసంఘములు ఒకజిల్లాలో నుండునవియన్నియు కలసి ఒక ప్రతినిధినెన్నుకొని కార్యనిర్వాహక సంఘమునకు సభ్యునిగ పంపవచ్చును.

౩౦ గ్రామ గ్రంథాలయములు, పఠన మందిరములు :—గ్రామ గ్రంథాలయములుగాని, పఠనమందిరములుగాని ఈసంఘమునకు ఉపసంఘములుగగాక సభ్యులుగగూడ చేరవచ్చును. సామాన్యసభ్యులు ఇచ్చుచందాలనే ఇయ్యవలయును. వారి నిబంధనలే వీరికిని చెల్లును. ఈ సంఘమువారిచే పంపబడు ఒక ప్రతినిధి సామాన్యసంఘమునందు సభ్యుడుగనుండును. అయితే అట్టిప్రతినిధి సంవత్సరము పొడుగునను ఒక్కడేయై యుండవలెను.

౩౧ తాలూకా గ్రంథాలయ సంఘములు :—ప్రతి తాలూకాకును గ్రామగ్రంథాలయముల పైని తాలూకా సంఘములుండును. ఈ తాలూకా సంఘములుగూడ గ్రామగ్రంథాలయములవలెనే ఈ సంఘమునకు శాఖలుగ చేరవచ్చును.

౩౨ మండలగ్రంథాలయ సంఘములు :—సామాన్య సభ్యులకున్న నిబంధనలే ఈ సంఘములకుగూడ చెల్లును. అయితే మండల సంఘముయొక్క కార్యదర్శి ఈ సంఘముయొక్క సామాన్య కార్యనిర్వాహక సభలయందు సభ్యుడుగాను, మండలసంఘముయొక్క అధ్యక్షుడు, ఈ సంఘమునకు ఉపాధ్యక్షుడుగను ఉండును.

## ఆంధ్రదేశగ్రంథాలయప్రతినిధుల మహాసభ.

ప్రతివత్సరమును సామాన్యముగా మేనెలయందు, ఆంధ్రదేశమునందున్న మండలములన్నిటియందును, సంవత్సరమున కొక్కొకమండలమునందు ఈ సభను జరుపుచుండవలయును. ఈ సభను జరుగు స్థలమునందే, దీనిని జరుపుటకు ఆహ్వానసంఘ మేర్పాటుగావలయును. సభయొక్క అగ్రాసనాధిపతిని ఆహ్వానసంఘమువారే ఏర్పరుపవలెను. కాని అట్టి అగ్రాసనాధిపతి నిర్ణయించునపుడు ఈ సంఘమువారితో ఆలోచించవలెను. ప్రతినిధులవలన వసూలగు రుసుమును ఈ సంఘముయొక్క ఖర్చులకుగాను ఇయ్యవలయును. అట్టి రుసుము రు ౧ కి మించియుండగూడదు.

## సేవకులు.

౩౩ ఈ క్రిందివారిని సేవకులుగా అంగీకరించడమైనది.

౧ అయ్యంకి వేంకటరమణయ్యగారు
౨ సూరి వేంకటనరసింహశాస్త్రిగారు
౩ చట్టి నరసింహారావుగారు
౪ నిడమర్తి లక్ష్మినారాయణగారు
౫ గాడేపల్లి సూర్యనారాయణశర్మగారు

౬ కొండాలి శివరామకృష్ణారావుగారు
౭ పులిపాక వెంకటరామారావుగారు
౮ గోపరాజు బ్రహ్మానందంగారు

## ఉద్యోగులు.

ఈ సంఘమునకు ఈసంవత్సరము ఈక్రిందివారిని ఉద్యోగులుగ ఏర్పాటు చడమైనది.

అధ్యక్షులు — మోచర్ల రామచంద్రరావుగారు
ఉపాగ్రాసనాధిపతులు — చేబ్రోలు లచ్చారావుగారు
బొడ్డపాటి వెంకటప్పయ్యగారు
సి. రాజగోపాలాచారిగారు
కార్యనిర్వాహక సంఘముయొక్క అగ్రాసనాధిపతి
సూరి వెంకటనరసింహశాస్త్రిగారు.
కార్యదర్శి—అయ్యంకి వెంకటరమణయ్యగారు.
సహాయ కార్యదర్శులు:—
శిష్టా వెంకటకృష్ణయ్యగారు
వంటు సుబ్బరధానులుగారు
చట్టి నరసింహారావుగారు
గ్రంథభాండాగారి—గోపరాజు బ్రహ్మానందంగారు.

ఈ క్రిందివారిని సేవకులనుండి కార్యనిర్వాహక సంఘమునకు సభ్యులుగ ఏర్పాటుచడమైనది.

౧ సూరి వెంకటనరసింహశాస్త్రిగారు
౨ అయ్యంకి వెంకటరమణయ్యగారు
౩ గోపరాజు బ్రహ్మానందంగారు
౪ చట్టి నరసింహారావుగారు
౫ గాడేపల్లి సూర్యనారాయణశర్మగారు

ఇతర కార్యనిర్వాహక సభ్యులు.

౧ అయ్యదేవర కాళేశ్వరరావుగారు
౨ చుండూరు సీతారామయ్యగారు
౩ కోవెలమూడి గోపాలకృష్ణయ్యగారు
౪ శింగరాజు సుబ్బారావుగారు
౫ మల్యాల గోపాలరావుగారు
౬ చాగంటి కామరాజుగారు
౭ నాళం కృష్ణారావుగారు
౮ యం. సోమయాజులుగారు
౯ గుత్తా వీరయ్యగారు
౧౦ కొండాలి శివరామకృష్ణారావుగారు
౧౧ నిడమర్తి లక్ష్మీనారాయణగారు
౧౨ తిత్తి బలరామయ్యగారు
౧౩ టంకాల సాంబమూర్తిగారు
౧౪ గ్రంధి రామమూర్తిగారు
౧౫ కొరుకొండ సూర్యనారాయణమూర్తిగారు
౧౬ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు
౧౭ ప్రభల లక్ష్మీనరసింహంగారు
౧౮ శ్రీ విక్రమదేవవర్మగారు
౧౯ కోన వెంకట్రాయశర్మగారు
౨౦ వెల్లంకొండ రాఘవరావుగారు
౨౧ యం. రామకోటేశ్వరరావుగారు
౨౨ అబ్బినేని రాఘవయ్యచౌదరిగారు
౨౩ సి. పి. రంగంశెట్టిగారు
౨౪ గోనుగుంట్ల వెంకటసుబ్రహ్మణ్యంగారు

మిగిలిన జిల్లాలకు ముందుసభలందు ఏర్పాటుచడమగును.

తీర్మానము :—ఆంధ్రమహాజనసభ స్థాపితోప సంఘమునకు సభ్యునిగ, ఈసంఘపక్షమున అయ్యంకి వెంకటరమణయ్యగారిని ఎన్నుకొనడమైనది.

అందరిచే అంగీకరింపబడినది.

తీర్మానము :—ఆంధ్రపత్రిక కాళయుక్తి సంవత్సర సంచికయందున్న "ఆంధ్రకవుల యపరాధములు" అను పద్యములయందున్న అంశములను గూర్చి చర్చించి తీర్మానించుటకు పండితుల సభను సాధ్యమైనంత త్వరలో గూర్చుటకు కార్యదర్శిగారికి అధికారమియ్యడమైనది.

ఉ. చట్టి నరసింహారావుగారు.
ఆ. పులిపాక వెంకట్రామారావుగారు.
ఎక్కువమంది సభ్యులచే అంగీకరింపబడినది.

# విజ్ఞప్తి

ఐదవ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభయొక్కయు, ద్వితీయ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రదర్శనము—ప్రథమ భారత పత్రికా ప్రదర్శనముల యొక్కయు వృత్తాంతములతోడను, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారు నూతనముగా జేసిన నిబంధనలతోడను, ఈసంచిక యంతయు నిండిపోయినది. అందుచేత సారస్వత మహాసభయొక్కయు, కొన్ని మండలగ్రంథాలయ ప్రతినిధుల మహాసభల యొక్కయు, కొన్ని ఇతర సంఘముల యొక్కయు వృత్తాంతముల నిందు ముద్రింపజాలమైతిమి. వానిని ముందు సంచికయందు ప్రకటించుచున్నారము.

ఈ సందర్భమున మఱియొక సంగతి నివేదింపవలసియున్నది. ఆంధ్రదేశమునందున్న గ్రంథాలయముల సంఖ్యలో సగమైనను, గ్రంథాలయ సర్వస్వమును దెప్పించుటలేదు. ఆ కారణమువలన ఘోరసంగ్రామముచే ఆరురెట్లు కాగితముల ధర పెరిగిపోయిన ఈదినములయందు, దీనిని నిర్వహించుటయే దుర్ఘటముగ నున్నది. అట్టిస్థితియందు, అవసర ముండినప్పటికిని, ఈభాగమునందు ఇంకను ఎక్కువ పుటల నచ్చొత్తించి మిగిలిన సభల వృత్తాంతములనుగూడ ఇందు ప్రకటింపజాలమైతిమి. ఇప్పుడు వేయుచున్న పుటలకైన, చందాదారులిచ్చు సొమ్ము ఎంతమాత్రమును సరిపోవుటలేదు. పోషకుల సహాయముచేతనే దీనిని ఈరీతిగానైన నడుపగలుగుచున్నారము. కావున గ్రంథాలయోద్యమాభిలాషులందరును, దీనికి ఇంకను చందాదారులను జేర్చి, సహాయము చేయుదురని ప్రార్థన. ఇప్పుడున్న చందాదారులందరును, ఒక్కొక్కరు ముగ్గురు చందాదారులనైన చేర్చినయెడల, "గ్రంథాలయ సర్వస్వము"నందింకను ఎక్కువ పుటలను వేసి ఎక్కువ ఉపయోగకరముగ చేయుటకు అనువుగ నుండును. ఉద్యమాభిలాషులారా! లెండు! నడుములు కట్టుడు!! ఇంతమాత్రము సహాయము చేయనియెడల మనము కార్యశూరుల మెట్లగుదుము!!!

# బాలనామకరణము

స్వాగతము! బాలభటుఁడ! సుస్వాగతమ్ము!!

జీవితానందమునకును పావనత్వ
మునకు మహిమమునకును సంపూర్ణతకును
ప్రకట సుఖదుఃఖములకు సంగ్రామములకు
అన్నిఁటికి బాలయోధుఁడా! స్వాగతంబు!
స్వాగతంబు! సుమూర్తికి స్వాగతంబు!!
ఊర్మి మావానిఁగాఁ జేసికొనుచు నున్న
బాలుఁడా! నేఁడు మానవత్వఁపు కిరీట
చిహ్నతో మేము మూర్ధాభిషిక్తుఁ జేయు
బాలసోదరుఁడా! నీకు స్వాగతంబు!
నీకు మేమిచ్చు నామము నిక్కముగ
ముగను నీవుంచుటకుఁగాను మిగుల నియతిఁ
జేయుచున్నాము నేఁడు దీక్షితుని నిన్ను
నిర్భయుండవై సదా నీవు నెగడుటకును
ధర్మజీవితమున సదా తనరుటకును
మేము దీక్షితుఁ జేయుచున్నాము నిన్ను
అనుసరింపుము! నీహృదయము నె నీవు.
నిస్సహాయుఁడవైనను నీ స్వధర్మ
మనుసరింపఁగ సంసిద్ధుఁడగుము నీవు.
ఈప్రపంచము వార్షించె నేని మేలె!
కాని అద్దాని తీక్ష్ణ రూక్షత్వమునకు
వెరవఁబోకుము! స్వాతంత్ర్య వీరభటుఁడ!
మాదు కాన్యాశలెల్ల నీమీఁదపడును
ఇపుడు మేము ధరించెడు నీధ్వజంబు
నీదగును రేపు మున్ముందు నీవు బ్రోవ
మేము నిను జేర్చుకొనుచు నున్నాము నేఁడు
మాదళంబున నీ విక్రమంబుకలన
ధర్మ సంరక్షకులును స్వాతంత్ర్యయుక్తు
లైన ధన్యుల కోటిలో నీ నవీన
నామమును జూచెదవుగాక! నాయనుంగు
బాలయోధుఁడ! నీకు సుస్వాగతంబు!

—మంగిపూడి వేంకటశర్మ.

# When you buy a book, try this test:—

## గ్రంథమును కొనునపుడు పరిశీలింపవలసిన ముఖ్యవిషయములు.

౧ అందముగనున్నదా?

౨ మంచిభాషయందు వ్రాయఁబడినదా?

౩ మనజీవిత విధానమును తెలుపునా?

౪ మనజ్ఞానమును అభివృద్ధిచేయునా?

౫ మనవ్యవహారమునకు ఉపకరించునా?

౬ హితమును బోధించునా?

౭ సన్మార్గజీవితమునకు సాయపడునా?

౮ మనజీవితములను సారవంతముచేయునా?

౯ ఆప్తునివలె ప్రేమింపతగియున్నదా?

ఈ విషయములన్నిటిని సంతృప్తిపరచగల మంచి గ్రంథముల ప్రకటనకొరకు, రాబోవు గ్రంథాలయ సర్వస్వముయొక్క ఈ పుటనే జూడుడు.

---

## పల్నాటి వీర చరిత్ర.

శ్రీనాథమహాకవి విరచితము. వెల రు 1-0-0 మాత్రమే.

"చిన్న చిన్న రాళ్లు చిల్లరదేవుళ్లు, నాగులేటినీళ్లు నాపరాళ్లు,
సజ్జజొన్నకూళ్లు సర్పంబులును దేళ్లు, పల్లెనాటిసీమ పల్లెటూళ్లు."

తమ అద్వితీయ శౌర్య ధైర్యసాహసాది సద్గుణంబులచే ఒక్క ఆంధ్రదేశముననేగాక భారతవర్షమున కంతకును ఆదర్శప్రాయమైయొప్పిన వీరుల పావనచరిత్రము ఇందు వర్ణింపబడి యున్నది. ప్రతి గ్రంథాలయమును తప్పక కొనదగినది. నూరు ప్రతులు మాత్రము గలవు. ఈ సమయముతప్పిన మరిదొరకజాలదు. ఈ యుద్ధసమయమున తిరిగి ముద్రించుట దుర్లభము. వలయువారిట్లు వ్రాయవలెను:—

మేనేజరు, గ్రంథాలయసర్వస్వము, బెజవాడ.

| | మనసు ఫౌండేషన్<br>పుస్తకాల పరిశీలనాపట్టిక |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A110 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 51 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | [illegible] |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | Pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనిది | |
| తప్పులు | NO |
| పరిస్థితి | Good |